




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



భగత్‌సింగ్ యువతకు ఎలా ఆదర్శనీయుడైనాడు!

ఉద్రిక్తతలను పెంచనున్న యూరప్ 'అణు ఛత్రి' వాదన

బంగ్లాదేశ్ జర్నలిస్టులకు గెజిటెడ్ ఆఫీసర్ జీతం

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 113 | ఆదివారం | 23-03-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను

# మరో పాతికేళ్లు ఆపండి



- చెన్నైలో డిఎంకె నాయకత్వంలోని జెఎసి సమావేశం తీర్మానం
- సీట్లు తగ్గే రాష్ట్రాలకు న్యాయం చేసేలా రాజ్యాంగ సవరణలు
- ప్రధానమంత్రిని కలిసి ఉమ్మడి విజ్ఞప్తి చేయాలని నిర్ణయం
- సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల సిఎంలు ముఖ్యనేతలతో పాటు పంజాబ్ సిఎం, ఒడిశా సిఎం

**చెన్నై :** జనాభా ప్రాతిపదికపై జరిపే పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనను మరో పాతికేళ్ళు స్తంభింపజేయాలని కేంద్ర ప్రభుత్వానికి వివిధ పార్టీలు విజ్ఞప్తి చేశాయి. పునర్విభజన లేకుండా రాబోయే 25 సంవత్సరాలపాటు 1971 జనాభా గణాంకాల ప్రకారం పార్లమెంటరీ నియోజకవర్గాలను కొనసాగించాలని డి.ఎం.కె నాయకత్వంలో శనివారం చెన్నైలో జరిగిన సంయుక్త కార్యాచరణ కమిటీ (జెఎసి) మొట్టమొదటి సమావేశం తీర్మానం చేసింది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ సారథ్యంలో ఈ జెఎసి జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రతిపక్ష బిఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కెటి.రామారావు, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కేరళ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినయ్ విశ్వం, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ ప్రభృతులు సమావేశంలో పాల్గొన్నారు. దక్షిణాదిన ఆంధ్రప్రదేశ్ నుండి మాత్రం ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరుకాలేదు. 'న్యాయబద్ధమైన పునర్విభజనకు భరోసా'' ఇవ్వాలనే డిమాండ్‌తో ఈ జెఎసి సమావేశం జరిగింది. పునర్విభజనవల్ల సీట్లు తగ్గుతాయని ఆందోళన చెందుతున్న రాష్ట్రాలకు చెందిన ఎంపిల కీలక కమిటీ ద్వారా ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి ఉమ్మడిగా ఒక లిఖిత విజ్ఞాపన అందజేయాలని సమావేశం తీర్మానించింది. వివిధ రాష్ట్రాలకు చెందిన రాజకీయపార్టీల నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ నాయకులే సంబంధిత రాష్ట్రాల అసెంబ్లీలో ఈ సమస్యపై తీర్మానాలు చేయడం ద్వారా ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తారు. గతం నుండీ ఇప్పటివరకూ దేశంలో జరిగిన నియోజకవర్గాల పునర్విభన ప్రక్రియకు సంబంధించిన చరిత్ర సమాచారం మొత్తాన్ని ప్రజలముందుకు తీసుకువచ్చి చర్చకు పెడుతుంది, ప్రస్తుత పునర్విభజనవల్ల జరిగే నష్టాలు, సంభవించే పరిణామాలన్నిటినీ రాష్ట్రాలలో ప్రజలకు తెలియజేసేందుకు అవసరమైన సమర్థ చర్యలను జెఎసి తీసుకుంటుంది. ఈ విషయాలను సోషల్ మీడియాలో ప్రకటనల రూపంలో ప్రజలకు తెలియజేసేందుకు, సమస్యను ప్రజలందరికీ తెలిసేట్టు చేసేందుకు డిఎంకె తగిన చర్యలు ప్రారంభిస్తుంది. రాజ్యాంగంలోని 82వ అధికరణ ప్రకారం పునర్విభజన కమిషన్ 2002లో నియోజకవర్గాలను పునర్విభజన చేసింది. ఐతే ఆనాడు అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య తరువాయి 2లో

> జనాభా ప్రాతిపదికపై నియోజకవర్గాల పునర్విభజనవల్ల జరిగే నష్టంపై రాజకీయ పోరాటంతోపాటు న్యాయపరమైన మార్గాలలో కూడా పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్ళే అవకాశాలు ఉన్నాయి. దీనికోసం ఒక నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తాం. ఒక కార్యాచరణ కూడా రూపొందిస్తాం. విజయం సాధించేందుకు ఐక్యపోరాటం చేస్తాం. తమ ప్రాతినిధ్యాన్ని తిరస్కరింప సాధ్యం కాదు. ఈ సమస్యపై రాజకీయ ఏకాభిప్రాయం సాధనకు కృషి చేస్తాం. పునర్విభజనవల్ల లోకసభ స్థానాలను పోగొట్టుకునేందుకు రాష్ట్రాలు సిద్ధంగా లేవు
>
> – తమిళనాడు సిఎం స్టాలిన్

## భిన్నత్వంలో ఏకత్వమే భారత్‌కు బలం

**పునర్విభజనతో సమాఖ్యవాదానికి తూట్లు : వినయ్ విశ్వం**




చెన్నై: భిన్నత్వంలో ఏకత్వమే భారత్‌కు బలమని, పునర్విభజన జరిగితే సమాఖ్యవాదానికి తూట్లు పొడవడమే అవుతుందని సిపిఐ కార్యదర్శి వినయ్ విశ్వం అన్నారు. ఆయన శనివారం చెన్నైలో జరిగిన డీలిమిటేషన్ జెఎసి సమావేశంలో మాట్లాడుతూ తమిళనాడు సిఎం స్టాలిన్ అధ్వర్యం లో చరిత్రాత్మక సమావేశం జరుగుతుందని అభినందించారు. 'మ నం కేవలం మన రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించడం లేదు. యావత్ దేశం కోసం మాట్లాడటం కోసం ఇక్కడ తరువాయి 2లో



## అంగరంగ వైభవంగా

# ఐపిఎల్ ఆరంభం



అదిరిపోయే ఆరంభ వేడుకల మధ్య ఐపిఎల్ 2025 సీజన్ ఘనంగా ప్రారంభమైంది. ఈ ఆరంభ వేడుకలను బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్ ప్రారంభించగా.. ప్రఖ్యాత సింగర్ శ్రేయా ఘోషల్ తన మధురమైన పాటలతో అలరించారు. ఆమి ఝే తోమర్ పాటతో మొదలు పెట్టిన శ్రేయా.. మా తుఝే సలాం సాంగ్‌తో తన ప్రదర్శనను ముగించారు. తన ప్రత్యేకమైన పాటను 10 ఫ్రాంచైజీలకు అంకితమిచ్చారు. అయితే ఆడియో క్వాలిటీ సరిగ్గా లేదని స్టేడియంలోని చాలా మంది అభిమానులు ఫిర్యాదు చేశారు. అనంతరం దిశా పటానీ తన డ్యాన్స్‌తో ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. పలు హిందీ సాంగ్స్‌కు దిశా పటానీ చిందేసింది. ఆ తర్వాత ప్రముఖ ర్యాపర్ కరణ్ ఆజ్లా తన గాత్రంతో అభిమానులను అలరించాడు. అనంతరం షారూఖ్ ఖాన్ ఈ వేడుకలకు హోస్ట్‌గా వ్యవహరించాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సిబి) స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీని స్టేజీపైకి ఆహ్వానించాడు. 18 సీజన్లుగా ఆడుతూ అద్భుత ప్రదర్శన తరువాయి 12లో

## జనాభా ఆధారంగా

# అంగీకరించబోం



- లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- పారదర్శకంగా లేని ఈ విధానానికి వ్యతిరేకంగా దక్షిణాది ఐక్యంగా పోరాడాలి
- ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యాన్ని ఒప్పుకునేది లేదు
- దక్షిణాదికి లోక్‌సభలో 33శాతం సీట్లు ఇవ్వాలి
- చెన్నైలో నిర్వహించిన జెఎసి సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి డిమాండ్

ప్రజాపక్షం / హైదరాబాద్

అభివృద్ధి, సంక్షేమంలో రాణిస్తున్న రాష్ట్రాలకు రాజకీయ పరిమితులు విఘాతం సృష్టిస్తాయి. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన రాష్ట్రాల మధ్య రాజకీయ అసమానత్వం తీసుకువస్తుంది. పారదర్శకంగా లేని లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై బిజెపిని కట్టడి చేయాలి. బిజెపి ప్రతిపాదిస్తున్న ఈ విధానానికి వ్యతిరేకంగా దక్షిణాది ప్రజలు, రాజకీయ పార్టీలు, నాయకులు ఏకం కావాలి'' అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం చెన్నైలోని ర్వహించిన జెఎసి సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ 'లోక్‌సభ సీట్లు పెంచవద్దు. రాష్ట్రాల్లో అంతర్గత పునర్విభజన చేపట్టాలి. 1976లో ఇందిరా గాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, 2001లో ప్రధాని వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వం లోక్‌సభ సీట్లు పెంచకుండానే పునర్విభజన చేపట్టారు. ప్రస్తుతం ప్రధాని కూడా లోక్‌సభ సీట్లు పెంచకుండానే పునర్విభజనను చేపట్టాలి' అని సిఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశా రు. పునర్విభజన ప్రక్రియపై తెలంగాణ రాష్ట్ర శాసనసభలో త్వరలోనే తీర్మానం ఆమోదిస్తామని, తమ రాష్ట్రంలో ఎలా తీర్మానం చేస్తున్నా మో దక్షిణాది రాష్ట్రాల్లోనూ అలాగే చేయాలని సహచర ముఖ్యమంత్రులు, ఇతర నాయకులకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం తరువాయి 2లో

> దక్షిణాదిని సెకండరీ సిటిజన్లుగా ఉత్తరాది మారుస్తుంది. జనాభా ఆధారంగా చేపట్టే డీలిమిటేషన్‌ను ఆమోదించొద్దు. ఉత్తరాది ఆధిపత్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించం. జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యం తగ్గుతుంది.దక్షిణాది రాష్ట్రాలన్నీ వేగంగా ఆర్థిక వృద్ధిని సాధించాయి. జిడిపి, తలసరి ఆదాయం, వేగంగా ఉద్యోగాల కల్పన, మెరుగైన మౌలిక వసతుల కల్పన, సుపరిపాలన, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో మంచి ప్రగతి సాధించాయి.
>
> – సిఎం రేవంత్‌రెడ్డి

# సింగిల్‌గానే అధికారంలోకి

- మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ విశ్వాసం
- రాష్ట్రాన్ని దోచుకునేందుకు కొందరు సిద్ధంగా ఉన్నారని విమర్శ

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్/సిద్దిపేట



రాష్ట్రంలో సింగిల్‌గానే మళ్లీ అధికారంలోకి వస్తామని కెసిఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. బెల్లం ఉన్న దగ్గరకే ఈగలు వస్తాయని, తెలంగాణను దోచుకోవడానికి కొందరు సిద్ధంగా ఉన్నారని ఆయన ఆరోపించారు. పదేళ్ల తెలంగాణలో ఎలాంటి ఇబ్బందులు లేవని ఇప్పుడు సమస్యల వలయంలో చిక్కుకుందన్నారు. తెలంగాణకు ప్రధాన శత్రువు కాంగ్రెసు అని కెసిఆర్ పునరుద్ఘాటించారు. మోదీ తన మెడపై కత్తి పెట్టినా తాను వెనకడుగు వేయలేదని స్పష్టం చేశారు. పదేండ్ల బిఆర్‌ఎస్ పాలనలో జలాలతో అలుగెల్లిన గోదారి, కాళేశ్వరం ప్రాజెక్టులు కాంగ్రెస్ పాలనలో తెచ్చిన కరువుతో చెరువులు, కుంటలు అడుగంటి ఎడారిగా మారాయని కెసిఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. తలాపున పారుతుంది గోదారినీ చేను చెలుక ఎడారి, అని నాటి ఉమ్మడి రాష్ట్రంలో కవి సదాశివుడు రాసిన పాటను తిరిగి గుర్తుచేసుకునే పరిస్థితులు రాష్ట్రంలో తలెత్తడం శోచనీయమన్నారు. ఎండిన గోదారి తల్లి కన్నీటి గోసను.. కాళేశ్వరం నీళ్లందక పంటలు ఎండిన రైతన్న గుండె కోతను.. సభ్య సమాజానికి తెలిపేందుకు రామగుండం మాజీ ఎంఎల్‌ఎ కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో రామగుండం నుండి సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి తరువాయి 12లో



## అసంఘటిత కార్మికుల పట్ల

# నిర్లక్ష్యం తగదు

- వారికి న్యాయం చేయకుంటే ఎన్ని లక్షల కోట్ల బడ్జెట్ పెట్టినా నిరుపయోగమే
- కౌలు రైతులకు రైతు భరోసా, రైతుబీమా వర్తింపజేయాలి
- పద్దులపై చర్చలో సిపిఐ శాసన సభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం నిర్ల క్ష్యం చేయడం తగదని సిపిఐ శాసనసభాపక్ష నా య కులు కూనంనేని సాంబశివరావు అన్నారు. వారి సమస్యలను పరిష్కరించకుండా ఎన్ని లక్షల కోట్ల బడ్జెట్ పెట్టినా అది నిరుపయోగమేనని అ న్నారు. శాసనసభలో శనివారం వ్యవసాయం, సహకార రంగం, కార్మిక, వైద్య, ఆరోగ్య రంగాల పద్దులపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ప్రతిపాదించిన రూ.18,101 కోట్లు నిధులు ఏమాత్రం సరిపోవని, రైతు సంఘాలతో పాటు సర్వత్ర అభిప్రా యం వ్యక్తం అవుతోందని, ఈ రంగానికి మరో రూ.5 వేల కోట్లు పెంచాలని కోరారు. మార్కెట్ జోక్యం నిధులు, పంటల బీమా మరిన్ని కేటాయింపులు చేస్తే బాగుండేదన్నారు. రైతు రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం ఏకకాలంలో రూ. 26,011 కోట్ల రైతుల తరువాయి 2లో

## పిపిపి విధానంతో కాదు

# హ్యామ్‌తో రోడ్లు



- పిపిపి, హైబ్రిడ్ యాన్యుటీ విధానాలు వేర్వేరు
- కోమటిరెడ్డి స్పష్టీకరణ
- మంత్రితో మాజీ మంత్రులు వేముల, హరీశ్‌రావు వాగ్వాదం
- సభ నుంచి బిఆర్‌ఎస్ సభ్యుల వాకౌట్

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో తమ ప్రభుత్వం పిపిపి విధానంలో రోడ్లు నిర్మించడం లేదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. హైబ్రిడ్ యాన్యుటీ (హ్యామ్) విధానంలో రహదారుల నిర్మాణం చేపడుతున్నామని ఆయన తెలిపారు. పిపిపి, హైబ్రిడ్ యాన్యుటీ విధానాలు రెండూ వేర్వేరని మంత్రి వివరించారు. శాసనసభలో శనివా రం ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంలో రహదారుల నిర్మాణంపై బిఆర్‌ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి, టి.హరీశ్ రావులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చా రు. ఈ సందర్భంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బిఆర్‌ఎస్ సభ్యులు ప్రశాంత్ రెడ్డి, హరీశ్‌రావుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలోనే బిఆర్‌ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. 'మన సంపద మన రహదారులను తరువాయి 2లో

## నకిలీ పురుగు మందుల

# విక్రయ ముఠా అరెస్టు

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్



అమాయక రైతులనే లక్ష్యంగా చేసుకోని ప్రముఖ కంపెనీల పేర్లతో పాటు గడువు తీరిన పురుగు మందులు విక్రయిస్తున్న ముఠాలోని ఏడుగురిని టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. ఒకరు పరారీలో వుండగా, మరొకరు ప్రస్తుతం జైలులో ఉన్నారు. నిందితుల నుండి పోలీసులు సుమారు రూ.78లక్షల 63వేల విలువ గల గడువు తీరిన నకిలీ పురుగు మందులు, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందుల తయారీ మిషనరీ, ప్రింటింగ్ సామగ్రి, రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన నిందితులలో తరువాయి 12లో


ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల జాప్యంతో విద్యార్థులకు నష్టం

03

వైద్యశాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్లు




## తక్షణమే కనీస వేతనాల

# జిఓ విడుదల


కార్మిక సంఘాల నాయకుల డిమాండ్

ఇందిరాపార్కు వద్ద భారీ ధర్నా



ప్రజాపక్షం/హైదరాబాద్

కనీస వేతనాల జిఓలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కనీసవేతనాల జిఓను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఇందిరా పార్‌లోని ధర్నా చౌక్ వద్ద కార్మిక సంఘాలు ధర్నా నిర్వహించాయి. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యూసుఫ్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర నాయకులు అంజద్ అలీ, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు ఎస్‌ఎల్. పద్మ, ఐఎఫ్‌టియు, ఎఐయుటియుసి, టిఎన్‌టియుసి నాయకుల అధ్యక్షవర్గంగా జరిగిన ధర్నా ను కనీస వేతనాల సలహా మండలి సభ్యులు ఎం.డి.యూసుఫ్ తరువాయి 12లో



## ఆన్‌లైన్ మనీగేమింగ్ వెబ్‌సైట్లపై

# డిజిజిఐ కొరడా

- 357 వెబ్‌సైట్‌ల బ్లాక్
- దాదాపు 2,400 బ్యాంక్ ఖాతాల అటాచ్‌మెంట్ : ఆర్థికశాఖ

**న్యూఢిల్లీ :** ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్లపై కేంద్రం కొరడా ఝుళిపించింది. జిఎస్‌టి ఇంటెలిజెన్స్ అధికారులు అక్రమ ఆఫ్‌షోర్ ఆన్‌లైన్ గేమింగ్ సంస్థల 357 వెబ్‌సైట్‌ల బ్లాక్ చేశారని.. దాదాపు 2,400 బ్యాంక్ ఖాతాలను అటాచ్ చేసినట్లుగా తరువాయి 12లో

# ప్రపంచం

WORLD NEWS

## 30 ఏళ్ళ తర్వాత బయటపడిన రహస్యం

### ఐస్‌లాండ్ మహిళామంత్రి రాజీనామా



**రేజ్జావిక్ :** మూడుదశాబ్దాలనాటి రహస్యం ఒకటి తాజాగా వెలుగుచూడటంతో ఐస్‌లాండ్ మహిళామంత్రి ఆస్టిల్డుర్ లోవా థోర్స్‌టైర్ 58) మంత్రి థోర్స్‌టైర్ 30 ఏళ్ళక్రితం తన 22 వయసులో క్రిస్టియన్ యూత్ లీడర్‌గా మతబృందానికి గురువుగా వ్యవహరించినప్పుడు 15 ఏళ్ళు వయసుగల నూనూగు మీసాల బాలుడితో లైంగిక సంబంధం పెట్టుకున్నారు. తన 23 ఏళ్ళ వయసులో ఒక బిడ్డకు కూడా జన్మనిచ్చారు. ఐతే ఎవరో ఇటీవల ఈ విషయం ప్రధాన మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై దేశంలో గగ్గోలు చెలరేగింది. మంత్రి థోర్స్‌టైర్ ఒక ఇంటర్వ్యూలో తన తప్పును అంగీకరించి మంత్రిపదవికి రాజీనామా చేశారు. 2024 డిసెంబరులో ఆమె దేశ విద్యా, బాలల వ్యవహారాలమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కేవలం మూడునెలలు మాత్రమే మంత్రిపదవిలో ఉన్నారు. ఈ లోపే ఈ గుట్టును ఎవరో రట్టుచేశారు. ఉత్తర యూరప్‌లో భౌగోళిక,సాంస్కృతిక ప్రాంతదేశం (నోర్డిక్ కంట్రీ) ఐస్‌లాండ్‌లో ప్రజలకు నైతిక విలువలకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. దీంతో ఆమె నైతిక విలువలకు కట్టుబడి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.ఆమె భర్త కూడా ఇటీవల ఒక ఇంటర్వ్యూ ఇస్తూ, తన బిడ్డను చూడటానికి కూడా తన భార్య అనుమతించలేదన్నారు.

# ఉక్రేన్‌లో యుద్ధ నివారణ ట్రంప్‌కు సవాలు?

## రేపు సౌదీ అరేబియాలో చర్చలు



**వాషింగ్టన్ :** ఉక్రేన్‌లో యుద్ధ నివారణ ట్రంప్ వల్ల అవుతుందా? 30 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదన విఫలమైందా? సఫలమైందా? శాంతి సాధన ప్రక్రియ వేగం పుంజుకుని యుద్ధం పూర్తిగా ముగిసేందుకు దారితీస్తుందా? ట్రంప్ మాట చెల్లుబాటు అవుతుందా? అనేదే ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఉక్రేన్ విద్యుత్ ప్లాంట్లు, మౌలిక సదుపాయాలపై దాడుల విమరణకు అంగీకరించినప్పటికీ అనేక సాంకేతిక సమస్యలు, మూలకారణాలు పరిష్కారానికి దూరంగా ఉండిపోయాయి. యుద్ధ నివారణ ద్వారా ఉక్రేన్‌లో ఆర్థిక ప్రయోజనాలు పొందాలని ట్రంప్ కూడా గట్టిగా కోరుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో సౌదీ అరేబియాలో సోమవారంనాడు ఉక్రేన్ సమస్యపై చర్చలు మొదలవుతున్నాయి. అటు జెలెన్స్కీ, ఇటు పుతిన్ 30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడేందుకు సిద్ధపడతామని చెప్పినప్పటికీ ట్రంప్ కోరుకున్నవిధంగా యూరప్‌లో యుద్ధాన్ని ఆయన పూర్తిగా నివారించాలంటే జెలెన్స్కీ–పుతిన్ ఇద్దరినీ సంతృప్తిపరచేవిధంగా ఆయన మధ్యవర్తిత్వం చేయాల్సి ఉంటుంది. జెలెన్స్కీని ఎంతగా అదుపు చేసినప్పటికీ పుతిన్‌ను అక్కునజేర్చుకుంటున్నారన్న యూరప్ విమర్శల నుండి కూడా ట్రంప్ విముక్తి చెందాల్సి ఉంటుంది. కానీ యూరోపియన్ యూనియన్ నాయకులు మాత్రం పైకి వ్యతిరేకత ప్రదర్శిస్తూ, యూరప్ సొంత భద్రత యత్నాలు చేస్తున్నప్పటికీ అంతర్గతంగా ట్రంప్‌ను దూరం చేసుకోకూడదనే గట్టి ఉద్దేశంతో ఆయన నాయకత్వంపైన, నాటో కూటమి మనుగడపైనా పూర్తి విశ్వాసంతో ఉన్నారు. గత ఏడాది నవంబరులో ట్రంప్ రిపబ్లికన్‌పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా ముమ్మర ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో జెలెన్స్కీ ఆయనను కలుసుకున్నారు. తాను గెలిస్తే వీలైనంత వేగంగా యుద్ధాన్ని ఆపుతానని ట్రంప్ ఆయనకు వాగ్దానం చేయగా, జెలెన్స్కీ కూడా పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. గెలిచాక 24 గంటల్లో యుద్ధాన్ని నివారిస్తానని ట్రంప్ 2023 మే నెలలో చేసిన వాగ్దానాన్ని మరోసారి ఉద్ఘాటించారు. కానీ ట్రంప్ అధికారంలోకి వచ్చి ఇప్పటికీ రెండు నెలలు పూర్తయ్యాయి. గెలిచిన తర్వాత కూడా ట్రంప్ పట్ల జెఎన్స్కీ అదే చెక్కుచెదరని విశ్వాసం ప్రదర్శించారు. ఓవల్ ఆఫీసులో ''అరుపులాట'' తర్వాత కూడా జెలెన్స్కీ ట్రంప్‌పట్ల వ్యతిరేకభావాలు ప్రకటించకుండా విధేయంగానే ఉన్నారు. కానీ పుతిన్ మాత్రం ఉక్రేన్‌కు నాటో కూటమిలో సభ్యత్వం ఇవ్వకూడదన్నారు. అందుకు ట్రంప్ వత్తాసు పలికారు. పుతిన్ తరపునే ట్రంప్ ఎక్కువ వకాల్తా పుచ్చుకున్నారు. ఐనాగానీ ట్రంప్ యూరప్ ప్రయోజనాలను పుతిన్‌కోసం పణంగా పెట్టే అవకాశం లేదని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో చైనా యూరప్ దేశాలతో సంబంధాలను పునరుద్ధరించుకుని వాణిజ్య ఎగుమతులు ముమ్మరం చేసేందుకు సన్నాహాలు ప్రారంభించింది. అమెరికాతో కూడా సాధారణ సంబంధాలను పునరుద్ధరించేందుకు ఫోన్ సంభాషణల్లో పుతిన్ సుముఖత వ్యక్తం చేశారు. ప్రపంచశాంతికోసం అగ్రదేశంగా తమవంతు బాధ్యతలు పాటిస్తామని ట్రంప్‌తో ఆయన చెప్పారు. ఈ దశలో పుతిన్‌ను మెప్పించడంతప్ప ఆయనకు బాహాటంగా హెచ్చరికలు చేసేస్థాయిలో ప్రస్తుతం ట్రంప్ లేరన్నది వాస్తవం. అధ్యక్షపదవిలో కూర్చున్నాక పుతిన్ లేదా జెలెన్స్కీ ఎవరినైనా తాను ఒప్పించగలనని ట్రంప్ గట్టిగా విశ్వసించారు. పుతిన్‌తో ఫిబ్రవరి 12న ఒకసారి, మార్చి 18న రెండోసారి ట్రంప్ టెలిఫోన్ సంభాషణ చేశారు. బ్రహ్మాండమైన ఫలితం సంభాషణల ద్వారా సాధించామని ఆయన చెప్పారు. పుతిన్‌కు అనుకూల ప్రకటనలవల్ల యూరప్‌తో ట్రంప్‌కు సమస్యలు వచ్చాయి. కానీ ఆచరణలో మాత్రం ఉక్రేన్–రష్యా మధ్య గతంకంటే ప్రత్యక్ష విమర్శలు, పరస్పర యుద్ధ దాడులు పెరిగాయి. యుద్ధ ముగింపుపై ఆదరాబాదరాగా నిర్ణయం తీసుకోలేనని కూడా పుతిన్ స్పష్టం చేశారు. ఎలాంటి చర్చలు జరిగినా యుద్ధం మొదలు కావడానికిగల మూలకారణాలు పరిష్కారం కావాలని పుతిన్ చాలా స్పష్టతతో ఉన్నారు. అమెరికా ప్రతిపాదించిన రెండు దశల ఒప్పందాన్ని పుతిన్ తిరస్కరించారు. ఉక్రేన్‌కు నాటో సభ్యత్వం, విస్తరణ రష్యా భద్రతకు పెద్ద ప్రమాదంగా పుతిన్ భావిస్తున్నారు. దీనిని శాశ్వత సమస్యగా పుతిన్ భావిస్తున్నారు. ఈ ప్రశ్నలకు ట్రంప్ నుండి స్పష్టమైన సమాధానాలు కావాలని పుతిన్ కోరుకుంటున్నారు. తక్షణం కాల్పుల విరమణ ప్రారంభిస్తే 1200 కి.మీ సరిహద్దులో పర్యవేక్షణ ఎవరు చేపడతారని పుతిన్ ప్రశ్నిస్తున్నారు.

## బంగ్లాదేశ్ జర్నలిస్టులకు గెజిటెడ్ ఆఫీసర్ జీతం



**ఢాకా:** బంగ్లాదేశ్‌లో జర్నలిస్టుల భద్రత, వారి హక్కుల రక్షణకోసం ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని మీడియా సంస్కరణల కమిషన్ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. పర్మినెంట్ జర్నలిస్టు బేసిక్ శాలరీ ప్రభుత్వ ఫస్ట్‌క్లాస్ గెజిటెడ్ ఆఫీసర్ హోదాలో ఉన్న అధికారికి వచ్చే జీతంకంటే తగ్గకూడదని గట్టి సిఫార్సు చేసింది. అప్పాయింట్‌మెంట్ లెటర్ లేకుండా, జీతం వివరాలు, ఫోటో ఐడెంటిటీ కార్డు వంటివి లిఖితపూర్వకంగా లేకుండా, స్టోర్ చేయకుండా జర్నలిస్టుల నియామకాలు దేశంలో జరగకూడదని నివేదిక గట్టి హెచ్చరిక చేసింది. జర్నలిస్టుల ప్రొబేషన్ పీరియడ్ ఒక్క ఏడాది మించకూడదని కూడాగట్టి నిబంధన విధించాలని ప్రతిపాదించింది. కమిషన్ ఛైర్మన్ కమల్ అహ్మద్ ఇతర సభ్యులు శనివారంనాడు దేశ తాత్కాలిక నాయకుడు ప్రొఫెసర్ మహ్మద్‌యూనుస్‌కు తన నివేదికను సమర్పించారు. నివేదికలోని కీలక అంశాలను ఆయనకు వివరించారు. జర్నలిస్టు భద్రతను కాపాడేందుకు, వారి హక్కుల పరిరక్షణకు ఒక శాశ్వత మీడియా కమిషన్‌ను కూడా దేశంలో ఏర్పాటు చేయాలని నివేదిక సిఫార్సు చేసింది. దేశంలో ఒకే కంపెనీ, గ్రూపు లేదా ఒక కుటుంబం మీడియాలో అనేక సంస్థలను ఏర్పాటు చేసుకుని గుత్తాధిపత్యం వహించే ధోరణులను ఉండకూడదని కూడా కమిషన్ తన నివేదికలో స్పష్టం చేసింది. టీవీ ఛానల్ నడిపే యజమాని పత్రికను కూడా నడపడాన్ని అనుమతించకూడదని, ఈ విధమైన ఏకస్వామ్యానికి దేశంలో అవకాశం ఇవ్వకూడదని నివేదిక సిఫార్సు చేసింది. ఒకేభాషలో, ఒకే యజమాని అనేక పత్రికలను, లేదా టీవీ కేంద్రాలను నడపడానికి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించకూడదని పేర్కొంది. ''ఒన్ మీడియా, ఒన్ హౌస్'' అనే విధానం పాటించాలని కోరింది. ఈ విధంగా కమిషన్ తన నివేదికలో 21 కీలకమైన అంశాలను వాటితోపాటు సబ్ క్లాజులను కూడా ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. మీడియా అవుట్‌లెట్స్‌ను క్యాపిటల్ మార్కెట్ పరిధిలోకి తీసుకురావాలని కూడా కమిషన్ సిఫార్సు చేసింది.

## అంగీకరించ బోం

(మొదటి పేజీ తరువాయి)

దేశం పెద్ద సవాల్‌ను ఎదుర్కొంటోందని, బిజెపి జనాభా జరిమానాల విధానాన్ని కొనసాగిస్తోందన్నారు. మనందరిది ఒకే దేశమని, అందరం దానిని గౌరవిస్తామని, కానీ కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాది రాష్ట్రాల రాజకీయ కుదింపు అన్నారు. తద్వారా మంచి ప్రగతి సాధిస్తున్న రాష్ట్రాలను ఈ ప్రక్రియ శిక్షిస్తోందన్నారు. 'జనాభా ఆధారంగా చేపట్టే డీలిమిటేషన్‌ను దక్షిణాది రాష్ట్రాలు అంగీకరించవు. ఇలా చేస్తే దక్షిణాది రాజకీయ వాణి కోల్పోతుంది. దక్షిణాదిని సెకండరీ సిటిజన్లుగా ఉత్తరాది మారుస్తుంది. జనాభా ఆధారంగా చేపట్టే డీలిమిటేషన్‌ను ఆమోదించొద్దని నిర్ణయం తీసుకున్నాం. ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోం' అని రేవంత్‌రెడ్డి అన్నారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యం తగ్గుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాలన్నీ వేగంగా ఆర్థిక వృద్ధిని సాధించాయని, జిడిపి, తలసరి ఆదాయం, వేగంగా ఉద్యోగాల కల్పన, మెరుగైన మౌలిక వసతుల కల్పన, సుపరిపాలన, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో మంచి ప్రగతి సాధించాయన్నారు. ''దేశ ఖజానాకు దక్షిణాది రాష్ట్రాలు పెద్ద మొత్తంలో పన్నుల రూపంలో నిధులు చెల్లిస్తూ తక్కువ మొత్తంలో నిధులు పొందుతున్నాం. తమిళనాడు పన్నుల రూపంలో కేంద్రానికి రూపాయి చెల్లిస్తే 29 పైసలే వెనక్కి వస్తుండగా, ఉత్తరప్రదేశ్‌కు ఒక రూపాయికి రూ.2.73 లు వెనక్కి వెళుతున్నాయి. బీహార్ రూపాయి చెల్లిస్తే రూ.9.22 లు, మధ్యప్రదేశ్ రూపాయి పన్ను రూపంలో కేంద్రానికి ఇస్తే వెనక్కి రూ.2.79లు వెనక్కి తీసుకుంటున్నాయి. అయితే కర్ణాటకకు కేవలం 14 పైసలు, తెలంగాణకు 41 పైసలు, కేరళకు 62 పైసలు మాత్రమే వెనక్కి వస్తున్నాయి'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం కేటాయింపులు, పన్ను చెల్లింపులు క్రమంగా తగ్గిస్తోందని, చివరకు జాతీయ ఆరోగ్య మిషన్ కేటాయింపుల్లోనూ ఉత్తరాది రాష్ట్రాలకే 60 నుంచి 65 శాతం నిధులు దక్కుతున్నాయని ఆయన తెలిపారు.

**ప్రొరేటా విధానాన్ని అంగీకరించలేం :** ప్రొరేటా విధానం కూడా దక్షిణాదికి నష్టమే కలిగిస్తుందని, రాజకీయ అంతరాలను పెంచుతుందని, ప్రొరేటా విధానాన్ని పాటిస్తే సీట్ల మధ్య తేడా కేంద్ర ప్రభుత్వ ఏర్పాటును నిర్ణయిస్తుందని, ఒక్క సీటు కూడా తేడాను చూపుతుందని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక్క సీటుతో కేంద్ర ప్రభుత్వం పడిపోయిన చరిత్ర దేశంలో ఉందని, కాబట్టి ప్రొరేటా విధానం కూడా దక్షిణాది రాజకీయ ప్రయోజనాలకు భంగం కలిగిస్తుందన్నారు. రాష్ట్రాల్లోని నగరాలు, గ్రామాల్లోని జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్ల హద్దులను మార్పు చేయాలని, తాజా జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రాల్లో ఎస్‌సి, ఎస్‌టి సీట్ల సంఖ్య పెంచాలన్నారు. ప్రతి రాష్ట్రంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, లోక్‌సభ స్థానాల పెంపును మరో 25 ఏళ్లపాటు వాయిదా వేయాలన్నారు. తాను తెలంగాణలోని మల్కాజిగిరి ఎంపిగా ప్రాతినిధ్యం వహించానని, అది ప్రపంచంలోనే అతి పెద్ద నియోజకవర్గమని, అక్కడ మొత్తం జనాభా 45 లక్షలైతే ఓటర్లు 32 లక్ష మంది ఉన్నారని, ఈ సమస్యను పూర్తిగా అర్థం చేసుకోగలనన్నారు.

**లోక్‌సభలో దక్షిణాదికి 33 శాతం సీట్లు ఇవ్వాలి :** లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి దేశంలోని ఇతర రాష్ట్రాలతో సంబంధం లేకుండా చిన్న రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సీట్లను ఏర్పాటు చేసినట్లే దక్షిణాదికి అవకాశం ఇవ్వాలని సిఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. 543 సీట్లు ఉన్న లోక్‌సభలో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య 130 కాగా ఇది మొత్తం సీట్లలో 24 శాతమని, పునర్విభజన తర్వాత ఏర్పడే నూతన లోక్‌సభలో తమకు 33 శాతం సీట్లు ఇవ్వాలనేది దక్షిణాది రాష్ట్రాలుగా డిమాండ్ చేస్తున్నామన్నారు. బిజెపి 50 శాతం సీట్లను పెంచాలనుకుంటే అలా పెరిగే 272 సీట్లతో మొత్తం లోక్ సభ సీట్ల సంఖ్య 815 అవుతుందని, ఇందులో దక్షిణాది రాష్ట్రాలకు 33 శాతం అంటే 272 సీట్లు ఇవ్వాలని, ఈ సీట్లను దక్షిణాదిలోని తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరిలకు ఇప్పుడున్న ప్రొరేటా ప్రాతిపదికన పంచవచ్చని రేవంత్‌రెడ్డి సూచించారు. దేశంలో మిగిలిన సీట్లను ఉత్తరాది, ఇతర రాష్ట్రాలకు కేంద్రం తమ అభిమతం మేరకు పంచవచ్చని, అనుకున్న దానికంటే దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల సంఖ్య తగ్గిస్తే అది దేశ రాజకీయ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన హెచ్చరించారు.

## భారత్‌కు బలం (మొదటి పేజీ తరువాయి)

సమావేశం అయ్యాం' అని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో బీజేపీకి పాత్ర లేదు కాబట్టే భారతీయత ... దేశ ఐక్యతను అర్థం చేసుకోలేదని విమర్శించారు. జనగణన ఆధారంగా డీలిమిటేషన్ జరిగితే దక్షిణ రాష్ట్రాలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గిపోతుందని, ఉత్తరాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం పెరుగుతుందని వినయ్ విశ్వం నొక్కి చెప్పారు. కేరళను పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్ర జనాభా దేశ జనాభాలో 2.8 శాతమే, భూభాగాన్ని పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రానికున్నది 1.2శాతం కాగా భారత జీడీపీకి అందించే సహకారం 4.1 శాతమని తెలిపారు. విద్య, వైద్యం, సామాజిక భద్రతలో కేరళ నంబర్ వన్‌గా ఉందని, ఇది రాష్ట్ర ప్రజల దశాబ్దాల పోరాటాల ఫలితమన్నారు. తమిళనాడు కూడా అంతేనని, పెరియార్, బసన్న నాటి నుంచి సాగిన పోరుతో తమిళ రాష్ట్రం నేడు ఈ స్థాయికి చేరుకోగలిందని వినయ్ విశ్వం అన్నారు. ఆరోగ్యం, విద్య, అభివృద్ధిలో ఐదారు ర్యాంకులు వెనక్కి వెళితే తప్ప నిధులు రావని బీజేపీ నాయకుడు ఒకరు చెప్పడాన్ని బట్టి ఆ పార్టీ ఆలోచన ధోరణి, విధానం అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. జనాభా నియంత్రణ కోసం కుటుంబ నియంత్రణ విధానాన్ని దక్షిణాది రాష్ట్రాలు అనుసరించాయని, కాబట్టి ఇప్పుడు ఈ పరిస్థితి ఎదురైందని చెప్పారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు దేశ జీడీపీకి గణనీయమైన తోడ్పాటు అందిస్తున్నప్పటి రాజకీయ ప్రాతినిధ్యానికి ముప్పు ఏర్పడిందని వినయ్ విశ్వం తెలిపారు. పునర్విభజనలో అన్ని ప్రాంతాలకు సమాన హోదా, గౌరవం ఉండాలని... ప్రజాస్వామ్యం, న్యాయ సిద్ధాంతాలకు కట్టుబడి ఈ ప్రక్రియ జరగాలని వినయ్ విశ్వం నొక్కిచెప్పారు.

## హ్యామ్‌తో రోడ్లు (మొదటి పేజీ తరువాయి)

నిర్మించడం, మన రోడ్లు మన సంపదను పెంచుతాయి' అని జాన్ ఎఫ్ కెనడీ చెప్పిన మాటలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గుర్తు చేశారు. రాష్ట్రంలో మొత్తం 29 వేల కి.మీ మేర రహదారులున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. గత పదేళ్లలో రోడ్లపై రూ.3945 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. గతంలో రోడ్ల కోసం తెచ్చిన రుణాల బకాయిలను తాము చెల్లిస్తున్నామని వివరించారు. కాంగ్రెస్ వచ్చాక రూ.4 వేల కోట్లకు పైగా మంజూరు చేశామని చెప్పారు. గతంలో సిఆర్‌ఎఫ్ నిధులు కేంద్రం నుంచి రూపాయి కూడా సాధించలేదని తెలిపారు. తాను మంత్రి పదవి చేపట్టిన 3 రోజులకే కేంద్రమంత్రి గడ్కరీని కలిశానని, రహదారుల కోసం కేంద్ర నిధులు రూ.850 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు. గత వారం రూ.1100 కోట్ల సిఆర్‌ఎఫ్ నిధుల మంజూరుకు అంగీకారం తెలిపారన్నారు. గత వారం సేతుబంధు కింద రూ.1240 కోట్లు మంజూరుకు అంగీకరించారన్నారు. కేంద్ర నిధుల మంజూరు కోసం డిపిఆర్ సమర్పించాలని కోరారని మంత్రి వివరించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌ను 18 నెలల్లో పూర్తి చేస్తామని ఆయన హామీనిచ్చారు. గత పదేళ్లలో రోడ్ల నిర్మాణానికి రూ. 3,945 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. రోడ్ల నిర్మాణంలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం లేదన్నారని, బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం ఉందన్నారని బిఆర్‌ఎస్ సభ్యులు హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం లేదని చెప్పడం బాధ్యతారాహిత్యమన్నారు. రుణాలు ఎఫ్‌ఆర్‌బిఎం పరిధిలోకి వస్తాయా?, ప్రభుత్వం ఎన్నేళ్లు చెల్లిస్తుందని, హ్యామ్ రోడ్ల ఎంపిక ప్రాతిపదిక ఏమిటి అని హరీశ్ రావు ప్రశ్నించారు.

**కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మధ్య వాగ్వాదం..**

సచివాలయం నిర్మాణం, యాగాలు, ప్రగతి భవన్, ఫామ్‌హౌస్‌లో చండీయాగం చూసుకోవడం తమకు తెలియదని మంత్రి కోమటిరెడ్డి బిఆర్‌ఎస్ సభ్యులు ప్రశాంత్ రెడ్డిని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డిల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ 'పదేండ్లలో బిఆర్‌ఎస్ పాలనలో డబుల్ రోడ్లు 8000 కిలోమీటర్లు, నాలుగులైన్‌ల రోడ్లు 600 కిలోమీటర్లు నిర్మించామన్నారు. 17వేల కిలో మీటర్లకు రూ.23 వేల కోట్లు ఖర్చు అవుతాయని, మొత్తం ఖర్చులో 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించా ల్సి ఉంటుందని, ప్రైవేట్ పెట్టుబడులతో కొత్త రోడ్లు వేస్తామని సర్కార్ అంటుందని, ప్రైవేట్ వ్యక్తులు అంటే ఎవరు?, ఎవరి ఆధ్వర్యంలో రోడ్లు నిర్మిస్తారని, ఇప్పటికీ ఏడాదిన్నర కాలం పూర్తయిందని, మూడున్నర సంవత్సరాలలో 17వేల కిలో మీటర్లు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. రోడ్లు నిర్మించలేదని తమ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని ప్రశాంత్ రెడ్డి అన్నారు. తనను వ్యక్తిగతంగా కించపరుస్తున్నారని అన్నారు. దీనిపై కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఘాటుగా స్పందించారు.

**సభ నుంచి బిఆర్‌ఎస్ వాకౌట్ :** మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమాధానాన్ని నిరసిస్తూ సభ నుంచి బిఆర్‌ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, ఇతర విషయాలు ప్రస్తావించారని, బిఆర్‌ఎస్ హయాంలో చేసిన రోడ్ల గణాంకాలు స్పీకర్ సమక్షంలో పెట్టాలని డిమాండ్ చేశారు. స్పీకర్ సమక్షంలో పెట్టాలని డిమాండ్ చేసినా స్పందించలేదని పేర్కొంటూ హరీశ్ రావు, ప్రశాంత్ రెడ్డి సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి, సభ నుంచి వెళ్లిపోయారు.

## నిర్లక్ష్యం తగదు (మొదటి పేజీ తరువాయి)

రుణాలు మాఫీ చేసిందని, అయితే వివిధ కారణాలు, తప్పిదాల వల్ల అక్కడక్కడ రూ.2 లక్షల లోపు రుణాలు ఉన్న వారికి సైతం రుణమాఫీ జరగలేదని, ప్రభుత్వం వారికి ఏదో రూపంలో సహాయం అందించాలని కోరారు. సన్న ధాన్యానికి క్వింటల్‌కు రూ.500 బోనస్‌ను అందజేయడంతో రైతులు చాలా సంతోషంగా ఉన్నారని, రైతుభరోసా అందని సమయంలో ఇది రైతులను బాగా అదుకుందని చెప్పారు. రైతు బీమాకు సంబంధించి రూ.11 వేల కోట్లు కేటాయించారని, అయితే పంటల బీమాకు సంబంధించి మాత్రం ప్రభుత్వం చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు పంట నష్టపోయిన ఏ ఒక్క రైతుకు కూడా పంట బీమా అందిన దాఖాలాలు లేవని తెలిపారు. రైతులు పంట రుణాలు తీసుకుంటే ఇందులో పంట బీమా పేరుతో ముందుగానే డబ్బులను మినహాయించుకున్నప్పటికీ పంట నష్టం జరిగితే పరిహారం మాత్రం అందడంలేదన్నారు. మోటార్ సైకిల్‌కు బీమా ఉంది కాని పంటకు బీమా లేకపోవడం దారుణమన్నారు. కౌలు రైతులకు సంబంధించి రైతు భరోసా, రైతు బీమా వర్తింపజేసి వారికి న్యాయం చేయాలని కోరారు. గోపాలమిత్ర పథకం కింద పనిచేస్తున్న వారికి సైతం వేతనాలు పెంచాలని కూనంనేని సాంబశివ రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**ప్రభుత్వ వైద్యం మరింత సమర్థవంతంగా అందించాలి:** వైద్య సేవలకు సంబంధించి రాష్ట్రంలో పెద్ద వ్యవస్తే ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆసుపత్రులపై ప్రజలకు విశ్వాసం లేకుండా పోతోందని కూనంనేని అవేదన వ్యక్తం చేశారు.రాత్రి వేళ అత్యవసర పరిస్థితులలో పెద్ద పెద్ద ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లినా మందులు లేవనో, సౌకర్యాలు లేవనో ప్రైవేట్ ఆసుపత్రులకు పంపుతున్నారన్నారు. వైద్య రంగానికి సంబంధించి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ వాటిపై పర్యవేక్షణ లేకపోవడమా లేక డాక్టర్లు పనిచేయకపోవడమా తెలియదుకానీ వైద్యం మాత్రం ప్రజలకు అందడంలేదన్నారు.

**కార్మిక వర్గాన్ని ఆదుకోవాలి :** కార్మిక వర్గాన్ని అనివిధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని కూనంనేనిసాంబశివరావు ప్రభుత్వా న్ని కోరారు. ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం ఇస్తామన్నా రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని తక్షణమే అమలు చేయడంతోపాటు వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పెన్షన్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో కాంట్రా క్ట్, అవుట్ సోర్సింగ్ తదితర విధానాల్లో 4.68 లక్షల మంది పనిచేస్తున్నారని, వీరికి కనీస వేతనాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అవుట్ సోర్సింగ్ విధానంలో తెలంగా ణ రాష్ట్ర లైఫ్ ఇన్స్‌రెన్స్‌లో చేస్తున్న వారిని తొలగించనున్నట్లు పేర్కొన్నారని, వారికి పని భద్రత కల్పించాలని కోరారు. జర్నలిస్టులు కనీస భద్రత లేకుండా చాలా ఇబ్బందులు పడుతున్నారని,వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. సింగరేణిలో 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నారరని, అక్క డ జిఓ నంబర్ 22ను అమలు చేస్తే ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం ఉండకపోగా వారందరికి న్యాయం చేసినవారమవుతామని తెలిపారు. రాష్ట్రంలో 73 వివిధ జిఓలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిలో గత ప్రభుత్వం 21 నుంచి 25 వరకు 5 జిఓలను విడుదల చేసినా వీటిని గెజిట్‌లో పొందుపర్చకపోవడంతో సింగరేణి కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. రా ష్ట్రంలో వివిధ 73 జిఓలను అమలు చేస్తే 1.20 కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఆర్‌టిసిని పరిరక్షించుకుందాం :** లక్షల కోట్ల రూపాయల విలువైన సంపద కలిగి ఉన్న ఆర్‌టిసిని ప్రభుత్వం పరిరక్షించుకోవాలని ప్రభుత్వాన్ని సాంబశివరావు కోరారు. ఎలక్ట్రిక్ బ స్సుల పేరుతో క్రమంగా ఆర్‌టిసిని ప్రైవేటీకరణ వైపు నెట్టివేస్తున్నారని, ఇది రాష్ట్ర ప్రజలకు తీరని నష్టమని పేర్కొన్నారు. జెన్‌కోలో ఆర్టిజాన్ అని అందమైన పేరు పెట్టి సాధారణ కార్మికులుగా ఉన్న విద్యుత్ ఉద్యోగులకు అన్యాయం చేశారని, వీరందరి ఉద్యోగాలను క్రబద్ధీకరించాలన్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తూ ఈపిఎఫ్ చెల్లిస్తున్న 1.07 కోట్ల మంది కార్మికులు ఉన్నారని, వారికి పెన్షన్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి కూనంనేని విజ్ఞప్తి చేశారు.

## మరో పాతికేళ్లు ఆపండి

(మొదటి పేజీ తరువాయి)

పెరిగినప్పటికీ లోక్‌సభ నియోజకవర్గాలు మాత్రం 1971 ప్రాతిపదికపై మార్పు లేకుండా 543గానే కొనసాగాయి. నిర్ణీత ప్రకారం 2026లో జనాభా లెక్కల సేకరణ తర్వాత పార్లమెంటరీ నియోజకవర్గాలు, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. కానీ జనాభా ప్రాతిపదికపై పార్లమెంటరీ నియోజకవర్గాలను పునర్విభజన చేస్తే కుటుంబ నియంత్రణ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని, పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాలప్రాతినిధ్యం తగ్గిపోతుందనీ, అందువల్ల పార్లమెంటరీ నియోజకవర్గాలను 1971 జనాభాలెక్కల ప్రాతిపదికపై కొనసాగించేవిధంగా పునర్విభజనను మరో 25 సంవత్సరాలపాటు వాయిదా వేయాలని చెన్నైలో జరిగిన సంయుక్త కార్యాచరణ కమిటీ సమావేశం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టే ఏ విధమైన పునర్వభజన అయినా భారతదేశ ప్రజాస్వామ్య పరిమాణాన్ని, ప్రజాస్వామ్య స్వరూపస్వభావాలను మరింత మెరుగుపరిచేట్టుగా ఉండాలని సమావేశం కేంద్రాన్ని కోరింది. ప్రజాస్వామ్యబద్ధమైన ఈ పునర్విభజన ప్రక్రియ అరమరికలు లేకుండా బాహాటపద్ధతులలో కొనసాగాలనీ, అన్ని రాష్ట్రాల రాజకీయపార్టీలు, రాష్ట్రాల ప్రభుత్వాలు, ఇందుకు సంబంధించిన ఇతరులందరూ ఈ చర్చల్లో పాల్గొనేవిధంగా చర్యలు తీసుకోవాలని, వారి సలహాలు, సూచనలు స్వీకరించి పాటించాలని, వారి భాగస్వామ్యం ఉండాలని జెఎసి కోరింది. ''జనాభా నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు, రక్షణలు ఇవ్వాలన్న 42వ, 84వ 87వ రాజ్యాంగ సవరణల వెనుక ఉన్న శాసనపరమైన లక్ష్యాలు ఇప్పటివరకూ నెరవేలేదన్నది వాస్తవం, జాతీయ జనాభా స్థిరీకరణ సాధించాలన్న ఉద్దేశంతో ఈ సవరణలు చేశారు, అందువల్ల పార్లమెంటరీ నియోజకవర్గాలను మరో పాతికేళ్ళపాటు 1971 జనాభా గణాంకాల ప్రకారం కొనసాగించేందుకు వీలుగా పునర్విభజనను స్తంభింపజేయాలి'' అని జెఎసి తీర్మానంం స్పష్టం చేసింది. జనాభా నియంత్రణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రాలలో జనాభా తగ్గుదలవల్ల సాధారణంగానే పార్లమెంటులో వాటి సీట్ల వాటా తగ్గుతుంది, దీనివల్ల ఆ రాష్ట్రాలకు నష్టం జరగకూడదు, వాటికి సీట్లతగ్గుదల శిక్ష పడకూడదు, అదువల్ల కేంద్ర ప్రభుత్వం ఇలాంటి రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడేందుకువీలుగా రాజ్యాంగంలో తగిన సవరణలను కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలి అని తీర్మానం కేంద్రాన్ని కోరింది. ''ఈ విధంగా అన్యాయం జరిగిందని కోరుతున్న రాష్ట్రాల నుండి పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించే ఎంపీలతో కూడిన కీలక కమిటీ సమన్వయంతో వ్యవహరిస్తుంది, పైన జెఎసి తీర్మానంలో కోరినవిధంగా కాకుండా అందుకు భిన్నంగా కేంద్ర ప్రభుత్వం గనుక ఎలాంటి పునర్విభజన చర్యలు చేపట్టేందుకు ప్రయత్నాలు చేసినాగానీ తమ ఎంపీలతో కూడిన కీలక కమిటీ సమన్వయంతో వ్యవహరించి ప్రతిఘటిస్తుంది, పార్లమెంటులో వ్యూహరచన చేసేందుకు సమన్వయంగా ముందుకు వెళతారు, ఈ జెఎసి తీర్మానానికి అనుగుణంగా ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల సందర్భంగానే ఎంపీల కీలక కమిటీ ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి ఉమ్మడిగా ఒక విజ్ఞాపన పత్రాన్ని సమర్పిస్తుంది'' అని జెఎసి తీర్మానం స్పష్టం చేసింది.

**రాజకీయ పోరాటంతో పాటు న్యాయపోరాటం కూడాః స్టాలిన్**

జనాభా ప్రాతిపదికపై నియోజకవర్గాల పునర్విభజనవల్ల జరిగే నష్టంపై రాజకీయ పోరాటంతోపాటు న్యాయపరమైన మార్గాలలో కూడా పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్ళే అవకాశాలు ఉన్నాయని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ జెఎసి సమావేశంలో చెప్పారు. దీనికోసం ఒక నిపుణుల కమిటీ ఏర్పాటు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఒక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. విజయం సాధించేందుకు ఐక్యపోరాటం చేస్తామన్నారు. తమ ప్రాతినిధ్యాన్ని తిరస్కరింపసాధ్యం కాదన్నారు. ఈ సమస్యపై రాజకీయ ఏకాభిప్రాయం తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. పునర్విభజనవల్ల లోకసభ స్థానాలను పోగొట్టుకునేందుకు రాష్ట్రాలు సిద్ధంగా లేవన్నారు. కేంద్రం చర్యవల్ల కొన్ని రాష్ట్రాలకే తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ''సీట్ల సంఖ్య తగ్గితే కేంద్రంలో చట్టాల రూపకల్పనలో రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుంది, రాష్ట్రాలకు సంబంధించిన నిధులవాటా రాబట్టుకోవడానికి చట్టబద్ధ మార్గాలు మూసుకుపోయి వీధుల్లో పోరాడాల్సి వస్తుంది, అభిప్రాయ వ్యక్తీకరణకు అవకాశాలు తగ్గుతాయి, వివిధ చట్టాల రూపకల్పన, బిల్లుల ఆమోదం, చట్టసరవణ ప్రక్రియలలో సీట్లసంఖ్య తగ్గిన రాష్ట్రాల ప్రమేయం ఉండదు, సామాజిక న్యాయం కొరవడుతుంది, న్యాయబద్ధమైన పునర్విభజన చేయాలని తాము కోరుతున్నామనీ, అందుకే దీనిని వ్యతిరేకిస్తున్నాంతప్ప, తామందరం ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రజలలో చైతన్యం రగుల్కొపేందుకు, కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసేందుకు ఈ ఉమ్మడి కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని స్టాలిన్ చెప్పారు. అదేవిధంగా ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్టింగ్ పెడుతూ ఈ జెఎసి సమావేశం ద్వారా ఈ రోజు మనం చరిత్రను లిఖించామని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వృద్ధికి దోహపడే రాష్ట్రాలు సమాఖ్యవ్యవస్థను రక్షించుకోవడానికి ఒక్కచోట చేరాయని, న్యాయబద్ధమైన పునర్విభజన చేయాలని కేంద్రాన్ని కోరాయని పేర్కొన్నారు. కాగా, మార్చి 5న స్టాలిన్ తమిళనాడు ప్రతిపక్షాలతో సమావేశం జరిపారు. లోక్‌సభలో ప్రస్తుత జనాభా ప్రకారం 543 సీట్ల సంఖ్య తగ్గితే తమిళనాడులో ఎనిమిది లోక్‌సభస్థానాలు తగ్గిపోతాయని ఆ సమావేశంలో అన్నారు. పార్లమెంటులో మొత్తం సీట్ల సంఖ్య పెరిగితే ప్రస్తుత ప్రాతినిధ్యాన్ని పెరిగిన ప్రాతినిధ్యంతో పోల్చిచూస్తే తమిళనాడు ఏకంగా 12 సీట్లు పోగొట్టుకున్నట్లవుతుందన్నారు. కానీ మరునాడు మార్చి ఆరోతేదీన కేంద్ర హోంమంత్రి అమిత్ షా కోయంబత్తూరులో సభలో మాట్లాడుతూ, దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదన్నారు.

### రాష్ట్రాల మెడపై కత్తి : పినరయి విజయన్

జనాభా ప్రాతిపదికపై నియోజకవర్గాల పునర్విభజన రాష్ట్రాల మెడపై వేలాడే కత్తిలాంటిదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ జెఎసి సమావేశంలో అన్నారు. దేశంలో ఎవరినీ సంప్రదించకుండా బిజెపి ప్రభుత్వం ఏకపక్షంగా ఈ పునర్విభజన ప్రక్రియను ముందుకు తీసుకువెళుతోందని అన్నారు. ''ఈ ఆకస్మిక చర్య రాజ్యాంగ సూత్రాలు లేదా ప్రజాస్వామ్య సూత్రాల ప్రాతిపదికపై జరగడంలేదు, సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం జరుగుతోంది, ఈ విధంగా సీట్ల కోత దక్షిణాదికే, ఉత్తరాది రాష్ట్రాలకు సీట్ల సంఖ్య పెరుగుతుంది, ఇది బిజెపి ప్రయోజనాలకు దోహదం చేస్తుంది, ఉత్తరాదిన బిజెపి విస్తారంగా తన ప్రభావం చూపించుకోవడానికి జనాభా ప్రాతిపదికపై పునర్విభజన ఉపయోగిస్తుంది'' అని విజయన్ అన్నారు. దక్షిణాదికి అన్యాయం చేసేందుకే బిజెపి ఈ విధంగా పునర్విభజనకు పాల్పడుతోందని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ సమావేశంలో విమర్శించారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్ మాన్ మాట్లాడుతూ, బిజెపి తన ఉనికి ఉన్నచోట్ల పార్లమెంటు సీట్ల సంఖ్య పెంచుకోవాలని చూస్తోందని విమర్శించారు. పంజాబ్‌లో బిజెపి ఎప్పటికీ విజయం సాధించబోదన్నారు. ప్రస్తుతం పంజాబ్‌లో ఉన్న 13 లోక్‌సభ స్థానాలలో బిజెపికి ఒక్కస్థానం కూడా లేదన్నారు. జనాభా తగ్గినందుకు శిక్షగా దక్షిణాదికి నష్టం జరుగుతుందని ఆయన అన్నారు. కాగా బిజెపి తమిళనాడు రాష్ట్రశాఖ నాయకుడు కె.అన్నామలై నాయకత్వంలో ఆ పార్టీ కార్యకర్తకలు నల్ల జెండాలతో ఈ సమావేశానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేశారు. దీనిని ఒక చర్చల డ్రామాగా అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్ర మాజీ గవర్నర్ డా.తమిళిసై సౌందర్‌రాజన్ కూడా ఈ సమావేశాన్ని విమర్శించారు. ఆయా రాష్ట్రాలు తమ తమ తప్పులను కప్పిపుచ్చుకోవడం కోసమే ఈ సమావేశం నిర్వహించాయని విమర్శించారు. ఈ రాష్ట్రాల నాయకులపై ఎన్నో అవినీతి ఆరోపణలున్నాయన్నారు.

### అన్ని రాష్ట్రాలు ఏకమవ్వాలి : కెటిఆర్

డీలిమిటేషన్‌పై ప్రశ్నించకుంటే తమను చరిత్ర క్షమించదని బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటి. రామారావు అన్నారు. డీలిమిటేషన్ అంశంపై అన్ని రాష్ట్రాలు ఏకమవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. దక్షిణాది రాష్ట్రాలపై బిజెపి ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని, డీలిమిటేషన్ వల్ల తెలంగాణలో నియోజకవర్గాల సంఖ్య తగ్గిపోతుందన్నారు. కేంద్రం చూపించే వివక్షతో దక్షిణాది పూర్తిగా నష్టపోతుందని చెప్పారు. జనాభా ఆధారంగా సీట్లు పెంచడం సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతమని, ఈ విధానాన్ని అవలంబిస్తే అనేక నష్టాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.




# జనరల్

STATE NEWS REGIONAL NEWS

## ప్రభుత్వానికి పేరు వస్తోందని నిధుల అడ్డగింత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తే ఆ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందనే ఉద్దేశ్యంతోనే కేంద్ర మంత్రి, బిజెపి తెలంగాణ అధ్యక్షులు కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి నిధులు రాకుండా అడ్డుకుంటున్నారని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. హైద రాబాద్‌లో శనివారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల కోసం మాజీ మంత్రి హరీష్‌రావు సిఎం రేవంత్ రెడ్డిని కలవడం శుభపరిణామ మన్నారు. దీంతో హరీష్‌రావు కూడా పాజిటివ్‌లైన్‌లోకి వచ్చారని పేర్కొన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ కేంద్ర క్యాబినెట్‌లో పెట్టాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీని కోరామని చెప్పారు. పదేళ్ళ గత ప్రభుత్వం మెట్రోను పట్టించుకోలేదని.. మెట్రో విస్తరణ మీద కూడా కేంద్రాన్ని లేఖలు రాశామని తెలిపారు.

## ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల విడుదల...

# జాప్యంతో విద్యార్థులకు నష్టం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కళాశాలలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల విడుదల చేయడంలో జాప్యం వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతోందని సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. శాసనసభలో శనివారం ప్రశ్నోత్తరాల సందర్భంగా విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ విషయాన్ని ప్రస్తావించారు. గత రెండేళ్లలో ఫీజు రియంబర్స్‌మెంట్ పథకం ద్వారా ఇప్పటివరకు చెల్లించిన మొత్తం ఎంత, ఇంకా చెల్లించాల్సిన మొత్తం ఎంత, విద్యార్థులకు, కళాశాల యజమాన్యాలకు తోడ్పడేందుకు మిగిలిన మొత్తాన్ని ఎప్పటిలోగా విడుదల చేస్తారని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదేశాలను కళాశాలలు పాటించడంలేదని తెలిపారు. వేల కోట్ల రూపాయల బకాయిలతో ప్రైవేట్ కళాశాలలు నడపడం కష్టమే అవుతోందని, రూ.7 వేల కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, ఫలితంగా ఇంటర్, చిన్న స్థాయి కాలేజీల నిర్వహణ భారంతో మూతపడే ప్రమాదం ఉందన్నారు. దీంతో పిల్లల భవిష్యత్ కూడా అగాధంలో పడే పరిస్థితి ఉందన్నారు. మూడు నెలలకోసారి వాయిదాల పద్ధతిలో కూడా ఫీజు రీయంబర్స్‌మెంట్



విడుదల కావడంలేదన్నారు. కార్పొరేట్ కళాశాలలకు కూడా కోట్లాది రూపాయాల బకాయిలు ఉంటే నడపటం కష్టమవుతోందన్నారు. చిన్న కాలేజీలు, ఇంటర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు, ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయని, అన్ని రకాల ఫీజు చెల్లించనందున కళాశాలలు విద్యార్థులకు ధృవపత్రాలు ఇవ్వడం లేదన్నారు. 2022 –23, 2023 –24 రెండు సంవత్సరాలకు కలిపి రూ.3900 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల ముందు దాదాపు రూ.30 కోట్ల టోకేన్‌లు జారీ చేయడం జరిగిందన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి ఏ ఒక్క విద్యార్థి ఫీజు కూడా చెల్లించలేదన్నారు. బకాయిలు చెల్లించి విద్యార్థులు, తల్లిదండ్రులకు ధైర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కూనంనేని సాంబశివ రావు కోరారు.

**సఫారిని ఏర్పాటు చేయాలి : కూనంనేని**

కిన్నెర సాని నుంచి పర్ణశాల, మణుగూరు వద్ద ఉన్న హర్స్‌స్ప్రింగ్‌ను కలుపుతూ భద్రాచలం వరకు సఫారిని ఏర్పాటు చేయాలని సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శాసన సభలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశాన్ని కూనంనేని సాంబశివరావు లేవనెత్తారు. ఈ సఫారి ఏర్పాటు చేయడం వల్ల కిన్నెరసాని నుంచి భద్రాచలం వరకు పర్యాటక రంగం అభివృద్ధిం చెందడంతో పాటు భద్రాచలం దేవాలయానికి భక్తుల సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. కిన్నెరసాని వద్ద గతంలో బోటింగ్ ఉండేదని, ఇక్కడ ఎప్పుడూ 25 టిఎంసిల నీరు ఉంటుందని తెలిపారు. ఈ పక్కనే అటవీ ప్రాంతం ఉంటుందని ఇక్కడ జూపార్క్ ఏర్పాటు చేసేందుకు అధికారులు అంగీకరించారని, దీనిని త్వరితగతిన పూర్తి చేస్తే మంచి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కూనంనేని కోరారు.

## బిఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే రూ.4 వేల కోట్లకు పైగా బకాయిలు




### శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి సీతక్క వర్సెస్ హరీశ్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనసభలో మంత్రి సీతక్క, బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ హరీశ్ మధ్య వాడీవేడి చర్చ జరిగింది. శాసనసభలో శనివారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు, బిఆర్‌ఎస్ సభ్యులు టి.హరీశ్ రావు, బిజెపి సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబులు ఫీజు రీయంబర్స్‌మెంట్‌పై అడిగిన ప్రశ్నలకు మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే రూ.4 వేల కోట్లకు పైగా ఉన్న బకాయిలను, తమ ప్రభుత్వం చెల్లిస్తుందని, ఈ మేరకు కళాశాల యజమాన్యాలకు హామీ ఇచ్చామని వివరించారు. విద్యార్థులకు ధృవపత్రాలను ఆపకూడదని కళాశాలల యాజమాన్యాలకు సూచించామన్నారు. రైతు రుణమాఫీకే రూ.21 వేలు చెల్లించడం వల్ల మిగతా శాఖలపై ఇబ్బందులు వచ్చాయని, ఇప్పటికే రెండు విడతల్లో బకాయిలు చెల్లించామని, మిగతావి త్వరలో చెల్లిస్తామని చెప్పారు. ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు చెందిన చెల్లింపులకు సంబంధించి 1200 టోకెన్‌లను ఇప్పటికే జారీ చేశామని, త్వరలోనే డబ్బులు చెల్లిస్తామని తెలిపారు. దీనిపై హరీశ్‌రావు సందిస్తూ సీతక్క గత ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. బిఆర్‌ఎస్ పాలనకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.2 వేల కోట్ల బకాయిలు ఉండేవన్నారు. బిఆర్‌ఎస్ పాలనలో ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించలేదనేది అవాస్తవమన్నారు. ఆర్థిక మాంద్యం, కరోనా వంటి దుర్భర పరిస్థితులను ఎదుర్కొన్నామన్నారు. రూ.20 వేల కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించామని తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ రూ.800 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించామని, కానీ కేంద్రం నుంచి వచ్చిన నిధులు విడుదల చేశారే తప్ప, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. వెంటనే రూ.2 వేల కోట్లు విడుదల చేస్తే కాలేజీలు బతుకుతాయన్నారు. విద్యార్థులకు ధృవపత్రాలు ఇవ్వకపోవడంతో విద్యా సంవత్సరం కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రస్తుతం డిగ్రీ, జూనియర్ కళాశాలలు సగానికి సగం మూతపడ్డాయన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ రాలేదని సర్టిఫికెట్లు ఇచ్చేటప్పుడు కాలేజీ యజమాన్యాలు విద్యార్థులను సతాయిస్తున్నాయని పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. డబ్బులు చెల్లించాలని అంటున్నారని, పెండింగ్ బకాయిలపై తలో లెక్క చెప్తున్నారని అన్నారు. ఏడాదికోసారి ఇది గుదిబండ కాకుండా చూసుకోవాలన్నారు. బడ్జెట్‌లో అరకొర నిధులే కేటాయిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఈ సంవత్సరమే ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరారు.

# వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశ, రాష్ట్ర ఆర్థిక రంగానికి వెన్నుముక అయిన వ్యవసాయ రంగానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత పాధాన్యతను ఇస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శాసనసభలో శనివారం వ్యవసాయ, సహకార శాఖ పద్దులపై జరిగిన చర్చలో పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలకు మంత్రి సమాధానం ఇచ్చా రు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి సంబంధించి ఈ బడ్జెట్‌లో గత ప్రభుత్వ హాయంలో ఆగిపోయిన వాటితో పాటు కొనసాగించిన కార్యక్రమాలకు ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలకు నిధులను కేటాయించిందన్నారు. అత్యంత లాభదాయకమైన ఆయిల్‌పామ్ సాగుకు రైతులను ఎంఎల్‌ఎలు ప్రోత్సహించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు పడ్డ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రైతు సంక్షేమానికి పెద్దఎత్తున నిధులను ఖర్చు చేయడంతో పాటు వారిని అన్ని విధాలుగా ఆదుకునేందుకు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన రైతుబంధును అదే పేరుతో తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి సంవత్సరంలో రూ.7, 625 కోట్లు చెల్లించిందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 వేల మెగా వాట్ల విద్యుత్ డిమాండ్ ఉన్నప్పటికీ రైతులకు నిరంతరాయంగా విద్యుత్ ఇవ్వాలని ఉద్దేశంతో భారమైన ఆ పథకాన్ని కూడా కొనసాగిస్తున్నామన్నారు. రేషన్ కార్డుల ద్వారా లబ్దిదారులకు సన్నబియ్యం అందించడానికి పన్న ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు రైతులకు క్వింటల్‌కు రూ.500లు బోనస్‌ను అందజేస్తున్నామని, దీంతో గతంలో 25 శాతంగా ఉన్న ఈ సాగు ఇప్పుడు 50 శాతానికి పెరిగిందని చెప్పారు. మార్కెట్ సదుపాయాలు మెరుగుపరచడం, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. మరీ ముఖ్యంగా రికార్డు స్థాయిలో మొట్టమొదటి పంట కాలంలోనే రూ. 32,778 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ మాత్రమేనని చెప్పారు. రుణమాఫీకి సుమారు రూ.20,616 కోట్లు విడుదల చేసామని, రైతు భరోసాకు ఇప్పటికే సుమారు రూ.1100 కోట్ల వరకు రిలీజ్ చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో లక్ష రూపాయల రుణమాఫీని 4దఫాలుగా చేయడంతో వారు చేసిన రూ.11 వేల కోట్ల రుణమాఫీలో రూ.8500 వడ్డీలకే సరిపోయిందన్నారు. దీంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేకపోయినా రూ.2 లక్షల వరకు ఏకకాలంలో ప్రభుత్వం రైతుల రుణమాఫీ చేసిందని చెప్పారు.

**పంటల ధరల నిర్ణయానికి కమిటీ ఏర్పాటు చేయాలి : కూనంనేని సాంబశివరావు**

కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఉన్నట్లు పంటల ధరల నిర్ణయక కమిటీ ఏర్పాటు చేయాలని, మార్కెట్ జోక్యం చేసుకునేందుకు ప్రత్యేకంగా నిధులను కేటాయించాలని సిపిఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివ రావు అంతకు ముందు చర్చలో పాల్గొంటూ అన్నారు. కౌలు రైతులకు సంబంధించి రైతుభరోసా, రైతు బీమా వర్తింపజేస్తారాలేదా సమాధానం చెప్పాలన్నారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ భూమిలేని వారే కౌలుకు తీసుకుని పోలాలను చేస్తుండడంతో వారిని ఆదుకునేందుకు వ్యవసాయ కూలీలకు రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, సన్న ధాన్యానికి క్వింటల్‌కు రూ.500 బోనస్ అందిస్తుండడంతో ఇది కౌలు రైతులకే చెందుతుందని మంత్రి సమాధానం చెప్పారు.

బిజెపి సభ్యులు వెంకటరమణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను యాచకులను చేస్తుందని చేసిన వ్యాఖ్యలపై మంత్రి తుమ్మల నాగేశ్వరావు స్పందిస్తూ ప్రభుత్వ అందిస్తున్న ప్రోత్సహకాలు వారిని ఆదుకోవడానికి మాత్రమే న్నారు. కేంద్ర ప్రభుత్వమే వ్యవసాయ శాఖను వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖగా ప్రకటించిందన్నారు. నిజంగా రైతులను అదుకోవాలని చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేశారు.

## వైద్యశాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్లు

### ప్రజలకు ఉచిత వైద్యం భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

### శాసనసభలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వైద్య, ఆరోగ్య శాఖలో వైద్యులకు పదోన్నతులను, బదిలీలను చేపడుతామని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని, ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్లను త్వరలోనే జారీ చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో ప్రకటించారు. ఏమైనా రోగం వస్తే ప్రజలకు ఉచితంగా వైద్యం అందుతుందనే భరోసాను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్పత్రులలో వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపడతామన్నారు. శాసనసభలో శనివారం వైద్య, ఆరోగ్య సంక్షేమ శాఖకు సంబంధించిన పద్దులపై జరిగిన చర్చకు మంత్రి దామోదర రాజనర్సింహ సమాధానమిచ్చారు. అప్పుడు, ఇప్పుడైనా కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఫీజురియంబర్స్‌మెంట్ పథకాలను తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గుండె మార్పిడి వంటి ఖరీదైన చికిత్సలు కూడా ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా అందుతున్నాయని వివరించారు. ఆరోగ్య శ్రీ పరిధిలోని 1375 వైద్య చికిత్సల ధరలను సుమారు 22 శాతం వరకు పెంచామని, కొత్తగా 163 రకాల చికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చామని, మొత్తం ఆరోగ్యశ్రీ చికిత్సల సంఖ్యను 1835కి పెంచామని తెలిపారు. నెట్‌వర్క్ హాస్పిటల్స్ సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, తద్వారా గ్రామీణ ప్రాంత జిల్లాల్లోనూ ఆరోగ్యశ్రీ సేవలు విస్తరింపజేస్తామని, ప్రజలకు మెరుగైన వైద్యం అందాలంటే, వైద్యులు, నర్సులు సహా అన్ని రకాల సిబ్బంది అవసరమని చెప్పారు. అనతికాలంలోనే ఆరోగ్యశాఖలో 8 వేల పైచిలుకు పోస్టులను భర్తీ చేశామని, మరో 6,268 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని (ల్యాబ్ టెక్నీషియన్ 1284, ఎంపిహెచ్ఎ 1930, ఫార్మసిస్ట్ 732, నర్సింగ్ ఆఫీసర్ 2322, 46 అసిస్టెంట్ ప్రొఫెసర్స్, 156 ఆయుష్ మెడికల్ ఆఫీసర్స్) తెలిపారు. ములుగు, నారాయణపేట్, మెదక్, గద్వాల్, కుత్బుల్లాపూర్, నర్సంపేట్, మహేశ్వరం, యాదాద్రిలో కాలేజీలు, హాస్పిటల్స్‌ను ఎన్ఎంసి నిబంధనలకు అనుగుణంగా రూపొందించామని, ఎన్ఎంసిని ఒప్పించి,హాస్పిటల్స్‌ను తీసుకొచ్చామని వివరించారు. ఒక్కో కాలేజీలో 50 సీట్ల చొప్పున మొత్తం 400 ఎంబిబిఎస్ సీట్లు రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయని, ఎంబిబిఎస్ సీట్ల సంఖ్య 3690 నుంచి 4090కి పెరిగిందని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఉస్మానియా హాస్పిటల్ తెలంగాణ రాష్ట్రానికి తలమానికమని, ఉస్మానియాకు గత వైభవాన్ని తీసుకొచ్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించి, రెండేళ్లలో నూతన ఉస్మానియాను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. జీవన శైలిలో వచ్చిన మార్పులు, ఇతర కారణాలతో బిపి, షుగర్, క్యాన్సర్ వంటి నాన్ కమ్యునికెబుల్ వ్యాధి ఉన్న రోగుల సంఖ్య పెరుగుతోందని, రోగులకు వైద్య సహాయం అందజేసేందుకు ప్రతి జిల్లాలో ఎన్‌సిడి క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రంలో పేషెంట్ల సంఖ్యకు అనుగణంగా దయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లను మంజూరు చేసినట్టు వివరించారు. క్యాన్సర్ పేషంట్లకు చికిత్స అందించేందుకు ఉమ్మడి జిల్లాల్లో రీజనల్ క్యాన్సర్ సెంటర్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించామని, మొబైల్ స్క్రీనింగ్ యూనిట్లను అందుబాటులోనికి తీసుకొచ్చామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలు కాపాడుకునేలా రాష్ట్ర, జాతీయ రహదారులపై ప్రతి 30 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, కేవలం 15 నిమిషాల వ్యవధిలో పేషెంట్‌ను ట్రామాకేర్ సెంటర్‌కు తరలించి, చికిత్స అందించేలా ట్రామాకేర్ వ్యవస్థను అందుబాటులోకి రాబోతున్నదని వివరించారు. ఇటీవలే కొత్తగా 213 అంబులెన్స్‌ను ప్రారంభించామని, అలాగే ఎమర్జెన్సీ రెస్పాన్స్ టైమ్ 14 నిమిషాలకు తగ్గిందని, త్వరలోనే మరిన్ని అంబులెన్సులను తీసుకొచ్చి, ఎమర్జన్సీ రెస్పాన్స్ టైమ్‌ను పది నిమిషాలకు తగ్గించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. వరంగల్ ఎంజిఎంలో త్వరలోనే ఐవిఎఫ్ సేవలను అందుబాటులోకి తీసుకురాబోతున్నామన్నారు. సూపర్ స్పెషాలిటీ టీమ్స్ ఆరు నుంచి ఎనిమిది నెలలో పూర్తి చేస్తామన్నారు. 80 నుంచి 90 శాతం వరకు స్టాఫ్‌ను భర్తీ చేయాలని, రెండు నుంచి మూడు నెలల్లో స్టాఫ్ ఉండాలనే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు.

**వైద్యులు, మందుల కొరత : కూనంనేని సాంబశివరావు**

అంతకుముందు సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ కొత్తగూడెం, పాల్వాంచలో డాక్టర్ల కొరత ఉండడంతో ప్రజలకు సరైన వైద్యం అందడం లేదన్నారు. ఇటీవల జరిగిన బదిలీల నేపథ్యంలో సమస్య మరింత పెరిగిందన్నారు. డాక్టర్ల భర్తీ పక్రియను ఎప్పటి వరకు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. పక్షవాతం వస్తే తక్షణమే మందులు అందించాల్సి ఉంటుందని, దీనికి సంబంధించిన మందులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండడంలేదని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. వైద్య పరీక్షలకు సంబంధించిన సిబ్బంది కొరత కూడా అధికంగా ఉందని, ఈ పోస్టులను కూడా ఎప్పటిలోగా భర్తీ చేస్తారో సమాధానం చెప్పాలని కూనంనేని అన్నారు. బిఆర్‌ఎస్ ఎంఎల్ఎ కె.పి.వివేకానంద మాట్లాడుతూ మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటు పక్రియను త్వరగా పూర్తి చేయాలని కోరారు.

# మినీ ఇండస్ట్రియల్ పార్క్‌లు ఏర్పాటు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని 119 అసెంబ్లీ సెగ్మెంట్‌లలో మినీ ఇండస్ట్రియల్ పార్క్ లు ఏర్పాటు చేస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ట్రిలియన్ డాలర్ లక్ష్యం చేరుకోవడం అంత సులువు కాదని, అయితే పక్కా ప్రణాళికతో ముం దుకు వెళ్లి సాధిస్తామని మంత్రి విశ్వసం వ్యక్తం చేశారు. శాసనసభలో శనివారం జరిగిన ప్రశ్నోత్తరాలలో మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకాలపై సభ్యులు లక్ష్మి కాంతరావు, కసిరెడ్డి నారాయణ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా మినీ పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయబోతునామని తెలిపారు. కొత్త వ్యాపారం చేసే మహిళలకు అవకాశాలు కల్పిస్తామన్నారు. భే షజాలకు పోను అని, తన శాఖలో అసలే ఉండవన్నారు. సిద్దిపేట, సిరిసిల్లలో అన్ని రకాల అభివృద్ధి పనులు జరిగాయని, టీ ప్రైడ్ కింద రూ.75 లక్షలలోపు 45 శాతం రాయితీ ఇస్తున్నామని, స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌పోర్ట్ డ్యూటీపై 100 శాతం రియంబర్స్‌మెంట్, ఎస్‌సి, ఎస్‌టి ఔత్సాహిక పారిశ్రామి కవేత్తలకు రూ.10 లక్షలలోపు మూడోవంతు సబ్సిడి ఇస్తున్నామన్నారు. పారిశ్రామిక వినియోగం కోసం భూమార్పిడి ఛార్జీలు రూ.10 లక్షలకు పరిమితం చేశామన్నారు. యూనిట్‌కు రూ.1.50 చొప్పున నిర్ణీత విద్యుత్ రియంబర్స్‌మెంట్ ఇస్తామని, రూ.కోటి పరిమితితో ఐఐడిఎఫ్ నుంచి మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని, మధ్య, చిన్న తరహా పరిశ్రమలకు మరింత ప్రోత్సాహం ఇస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు సభ్యులకు వివరించారు. పారిశ్రామిక రంగానికి పాలసీ లేకుండే అని, తాము వచ్చాక పాలసీ తీసుకొచ్చామని చెప్పారు. చిన్న తరహా నుంచి మధ్యతరహా, భారీ పరిశ్రమలుగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తామన్నారు. ఎంఎస్ఎంఈలకు ప్రాత్సహిస్తామని చెప్పారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఫ్యూచర్ సిటీలో కూడా మహిళలకు, ఎంఎస్ఎంఈలకు ప్రత్యేకంగా కేటాయింపులు జరుపుతామని వెల్లడించారు. సమగ్ర పారిశ్రామిక వాడను ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# నీ లైఫ్‌స్టైల్ వేరు.. నా లైఫ్‌స్టైల్ వేరు తమ్ముడూ

### ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఉంటున్నా.. పాడి కౌశిక్ రెడ్డిపై మంత్రి సీతక్క ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'తమ్ముడూ నీ లైఫ్ స్టైల్ వేరు.. నా లైఫ్ స్టైల్ వేరు.. నేను ములుగు నియోజకవర్గంలో తిరిగినట్లు నువ్వు నీ నియోజకవర్గంలో తిరగలేవు.. ప్రజలకు ఎవరు ఎక్కువ అందుబాటులో ఉంటారో తేల్చుకుందాం'' అని గ్రామ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అని బిఆర్‌ఎస్ ఎంఎల్ఎ పాడి కౌశిక్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ''వ్యవసాయ, సహకార, పశుసంవర్ధక, కార్మిక, ఉపాధి కల్పన, వైద్య ఆరోగ్య, రవాణ శాఖల పద్ధులపై శాసనసభలో శనివారం జరిగిన చర్చలో బిఆర్‌ఎస్ తరపున పాడి కౌశిక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న వడ్లకు బోనస్ ఇవ్వడం లేదని, బోనస్ ఒక బోగస్‌గా మారిందని,ఈ మధ్య మంత్రి సీతక్క ములుగుకు వెళ్లకుండా హైదరాబాద్‌లోనే ఉంటున్నట్టుగా కనిపిస్తోందన్నారు. దీనిపైన మంత్రి సీతక్కపై విధంగా స్పందించారు. బోనస్ ఇస్తామని చెప్పి రైతులను గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం బోగస్ చేసిందని ఆరోపించారు. వరి వేస్తే ఉరి అని బిఆర్‌ఎస్ చెప్పలేదా అని మంత్రి ప్రశ్నించారు. తమ ప్రభుత్వం సన్నవడ్లకు రూ.1200 కోట్ల బోనస్ ఇచ్చిందన్నారు.

**సీతక్క ఐదు ఎకరాల క్వార్టర్స్‌లో ఉంటే... నేను ఐదు వందల గజాల్లో ఉంటున్నా.**



మరోసారి పాడి కౌశిక్ రెడ్డి తన చర్చను కొనసాగిస్తూ వైఎస్. రాజశేఖర్ రెడ్డి నిర్మించిన ఐదు ఎకరాల భవనంలో సీతక్క ఉంటున్నారని, తాను 500 గజాల స్థలంలో చిన్న ఇంట్లో ఉంటున్నానని ఇది తన స్టేచర్ అని వివరించారు.

**ఆ క్వార్టర్స్ నాది కాదు.. ప్రభుత్వానిది : సీతక్క**

దీనిపైన మంత్రి సీతక్క స్పందిస్తూ ఆ భవనం తనది కాదని, మంత్రి హోదాలో ప్రభుత్వం తనకు ఆ క్వార్టర్స్ కేటాయించిందని, ఆ భవనంలో తాను అదనంగా ఏమీ నిర్మించుకోలేదని, 'నా కొడుకు' కూడా హన్మకొండలోనే ఉంటున్నారని వివరించారు. ఈ క్వార్టర్స్ తమ స్థాయికి చాలా పెద్దదని తెలిపారు. తన క్వార్టర్స్‌లో అదనంగా ఏమైనా నిర్మించానో లేదా చూసేందుకు భోజనం చేసేందుకు బిఆర్‌ఎస్ ఎంఎల్ఎలు అందరూ ఆ క్వార్టర్స్‌కు రావొచ్చని మంత్రి సీతక్క ఆహ్వానించారు. ఆ తర్వాత శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని మంత్రికి క్వార్టర్స్ ఇవ్వడం తాము కొత్తగా ఇవ్వలేదని, గత ప్రభుత్వంలో ఉన్నవారు, అంతకు ముందు కూడా కేటాయించారని, దీనిని కూడా రాజకీయం చేయడం మంచిది కాదని ఆయన కౌశిక్‌రెడ్డికి సూచించారు. రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తున్నామని, భూమి లేని వారికే కూలీ భరోసా ఇస్తున్నామని, కొంత భూమి ఉన్న కూలీలకు కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు చేసే విషయం పరిశీలనలో ఉన్నదని మంత్రి సీతక్క తెలిపారు.

### భూగర్భజలాలను కాపాడుకుందాం : పొన్నం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా 'నీటిని పొదుపుగా వాడుకుందాభూగర్భ జలాలను కాపాడుకుందాం' అని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ నీటి దినోత్సవం మనం నీటి గురించి మాట్లాడుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. అందరం ఒక సంకల్పం తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్షాన విజ్ఞప్తి చేశారు.హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ తీసుకుంటున్న కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని తెలిపారు.

# ఇఫ్తార్‌ను ఘనంగా నిర్వహించండి

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దావత్ ఏ ఇఫ్తార్‌ను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ మీటింగ్ హాల్ ఇఫ్తార్ విందు, రంజాన్ పండుగ ఏర్పాట్లపై భట్టి విక్రమార్క మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి సమీక్షించారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా నిర్వహించే ఈ కార్యక్రమాలకు ఎలాంటి నిధుల కొరత లేదు అని డిప్యూటీ సిఎం తెలిపారు. ఆహారంలో నాణ్యత, ప్రోటోకాల్, సౌకర్యాల కల్పనలో అధికారులు ఎలాంటి రాజీ పడాల్సిన అవసరం లేదని డిప్యూటీ సిఎం



తెలిపారు. ఏర్పాట్లలో అధికారులు ఏమాత్రం అశ్రద్ధ వహించరాదని, చిన్న పొరపాటుకు అవకాశం లేకుండా చూడాలని డిప్యూటీ సిఎం తెలిపారు. ఏర్పాట్లలో ఎలాంటి అనుమానాలు, ఇబ్బందులు ఎదురైనా అధికారులు జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ లేదా తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఏర్పాట్లకి సంబంధించి రోజువారి సమీక్షను ప్రభుత్వ సలహాదారు, ఏర్పాట్ల కమిటీ వైస్ చైర్మన్ షబ్బీర్ అలీ రోజువారి సమీక్ష చేస్తారని తెలిపారు. సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులకు ఏలాంటి అసౌకర్యం లేకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, దావత్ ఏ ఇఫ్తార్‌కు కూడా ఘనంగా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఇఫ్తార్‌ను ఘనంగా నిర్వహిస్తుందని అన్నారు. సమావేశంలో హైదరాబాద్, రాచకొండ పోలీసు కమిషనర్లు సివి ఆనంద్, సుధీర్‌బాబు పాల్గొన్నారు.


**నాగారం మున్సిపాలిటీ కార్యాలయం, మేడ్చల్-మల్కాజ్‌గిరి.**

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

**1.** నెం. E1/19/2024-25 తేది: 24.03.2025. **2.** పనుల సంఖ్య: 2 (సివిల్ పనులు). **3.** అంచనా విలువ: రూ.8.50 లక్షలు. **4.** బిడ్ దాఖలుకు ప్రారంభ తేది: 24.03.2025న సా.4.00గం.ల నుండి. **5.** బిడ్స్ దాఖలుకు ఆఖరి తేది: 25.03.2025న సా.4.00గం.ల వరకు. **6.** బిడ్స్ తెరవడం: 25.03.2025న సా.4.30గం.లకు. **7.** మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన నెం. 7075596119, 9701358580. http:// tender.eprocurement.gov.in లో చూడవచ్చు.

సం/- కమిషనర్, నాగారం మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 12009-PP/CL/ADVT/1/2024-25, Date: 22-03-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
మల్కాజిగిరి సర్కిల్-28

**NIT No. 61/EE-28/SBZ/GHMC/2024-25**

**పని పేరు:** నిర్వహణ పనులు: ఇతరములు-01, **అంచనా విలువ:** రూ.6.25 లక్షలు, **బిడ్ దాఖలుకు ప్రారంభ తేది & సమయం / బిడ్ దాఖలుకు ఆఖరి తేది & సమయం:** 21.03.2025న సా.5.30గం.ల నుండి 28.03.2025న సా.4.30గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్. సెల్: 91547966465, 7331189186. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana.gov.inలో పొందవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 12034-PP/CL/ADVT/1/2024-25, Date: 22-03-2025




## చెరువుకు రంగు!



మన దేశంలో హోలీ ఆడిన వారు సమీపంలోని బావులు లేదా చెరువులకు వెళ్లి స్నానాలు చేస్తా రు. నగరాలు, పట్టణాల్లో ఇళ్లలోనే రంగు వదిలించుకుంటారు. అయితే, చికాగోలో మాత్రం ఇందుకు భిన్నమైన వేడుక జరుగుతుంది. 'సెయింట్ ప్యాట్రిక్స్ డే' ఉత్సవంలో అక్కడి ప్రజలు చికాగో నదికి వెళ్లి, దానికి రంగును అద్దుతారు. ఈ నెల 17వ తేదీ సోమవారం జరిగిన వేడుకలో కొంత మంది బోట్లలో వెళ్లి, నదికి ఆకుపచ్చ రంగు వేశారు. రసాయనాలు లేని, ప్రకృతి సిద్ధమైన ఈ రంగు వల్ల నదిలోని జీవరాశులకు ఎలాంటి సమస్య ఉండదు. పచ్చరంగేసుకున్న చికాగో నది చాలా ప్రత్యేకంగా కనిపించింది. స్థానికులు కూడా ఆకుపచ్చ దుస్తులు ధరించి, వీధుల్లో తిరుగుతూ 5వ శతాబ్దానికి చెందిన మత గురువు ప్యాట్రిక్స్‌ను గుర్తుచేసుకున్నారు. నృత్యాలు చేశారు. విచిత్ర వేషధారణతో ఆకట్టుకున్నారు. ఎంతోమంది పర్యాటకులు కూడా ప్రత్యేకించి ఈ వేడుకను చూసేందుకు బారులు కట్టారు.

## ఆన్‌లైన్‌లో చేపల వేట!



విచిత్రంగా కనిపించినా, ఇది అక్షరాలా నిజం. నెదర్లాండ్స్‌లోని సెంట్రల్ డచ్ నగరమైన ఉట్రెచ్ నదిలో చేపలను ఆన్‌లైన్‌లో పట్టుకోవచ్చు. అయితే, ఇది వండుకోవడానికి కాదు... వాటికి స్వేచ్ఛ నివ్వడానికి.. వివరాల్లోకి వెళితే, ఉట్రెచ్‌లోని నది కాలువకు అడ్డంగా వీరడ్స్‌లూయిస్ లాకులు ఉంటాయి. కేవలం పడవలు వచ్చినప్పుడు మాత్రమే వీటిని తెరుస్తారు. మిగతా సమయంలో మూసి ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో చేపలు రావడం చాలా తక్కువ. అరుదుగా వచ్చే చేపలను ఆన్‌లైన్‌లో పట్టుకోవచ్చంటూ అక్కడి అధికారులు ఐదేళ్ల క్రితం చేసిన ప్రకటనకు గొప్ప స్పందన లభించింది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ఈ ప్రయత్నంలో ఉంటున్నారు. నీటి అడుగున కెమెరాను ఏర్పాటు చేశారు. దానిద్వారా వెబ్‌సైట్ నీటి ప్రవాహాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. చేప ఈ ప్రసారాన్ని చూస్తున్న వారు ఎవరైనా చేప కనిపించిన వెంటనే బటన్‌ను క్లిక్ చేస్తే, స్క్రీన్ షాట్ వస్తుంది. దానిని వెబ్‌సైట్ నిర్వాహకులకు పంపితే, వారు లాక్ తెరవమని అక్కడి కార్మికుడికి చెప్తారు. అతను లాకులను తెరవడంతో, చేప స్వేచ్ఛగా ముందుకు వెళుతుంది. టీవీలో ఈ లైవ్ స్ట్రీమ్‌ను వీక్షించేవారిలో ఏకాగ్రత పెరుగుతుందని, అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది తోడ్పడుతుందని నిర్వాహకులు అంటున్నారు. మొత్తం మీద ఆన్‌లైన్‌లో చేపల వేట ఆలోచన చాలా బాగుంది. ఆడేవారికి కాలక్షేపం.. చేపలకు జీవనదానం.

## వికృత జీవికి అందలం!



ప్రపంచంలోనే అత్యంత వికృతంగా ఉండే జీవి ఏదంటే 'బ్లాబ్‌ఫిష్' అని ఎవరైనా ఇట్టే సమాధానం ఇచ్చేస్తారు. ఆస్ట్రేలియాలోని టాస్మానియాతో, న్యూజిలాండ్‌లోనూ సముద్రలోతుల్లో ఈ చేప జీవిస్తుంది. పెద్ద నోరు... చట్టిముక్కు... ముడతలు పడిన చర్మం (పొలుసులు).. చూడడానికి అత్యంత వికారంగా ఉండే బ్లాబ్‌ఫిష్‌కు హఠాత్తుగా అపారమైన గౌరవం లభించింది. న్యూజిలాండ్ వాసుల 'ఫేవరిట్ యానిమల్' పోటీలో అత్యధిక శాతం మంది ఈ చేపకు ఓటువేసి గెలిపించారు. 12 అంగుళాలు (30 అడుగులు) పొడవు పెరిగే ఈ చేపను 'అగ్లీ యానిమల్ ప్రజర్వేషన్ సెంటర్' (వికృత జీవాల పరిరక్షణ కేంద్రం) తమ లోగోగా ప్రకటించింది. మొత్తానికి నిన్న మొన్నటి వరకూ అందరూ అసహించుకున్న బ్లాబ్‌ఫిష్ ఇప్పుడు హఠాత్తుగా ఒక దేశానికి అత్యంత ప్రీతిపాత్రమైన జీవిగా మారింది. అన్ని రోజులూ ఒకేలా ఉండవని అందుకే అంటారు.

## 'డీర్స్'కు డ్రోన్స్ సాయం



డ్రోన్లను అత్యవసర సమయాల్లో సహాయక చర్యల కోసం కూడా వాడవచ్చని అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రం, గ్రీన్ లేక్ కౌంటీ పోలీస్ అధికారులు నిరూపించారు. అక్కడి బిగ్ గ్రీన్ లేక్‌లో నీరు సగానికిపైగా గడ్డకట్టింది. మంచుపలకలపై పరుగులు తీస్తున్న మూ డు జింకలు సగం నీరు, మంచు కలగలసిన ప్రాంతంలో చిక్కుకుపోయాయి. ముందుకు కదల్లేక, బయటకు రాలేక అల్లాడాయి. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేశారు. రెస్క్యూ సిబ్బంది వెళ్లడానికి ఎక్కువ సమయం పడుతుందని గ్రహించి, డ్రోన్లను ప్రయోగించారు. వాటి సాయంతో మూడు జింకలను క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. డీర్స్‌ను రక్షిస్తున్న దృశ్యాలు డ్రోన్స్‌లో అమర్చిన కెమెరాలో రికార్డయ్యాయి. ఆ వీడియో ఇప్పుడు అమెరికాలోగాక, ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో వైరల్‌గా మారింది.

## అంతరిస్తున్న సముద్ర గడ్డి



సముద్ర గడ్డి ఏటా 12 శాతం చొప్పున తగ్గడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. 'నేచర్' అధ్యయనం ప్రకారం, సముద్ర గడ్డిగా పేర్కొనే నీటిలో పుష్పించే మొక్కలు, గడ్డిజాతులు అంతరించడానికి మానవ కార్యకలాపాల పాత్ర కూడా ఉంది. సుమారు 5 శాతం సముద్ర గడ్డి ఈ కారణంగానే అంతరిస్తున్నదని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. తద్వారా దెబ్బతింటున్న జీవవైవిధ్యాన్ని కాపాడడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని శాస్త్రవేత్తలు అంటున్నారు. 2030 నాటికి కనీసం 30 శాతం సముద్ర గడ్డిని రక్షించకపోతే, జీవవైవిధ్యం దారుణంగా దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు. సముద్రగడ్డి జాతులు సముద్రాలు, సరస్సులు, కుంటలు వంటి నిస్సార తీరప్రాంత జలాల్లో పెరుగుతాయి. నీటి అడుగున దట్టమైన పచ్చిక బైయళ్లు ఈ జాతి మొక్కల ద్వారా ఏర్పడినవే. ఇవి 'అలిస్మాటేల్స్ క్రమానికి చెందినవి. ఇందులోని సుమారు 60 జాతులను నాలుగు కుటుంబాలుగా వర్గీకరించారు.

**బిఎస్ఎస్ మైత్రేయి**

# మోదీ! వినబడుతోందా దక్షిణాది రాష్ట్రాల వాణి

ప్రజాపక్షం
23-03-2025, ఆదివారం

చట్టసభల(లోక్‌సభ, శాసనసభలు) నియోజక వర్గాల డీలిమిటేషన్ (పునర్విభజన)పై రాజ్యాంగబద్ధంగా ఉన్న ఆంక్ష 2026లో తొలగిపోయాక, సెన్సస్ తదుపరి చేబట్టే డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాలు, పంజాబ్ వ్యక్తం చేస్తున్న భయ సందేహాలు ప్రధాని నరేంద్రమోదీ చెవికెక్కుతున్నాయా? ఆయన ప్రథమ అనుయాయి హోం మంత్రి అమిత్ షా అప్పుడప్పుడు చురక తగిలినప్పుడు ఏదేదో మాట్లాడటం తప్ప ప్రధాని నోరు తెరిచిన సందర్భం లేదు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేబడితే, జనాభా నియంత్రణలో జాతీయ విధానాన్ని విజయవంతంగా అమలు జరిపిన దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభలో సీట్లు గణనీయంగా కోల్పోతాయని, జనాభా పెంచుకున్న ఉత్తరాది రాష్ట్రాలకు పెద్ద సంఖ్యలో సీట్లు పెరిగి ఫెడరల్ వ్యవస్థ సమతూకం కోల్పోతుందని, దక్షిణాది రాష్ట్రాల వాణి కేంద్రంలో శక్తి కోల్పోతుందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ వ్యక్తం చేసిన ఆందోళనకు, తమిళనాడులోని సర్వరాజకీయ పక్షాలు – బిజెపి మినహా – వ్యక్తం చేసిన తోడ్పాటుకు – అది దక్షిణాది రాష్ట్రాలతో సంయుక్త కార్యాచరణ ఏర్పాటు చేసి కేంద్రంపై ఒత్తిడి పెంచుతున్నప్పటికీ కేంద్రం నుంచి సరైన సమాధానం లేదు. హోంమంత్రి అమిత్ షా మాత్రం దక్షిణాది సీట్లు తగ్గవని, ఆ మధ్య కోయంబత్తూరులో అన్నారు. ఇదే సమయంలో నూతన విద్యావిధానం ద్వారా హిందీని తమపై విధించటాన్ని తమిళనాడు తీవ్రంగా ఆక్షేపిస్తున్నందున కేంద్రానికి సెగ తగిలింది. సమస్యను పక్కదారి పట్టించేందుకు అమిత్ షా కొత్తమార్గం కనిపెట్టారు. తమ మంత్రిత్వశాఖ రాష్ట్రాలతో జరిపే కమ్యూనికేషన్స్‌లో సంబంధిత రాష్ట్ర భాషలోనే వచ్చే డిసెంబర్ నుంచి ప్రత్యుత్తరాలిస్తుందన్నారు. ఈ పని అన్ని మంత్రిత్వశాఖలు ఎప్పుడో చేయాల్సింది. అది నెప్ ద్వారా హిందీ విధింపు వ్యతిరేక మనో భావాలను సంతృప్తి పరచదు. అవినీతిని కప్పిపుచ్చుకోవటానికి, రాజకీయ లబ్ధికోసం స్టాలిన్ ఈ ఆందోళనలు చేబట్టాడని కింది స్థాయి బిజెపి నాయకులు అవాకులు చెవాకులు పేలుతున్నారు. దక్షిణాదిపై మోదీకి ప్రత్యేక ప్రేమ ఉందని (అధికారం దక్కించుకోవటం!)దక్షిణాది రాష్ట్రాల సీట్లు తగ్గవని ఆ సమస్యలతో సంబంధం లేని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లాంటివారు సైతం చిలకపలుకులు పలుకుతున్నారు.

ఈ నేపథ్యంలో శనివారం చెన్నైలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఏర్పాటు చేసిన జెఎసి సమావేశానికి కేరళ ముఖ్యమంత్రి పి.విజయన్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్నాటక ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు, పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు హాజరైనారు. ఒరిస్సా బిజెపి ముఖ్యమంత్రికి కూడా స్టాలిన్ ఆహ్వానం పంపారు – కాని హాజరు కాలేదు. వారందరిదీ ఒకటేమాట – మేము నష్టపోవటానికి సిద్ధంగా లేము; కలిసికట్టుగా కేంద్రంపై ఒత్తిడి తెస్తాం. '1971 జనాభా ప్రాతిపదికగా పార్లమెంటరీ నియోజకవర్గాల డీలిమిటేషన్‌పై విధించిన స్తంభనను మరో 25 ఏళ్లు పొడిగించాలని' కేంద్రాన్ని కోరుతూ సమావేశం తీర్మానించింది. ఈ పార్టీల ఎంపిలు ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో సంయుక్తంగా ప్రధానమంత్రికి విజ్ఞాపన సమర్పిస్తారు. తాము డీలిమిటేషన్‌కు వ్యతిరేకం కాదని, సబబైన డీలిమిటేషన్ కోరుతున్నామని, పార్లమెంటు స్థానాల డీలిమిటేషన్‌ను స్తంభింపజేసి, అసెంబ్లీ నియోజక వర్గాల డీలిమిటేషన్ చేబట్టాలని కోరారు.

కీలకమైన అంశాల్లో బిజెపి వైఖరి స్పష్టాస్పష్టంగా ఉంటుంది. తమకు లాభసాటి అనుకున్నప్పుడు ఆకస్మిక నిర్ణయాన్ని దేశంపై రుద్దుతారు. ఒకే దేశం ఒకే పన్ను (జిఎస్‌టి)తో రాష్ట్రాల హక్కులపై మొదలైన దాడి 'ఒకే దేశం ఒకే ఎన్నికలు' దాకా వచ్చింది. ఒకే విద్యావిధానం, ఒకే దేశం ఒకే పోటీ పరీక్షలు దాటి 'ఒకే దేశం – ఒకే భాష–ఒకే మతం' ఎజెండా అమలుకు బిజెపి తొందరపడుతోంది. గత ఎన్నికల్లో మోదీ కోరిన 400 సీట్లు ప్రజలు ఇచ్చి ఉండే ఏమయ్యేదో! సొంతంగా అధికారాన్ని కూడా ప్రజలు తిరస్కరించారు. అయినా గుణపాఠాలు తీసుకోకుండా ప్రజలపై స్వారీ చేస్తోంది.

2023 మే 28న కొత్త పార్లమెంటు భవనాన్ని జాతికి అంకితం చేస్తూ ప్రధాని మోదీ చెప్పిన మాటలు వారి మనసులోని ఉద్దేశాన్ని వెల్లడించాయి : " పార్లమెంటు సీట్ల సంఖ్య, పార్లమెంటు సభ్యుల సంఖ్య సమీప భవిష్యత్‌లో పెరిగినపుడు వారెక్కడ కూర్చొంటారో మనం ఆలోచించాలి'. అయితే దీనికి ప్రాతిపదిక ఏమిటో ఇప్పటివరకు వెల్లడించలేదు. జనాభా పెరుగుదలను నియంత్రించిన రాష్ట్రాలకు రక్షణ, ప్రోత్సాహం కలుగజేస్తూ 1971 జనాభా ప్రాతిపదికపై పార్లమెంటరీ నియోజకవర్గాలను స్తంభింపజేస్తూ పార్లమెంటు ఆమోదించిన 42వ, 84వ, 87వ రాజ్యాంగ సవరణల వెనుక ఉన్న ఉద్దేశాన్ని గౌరవించి, మరో 25 సంవత్సరాలు డీలిమిటేషన్ వాయిదా వేయాలన్న దక్షిణాది రాష్ట్రాల డిమాండ్ న్యాయమైనది, ఫెడరల్ స్ఫూర్తిని పరిరక్షిస్తుంది.

# భగత్‌సింగ్ యువతకు ఎలా ఆదర్శనీయుడైనాడు!

వేల కాగడాలు ఏకమైతే... లక్ష గొంతులు ఒక్కటైతే.... కోటి ఆశ లు నిలువెల్లా నింపుతుంటే అతనొక్కడవుతాడు. జాతి ఆత్మఘోషను గుండెల నిండా నింపుకొని పుట్టినవాడు. అన్నానికి బదులు ఆవేశం తిని పెరిగినవాడు. వేల మంది ప్రాణాలు విడిచినా మట్టి వాసననే ప్రాణవాయువుగా పీల్చుకొని బతికినవాడు. తెల్లదొరల ముందు.. ధైర్యంగా మీసం మెలేసిన పౌరుషాగ్ని. ఉరితాడును సైతం ఎంతో ఇష్టంగా ముద్దాడిన పోరాట యోధుడు, భారత స్వాతంత్ర్య చరిత్రలో అరుణారుణ అక్షరాలతో లిఖించబడిన విప్లవ వేగుచుక్క షాహీద్ భగత్ సింగ్....


భారతదేశ స్వాతంత్ర్య సాధనకు ఎందరో మహానుభావులు తమ జీవితాలను త్యాగం చేశారు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెళ్లగించటానికి ప్రాణాలను సైతం పణంగా పెట్టారు. వీరిలో ఎప్పటికీ గుర్తుండిపోయే మహానుభావుడు షహీద్ భగత్ సింగ్. ఆయన పేరు వింటేనే భారతీయ యువత రక్తం ఉద్రేకంతో, గర్వంతో ఉప్పొంగిపోతుంది. ఆయన ఆశయాలు, ఆలోచనలు, ఆవేశం ఎంతోమంది యువతకు స్ఫూర్తి ఇస్తూనే ఉంటుంది. గొప్ప విప్లవకారుడిగా, స్వాతంత్ర సమర యోధుడిగా చరిత్రలో నిలిచిపోయిన వీరుడు, ధీరుడు భగత్ సింగ్.

భగత్ సింగ్ 1907 సెప్టెంబర్ 28న ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్న లాయల్ జిల్లాలోని 'బంగా సమీపంలో 'ఖత్కర్ కలాన్' గ్రామంలో, సర్కార్ కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు జన్మించాడు.

13 ఏళ్ల వయసులోనే మహాత్మా గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమానికి భగత్ సింగ్ ప్రభావితుడయ్యాడు. ఆ సమయంలోనే బ్రిటిష్ ప్రభుత్వానికి ఎదురుతిరిగిన భగత్ విదేశీ వస్తు బహిష్కరణలో పాల్గొని బ్రిటన్ నుండి దిగుమతి అయిన వస్తువులను తగలబెట్టడం ద్వారా గాంధీజీ సిద్ధాంతాలను అనుసరించాడు. అయితే ఉత్తరప్రదేశ్‌లోని చౌరీ చౌరా గ్రామస్తులపై బ్రిటిష్ పోలీసులు జరిపిన కాల్పుల్లో అనేక మంది నిరాయుధులైన రైతులు ప్రాణాలను కోల్పోయారు. దానికి ప్రతిగా గ్రామస్తులు తిరగబడి ఆ పోలీస్ స్టేషన్ కు నిప్పు పెట్టి తగలబెట్టారు. ఆ స్టేషనులో ఉన్న పోలీసులు కొందరు మాడి మసి అయినారు. ఈ సందర్భంగా అహింసావాది అయిన గాంధీ ఆ గ్రామస్తుల హింసాత్మక తిరుగుబాటును అపరాధంగా భావించి తాను చేపట్టిన సహాయ నిరాకరణోద్యమాన్ని అర్ధంతరంగా నిలిపివేశారు. గాంధీ గారి అహింసావాదంపై అసంతృప్తి చెందిన భగత్ సింగ్ విప్లవోద్యమంలో చేరి తెల్ల దొరలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేసాడు.

గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ఉపసంహరించుకున్నాక దేశంలో హిందూ ముస్లింల మధ్య తలెత్తిన సంఘర్షణలను భగత్ సింగ్ కళ్ళారా చూశాడు. అప్పటినుండి మతాన్ని, మత నమ్మకాలను, సిద్ధాంతాలను విమర్శించటం మొదలుపెట్టాడు. విప్లవకారుల స్వతంత్ర ఉద్యమానికి మతం అడ్డుగోడగా నిలుస్తుందని గ్రహించిన భగత్ సింగ్ ఆ క్షణం నుండి మతవిశ్వాసాలను విడనాడాడు.'నౌ జవాన్ భారత్ సభ' (భారత యువజన సంఘం)లో చేరాడు. 1928లో 'కీర్తి కిసాన్ పార్టీ' కార్యదర్శిగా, తరువాత అధ్యక్షుడిగా పని చేసాడు. భగత్ సింగ్ 'హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ పార్టీ' వ్యవస్థాపక సభ్యులులో ఒకరిగా ఉన్నాడు. ఈ పార్టీలో పనిచేస్తూ సహ విప్లవకారులను, అనేకమంది యువకులను ఆకర్షించాడు.

1928లో భారతదేశంలోని వర్తమాన రాజకీయ పరిస్థితిపై నివేదికను కోరుతూ బ్రిటిష్ ప్రభుత్వం సైమన్ కమిషన్ను వేసింది. 30 అక్టోబర్ 1928న ఆ కమిషన్ లాహోర్‌ను సందర్శించినప్పుడు సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా లాలాలజపతిరాయ్ (పంజాబ్ కేసరి) నాయకత్వంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఆ నిరసనను బ్రిటిష్ పోలీసులు హింసాయుతంగా మార్చారు. లాలాలజపతిరాయ్ మీద అత్యంత క్రూరంగా లాఠీఛార్జి చేసి చాతి మీద విపరీతంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడిన లాలాలజపతిరాయ్ తరువాత రోజు మరణించాడు. ఈ సంఘటనను కళ్ళారా చూసిన భగత్ సింగ్ చలించిపోయాడు. దెబ్బకు దెబ్బ ఎలాగైనా ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. లాలా లజపతిరాయ్ హత్యకు కారణమైన పోలీస్ అధికారి స్కాట్‌ను ఎలాగైనా మట్టుపెట్టాలని విప్లవకారులు శివరామ్ రాజ్ గురు, జై గోపాల్, సుఖదేవ్ థాపర్‌లతో పథకం వేశాడు. 'స్కాట్' ను గుర్తించిన జైపాల్ ఆయన్ను కాల్చమంటూ భగత్ సింగ్ కు సంకేతాలు ఇచ్చాడు. అయితే పొరపాటు గుర్తింపు కారణంగా 'స్కాట్'కు బదులు జె.పి. సాండర్స్ హతమయ్యాడు. పోలీసుల కంట పడకుండా లాహోర్‌కి వెళ్లి అజ్ఞాత జీవితం గడిపాడు భగత్ సింగ్.




మార్చ్ 23న భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా)







తను గుర్తు పట్టకుండా ఉండటానికి గడ్డంని గీసుకుని, తల వెంట్రుకలను కత్తిరించుకొని సిక్కు మత విశ్వాసాలను సైతం ఉల్లంఘించటానికి వెనుకాడలేదు.

విప్లవకారుల చర్యలను కర్కశంగా అణిచివేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం ఒక కొత్త చట్టం తీసుకువచ్చింది. భగత్ సింగ్ లాంటి విప్లవకారులను అణచటం ఆ చట్టం ముఖ్య ఉద్దేశం. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర శాసన సభపై బాంబు వేయాలని, సామ్యవాద గణతంత్ర యువజన సంఘం వ్యూహరచన చేసింది. భగత్‌సింగ్‌తో పాటు సహ విప్లవకారుడు 'దత్' 8 ఏప్రిల్ 1929న శాసనసభ వసారాపై బాంబు విసిరి 'ఇంక్విలాబ్ జిందాబాద్' (విప్లవం వర్ధిల్లాలి) అని గొంతెత్తి నినదించారు. మీ (బ్రిటిష్) వినికిడి శక్తి కోల్పోయేలా ఇలానే గొంతెత్తి అరుస్తామనీ, వారు ముద్రించిన పలురకాల కరపత్రాలను వెదజల్లారు. విసిరిన బాంబు కేవలం ఒక పొగ బాంబు మాత్రమే. ఎవరు మరణించటం గాని, గాయపడటం గానీ జరగలేదు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని అవసరమైతే హింసాత్మకంగా నైనా ప్రతిఘటిస్తామని హెచ్చరిక చేయడం కోసమే, తమ వ్యూహంలో భాగంగా, ఉద్దేశ్యపూర్వకంగా, జాగ్రత్తలతో డమ్మీ బాంబుతో దాడి చేశామని భగత్ సింగ్, దత్ లు చెప్పారు. ఈ దాడి అనంతరం ఇద్దరూ స్వచ్ఛందంగా పోలీసులకు లొంగిపోయారు.

జెపి. సాండర్స్ హత్య కేసులో భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ ల ను అరెస్టు చేసి బ్రిటిష్ ప్రభుత్వం జైల్లో పెట్టింది. విచారణలో భాగంగా దేశ స్వాతంత్రం కోసం తన గళాన్ని వినిపించడానికి న్యాయస్థానాన్ని ఒక ప్రచార వేదికగా మలుచుకున్నారు భగత్ సింగ్. న్యాయస్థానం ఆ ముగ్గురికి ఉరిశిక్ష ఖరారు చేసింది.

ఉరిశిక్ష ఖాయం అన్న సంగతి తెలిసిన తర్వాతనే కాదు అంతకు ముందు నుండి జైలులో ఉన్నప్పుడు కూడా భగత్ సింగ్ నిత్య అధ్యయనశీలిగా ఉండేవాడు.

రష్యాలో బోల్షివిక్ విప్లవం జయప్రదం అవ్వటంతో దాని వెలుగులో యూరప్ ఉద్యమాల చరిత్రను అధ్యయనం చేశాడు. జైల్లో ఉండగానే మార్క్స్, ఎంగిల్స్, లెనిన్‌లు రచించిన అనేక గ్రంథాలను, వాటితో పాటు రాజనీతి శాస్త్రం, అర్థశాస్త్రం, సామాజిక శాస్త్రాలను చదివాడు. క్రమంగా సామ్యవాదం వైపు మళ్లారు. జైలు అధికారులు నీ ఆఖరి కోరిక ఏమిటి? అని అడిగినప్పు డు నేను లెనిన్ జీవిత చరిత్ర చదువుతున్నానని, నేను చనిపోయే లోగా దానిని పూర్తి చేయాలని కోరుకుంటున్నా అని చెప్పాడు.

మార్క్సిజం అధ్యయనంతో భగత్ సింగ్ ఎక్కువగా ప్రభావితుడయ్యాడు. భారతదేశంలో ప్రథమ మార్క్సిస్టుల లో భగత్ సింగ్ ఒకరిని ప్రముఖ భారత చరిత్రకారుడు కె.ఎన్ ఫణిక్కర్ అభివర్ణించాడు. 1931లో జైలులో ఉండగా నాస్తికవాద తత్వాన్ని వివరిస్తూ నేనెందు కు నాస్తికుడనయ్యాను అనే శీర్షికతో ఒక వ్యాసం రాశాడు. సర్వశక్తి సంపన్నుడు అని పిలవబడుతున్న దేవుడి పట్ల తనకు విశ్వాసం లేదని ప్రకటించాడు. ఇతరుల హృదయాలకు దగ్గరగా ఉండే కల్పిత గాథలు, మూఢవిశ్వాసాలను నమ్మే స్థితికి తాను దిగజారబోనని స్పష్టం చేశాడు. మతం చావును సులభతరం చేస్తుంది అనే వాస్తవాన్ని గుర్తించానని, అయితే నిరూపితం కానీ దైవత్వం కేవలం మానవ బలహీనతకు సంకేతమని తన వ్యాసంలో పేర్కొన్నాడు.

తనకు పడిన ఉరిశిక్ష అమలు గురించి భగత్ సింగ్ మరో ఇద్దరు తమను యుద్ధ ఖైదీలుగా గుర్తించారు గనుక ఉరి తీయకుండా, కాల్పుల బృందం చేత హతమార్చాలని వైస్రాయ్‌కి లేఖ రాశారు. తనను ఉరి తీయడానికి నాలుగు రోజుల ముందు తన మిత్రుడైన ప్రసన్న మెహతా జైలులో భగత్ సింగ్ ను కలిసి క్షమా భిక్ష మూసాయిదాపై సంతకం చేయమని కోరాడు. భగత్ సింగ్ క్షణం కూడా ఆలోచించకుండానే సంతకం చేయడానికి నిరాకరించాడు. బాధతో ప్రసన్న మెహతా భగత్ సింగ్ యొక్క పట్టుదలను చూసి వెనుదిరిగి వెళ్లిపోయాడు.ఉరికి వ్యతిరేకిస్తూ నిరసన చేపడుతూ ఆయన మద్దతుదారులు ఆ సందర్భంలో భగత్ సింగ్ ను 'షాహీద్' గా అభివర్ణించారు.

ప్రజల ఐక్యతను చీల్చే మతోన్మాద రాజకీయాలు నేడు దేశంలో విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనైనా... నేటికాలంలోనైనా అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చి దోపిడీదారులకు ఉపకరించే దేశద్రోహ కర్తవ్యాన్నే మతోన్మాత శక్తులు నెరవేరుస్తున్నాయి.

దేశ స్వాతంత్ర్య సముపార్జన ధ్యేయంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన భగత్ సింగ్ స్వాతంత్ర్యం అనంతరం కుల,మతాలకు అతీతంగా ధనిక, పేద తారతమ్యాలు లేని, అవినీతి రహిత సమసమాజ స్థాపన కలలు కన్నాడు. మతోన్మాత ముక్త భారతం సాధించడానికి భగత్ ఆలోచనలు, ఆయన చూపిన కార్యాచరణ, మనకు తరగని స్ఫూర్తిగా నిలుస్తాయి. మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఓడించడమే భగత్ సింగ్ కు నేటి తరం అందించగలిగే నిజమైన నివాళి.

ఇంక్విలాబ్ జిందాబాద్....
భగత్ సింగ్ అమర్ హే...



**కల్లూరు ధర్మేంద్ర,**
తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి
అఖిల భారత యువజన సమాఖ్య
8074246685

# ఉద్రిక్తతలను పెంచనున్న యూరప్ 'అణు ఛత్రి' వాదన

**సోఫీ బోల్ట్**

ఉక్రెయిన్, రష్యాల యుద్ధం ఒక పరిష్కారం కోసం అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నం చేస్తూనే, మరోవైపు యూరప్‌పై భారీగా, ప్రచ్ఛన్న యుద్ధకాలం స్థాయిలో సైనిక వ్యయం కోసం కూడా ఒత్తిడి తీసుకువస్తున్నాడు. ఇందుకు అంగీకరించడానికి యూరోపియన్ నాయకులు అత్యంత ఉత్సాహంగా ఉన్నట్లు కనిపిస్తోంది. బ్రిటీష్ ప్రధాని కీర్ స్టార్మర్ 30,000 మంది తో ప్రతిపాదిస్తున్న శాంతి ప్రణాళిక అనే బడే దానికోసం శక్తివంతమైన యూరోపియన్ సైన్యంతో పాటు, ఫ్రాన్స్ ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, జర్మనీ ఛాన్సలర్ పీఠమెక్కబోయే ఫ్రీడ్రిచ్ మెర్జ్ యూరోపియన్ 'అణు గొడుగు'(అణురక్షణ కవచం) కోసం ఒత్తిడి చేస్తున్నారు. ఫ్రాన్స్ తన అణుసామర్థ్య జెట్ విమానాలను దాని సరిహద్దుల వెలుపల మోహరించవచ్చు. రష్యా దూకుడు నుండి యూరప్‌ను 'రక్షించడానికి' బ్రిటన్ ముందుకు వచ్చి తన బ్రిటీష్ అణు జలాంతర్గాములను మోహరించాలని మెర్జ్ కోరుతున్నారు.

కాబట్టి ఈ 'అణు గొడుగు' ఆచరణలో నిజంగా ఏమి సూచిస్తుంది – దాంతో ప్రమాదాలు ఏమిటి?

అణుసామర్థ్య యుద్ధ విమానాలు, అణుశక్తితో నడిచే జలాంతర్గాములు ద్వారా ప్రయోగించేందుకు ప్రస్తుతం ఫ్రాన్స్ వద్ద 290 వార్ హెడ్ (అణ్వాయుధాలు) ఉన్నాయి. ఈ ఆయుధాలు తమ 'కీలక ప్రయోజనాలను' 'రక్షించడం కోసం' అని ఫ్రాన్స్ అణ్వాయుధ సిద్ధాంతం పేర్కొన్నప్పటికీ, 2020లో ఫ్రాన్స్ యొక్క 'కీలక ప్రయోజనాల'కు ఇప్పుడు యూరోపియన్ కోణం ఉంది' అని మాక్రాన్ ప్రకటించారు. అయితే, ఉక్రెయిన్ లేదా ఆ ప్రాంతంలో అణు క్షిపణుల దాడి జరిగితే ఫ్రాన్స్ కీలక ప్రయోజనాలు ప్రమాదంలో ఉండబోవని కూడా 2022 లో ఆయన పేర్కొన్నారు. కాబట్టి, ఉక్రెయిన్ 'రక్షణ' ను చేర్చాలంటే మాక్రాన్ ఫ్రెంచ్ అణ్వాయుధ సిద్ధాంతాన్ని పూర్తిగా మార్చవలసి ఉంటుంది. ప్రస్తుతం 5,000 కంటే ఎక్కువ అణ్వాయుధాలను కలిగి ఉన్న రష్యాపై అణు దాడిని ప్రారంభించడానికి ఫ్రాన్స్ సిద్ధంగా ఉండాలని దీని అర్థం.

ఈ అణు గొడుగు ఎలా పని చేస్తుందనే దాని గురించి ఊహాగానాలలో అణుశక్తితో నడిచే యుద్ధ విమానాలను జర్మనీ లేదా పోలాండ్‌లో మోహరించే అవకాశం ఉంది. (రెండు దేశాలు ఆసక్తిని వ్యక్తం చేశాయి). తమ వద్ద అణ్వాయుధాలు లేని దేశాలలో అణ్వాయుధాలను మోహరించడం అణు భాగస్వామ్యం అని పిలుస్తారు. ఇది అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందానికి విరుద్ధం. ఫ్రాన్స్, పోలాండ్ మధ్య అణు భాగస్వామ్య ఒప్పందం కుదిరితే, రష్యాతో పోలాండ్‌కు ఉన్న 130 మైళ్ల సరిహద్దు వెంబడి అణుశక్తి చోదిత విమానాలను మోహరించవచ్చు. భవిష్యత్తులో కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘించబడితే, జర్మనీ, పోలాండ్ దేశాలలో మోహరించిన ఫ్రెంచ్ అణుశక్తి విమానాలు రష్యా పై ప్రయోగించబడతాయా? ఈ ఫ్రెంచ్ బాంబర్లు యూరోపియన్ సరిహద్దులను గస్తీ కాస్తాయని మరొక సూచన. అలాంటి సరిహద్దులలో ఉక్రెయిన్ కూడా ఉంటుందా? కాల్పుల విరమణ ఉల్లం ఘన జరిగినప్పుడు, అణ్వాయుధ ఫ్రెంచ్ బాంబర్లు ఉక్రెయిన్ లో కూడా మోహరించబడతా యా? మాక్రాన్ 'అణు గొడుగు' ఆలోచన విస్తృతంగా ప్రాచుర్యం పొందుతున్నప్పటికీ, ఈ భయానక దృశ్యాలు, అలాంటి ఘర్షణలకు మానవ మూల్యం గురించి చర్చించబడటం లేదు. ఈ అసంబద్ధ ప్రతిపాదనల వెనుక ట్రంప్ ఆధ్వర్యంలో అమెరికా తన సైనిక, అణ్వస్త్ర ఉనికిని యూరప్ నుండి ఉపసంహరించుకుంటుందని, దాని 'కీలక' భాగస్వామి బ్రిటన్ కోసం అణు శక్తి సరఫరాను ఆపివేస్తుందని ఊహాగానాలు ఉన్నా యి.

రష్యా దురాక్రమణకు వ్యతిరేకంగా 'యూరప్‌ను రక్షించడంలో అమెరికా విశ్వసనీయత ఎప్పుడైనా ప్రశ్నార్థకమైతే', ఫ్రాన్స్‌తో బ్రిటన్ మరింత సన్నిహితంగా పని చేయాలని బ్రిటన్‌లో మాజీ రక్షణ కార్యదర్శి మాల్కం రిఫ్కిండ్ వంటి వ్యక్తులు వాదిస్తున్నారు.

ఇది అమెరికాతో బ్రిటన్ 'ప్రత్యేక సంబంధం' అని పిలువబడే అంశానికి మరిన్ని సవాళ్లను లేవనెత్తింది. బ్రిటన్ అణు ఆధారితపై స్వాగతించదగిన వెలుగును ప్రసరింపజేసింది. బ్రిటన్ అణు జలాంతర్గాముల నుండి ప్రయోగించే బాలిస్టిక్ క్షిపణులు అమెరికా నుండి లీజుకు తీసుకోబడ్డాయని, వార్ హెడ్‌లు అమెరికా రూపకల్పన చేసిందని అని విస్తృతంగా వార్తలు వెలువడ్డాయి.

వాస్తవానికి, మొత్తం అణ్వాయుధ వ్యవస్థ అమెరికా నేతృత్వంలోని నాటో నియంత్రణలో ఉంది. కాబట్టి, బ్రిటన్ తన అణ్వాయుధ జలాంతర్గాములను యూరోపియన్ అణు గొడుగులో భాగం గా చేయాలనుకుంటే, అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ నుండి అనుమతి పొందాల్సి ఉంటుంది.

దీనికి మారియన్ మెస్మర్ వంటి సైనిక విశ్లేషకులు ప్రతిస్పందిస్తూ అమెరికాపై తన అణు ఆధారితను అంతం చేయడానికి, బ్రిటన్ పూర్తిగా సరికొత్త, వాయు ప్రయోగ అణ్వాయుధ వ్యవస్థను నిర్మించాలని వాదిస్తున్నారు. నిస్సందేహంగా, ఇందుకయ్యే వ్యయాన్ని బ్రిటీష్ , ఫ్రెంచ్ పన్ను చెల్లింపుదారులే చెల్లించాల్సి ఉంటుంది.

బ్రిటీష్ ప్రభుత్వం ఇప్పటికే వ్యవస్థ పునఃస్థాపనపై వృథా చేస్తున్న 205 బిలియన్‌ల పౌండ్‌లకు ఇది అదనంగా ఉంటుంది. ఇది 'సాధ్యంకానిది', 'భరించలేనిది'గా ప్రభుత్వ వాచ్‌డాగ్ పేర్కొంది.

ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ యూరోపియన్ అణుగొడుగుపై మౌనంగా ఉన్నారు. ట్రంప్‌కు వ్యతిరేకంగా, ఉక్రెయిన్ నాటో సభ్యత్వం కోసం పోరాడుతున్న వ్యక్తిగా తనను తాను నిలబెట్టుకునే ప్రయత్నం చేసిన ఆయన ఇప్పుడు వేగంగా మారి 'బలం ద్వారా శాంతి' అనే ట్రంప్ మాటలను అనుకరించాడు.


'అమెరికాతో, మన యూరోపియన్ భాగస్వాములతో కలిసి పని చేసిన బ్రిటీష్ సమర్థత కారణంగా 80 సంవత్సరాలుగా శాంతి కాపాడిం ది' కాబట్టి తన 'శాంతి ప్రణాళిక'ను 'అమెరికాతో కలిసి' రూపొందించాలని ఆయన ఇప్పుడు వాదిస్తున్నారు. అలాంటి కూటమి కచ్చితంగా శాంతిని కాపాడడంలో పూర్తిగా విఫలమైంది. అంతే కాకుండా ప్రపంచాన్ని యుద్ధం, పేదకం వైపు నడిపించింది. మానవ విపత్తు, ఆర్థిక సంక్షోభాలు, పర్యావరణ విధ్వంసానికి కారణమైంది.

నిజానికి రాజకీయ నాయకులు వాస్తవాలపై పట్టు సాధించాలి. నాటోకు అమెరికా ఇచ్చే 800 బిలియన్ డాలర్ల సైనిక వ్యయాన్ని తాము భరించేందుకు తెగువతో చేస్తున్న ప్రయత్నాలు బ్రిటన్, యూరప్‌ను దివాళా తీయించడంతో పాటు, మన సమాజాలను నాశనం చేస్తుంది . ప్రపంచ సంక్షోభాలన్నింటినీ మరింత తీవ్రతరం చేస్తుంది.

యూరప్, ఉక్రెయిన్, రష్యాలకు స్థిరమైన శాంతిని సైనికులు, క్షిపణులతో పాటు నిరంతర, సంభావ్యతతో కూడిన అణు యుద్ధ ముప్పుతో సాధించలేము. అంటే మొత్తం ప్రాంతానికి దీర్ఘకాలిక శాంతి, శ్రేయస్సును కల్పించే స్థిరమైన భద్రతా నిర్మాణాన్ని అభివృద్ధి చేయడం ద్వారానే అది సాధ్యం.

యూరప్ నుండి అమెరికా, బెలారస్ నుండి రష్యా అణ్వాయుధాలను ఉపసంహరించుకోవడం. అమెరికా, రష్యా, బ్రిటన్ , ఫ్రాన్స్ వారి స్వంత అణ్వాయుధాలను వదిలించుకోవడానికి కార్యక్రమాలను అభివృద్ధి చేయడం ట్రంప్ అణ్వాయుధ నిరాయుధీకరణను కోరుకుంటున్నట్లు చెప్పినందున, అది సాధ్యమయ్యేందుకు ఆయనతో స్టార్మర్ కలిసి పని చేయాలి.

*(మార్నింగ్ స్టార్ సౌజన్యంతో)*



# జాతీయం

NATIONAL NEWS GENERAL NEWS



## జైలు నుంచి పోసాని విడుదల

**అమరావతి:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, సినీ నటుడు పోసాని కృష్ణమురళి ఎట్టకేలకు శనివారం విడుదలయ్యారు. పోసాని కృష్ణమురళికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ గుంటూరు ఆరో అదనపు జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌ఛార్జి జడ్జి జి.స్పందన శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గుంటూరు జిల్లా జైలు నుంచి అధికారులు పోసానిని విడుదల చేశారు. సిఎం చంద్రబాబు ఫొటోలను మార్ఫింగ్ చేసి, ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కూడా దుర్భాషలాడుతూ పోసాని గతంలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై సీఐడీ పోలీసులు ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఇక్కడి జిల్లా జైల్లో ఉన్న పోసాని పిటిషన్ దాఖలు చేయడంతో జడ్జి బెయిల్ మంజూరు చేశారు. రూ.2 లక్షల విలువతో ఇద్దరు వ్యక్తులు జామీను ఇవ్వాలని, జైలు నుంచి విడుదలైన అనంతరం దేశం విడిచి వెళ్లరాదని, కేసు గురించి ఎక్కడా ప్రకటనలు చేయరాదని షరతులు విధించారు. సాక్షులపై ఎలాంటి ప్రభావం చూపరాదని, కేసు దర్యాప్తునకు సహకరించాలని ఆదేశించారు.

# 3 ఒడిశాలో రోజుకు బాల్య వివాహాలు

### 2019 నుండి 2025 వరకు 8,159 కేసులు

### అత్యధికంగా నబరంగ్‌పూర్ జిల్లాలో

**భువనేశ్వర్ :** ఒడిశాలో బాల్య వివాహాలు ఆగడం లేదు. అధికార యంత్రాంగం అనేక చర్యలు తీసుకున్నప్పటికీ ప్రభుత్వ గణాంకాల ప్రకారం గత ఆరు సంవత్సరాలలో రాష్ట్రంలో ప్రతిరోజూ కనీసం మూడు కేసులు నమోదయ్యాయి. గిరిజన ఆచారం, వరకట్నం, కార్మిక కుటుంబాల వలసలు, కుమార్తెలు పారిపోతారనే తల్లిదండ్రుల భయాన్ని ఈ ఆశ్చర్యకరమైన సంఖ్యకు కారణమని ఈ రంగంలో పనిచేస్తున్న కార్యకర్తలు చెబుతున్నారు. 2019 నుండి ఫిబ్రవరి 2025 వరకు ఒడిశా అంతటా 8,159 బాల్య వివాహాలు జరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. మొత్తం 30 జిల్లాల్లో అత్యధికంగా నబరంగ్‌పూర్ నుండి 1,347 కేసులు నమోదయ్యాయి. 966 కేసులతో గంజాం జిల్లా రెండవ స్థానంలో ఉండగా, 636 కేసులతో కోరాపుట్ తరువాతి స్థానంలో ఉంది. ఆ తర్వాత మయూర్‌భంజ్ (594), రాయగడ (408), బాలసోర్ (361), కియోంఝర్ (328), కంధమాల్ (308) మరియు నయాఘర్ (308) ఉన్నాయి. ఆ ఆరు సంవత్సరాలలో ఝార్సుగూడ జిల్లాలో ఇలాంటి 57 కేసులు అత్యల్పంగా నమోదయ్యాయి. సామాజిక కార్యకర్త నమ్రతా చద్దా మాట్లాడుతూ బాల్య వివాహాలను రాత్రికి రాత్రే పూర్తిగా ఆపలేమమని, ఆడపిల్లలు, వారి తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేయాలనే ఆలోచనలు చేయకుండా ఉండే వాతావరణాన్ని, అలాంటి సమాజాన్ని మనం సృష్టించాలి అని అన్నారు. తక్కువ వయస్సు ఉన్న పిల్లలను వివాహం చేసుకోవడం గిరిజనుల సాంప్రదాయ ఆచారమని, ముఖ్యంగా దుర్బల గిరిజన సమూహాలకు చెందినదని ఆమె అన్నారు. జీవనోపాధి కోసం ఇతర ప్రదేశాలకు వలస వెళ్ళే తల్లిదండ్రులు తమ అమ్మాయిల భవిష్యత్తును కాపాడుకోవడానికి, ఆమె భద్రత కోసం చట్టబద్ధమైన వయస్సుకు ముందే వివాహం చేస్తారని చాద్దా అన్నారు, ఎందుకంటే అమ్మాయి కుటుంబానికి అవమానం కలిగించే వ్యక్తితో పారిపోతుందని వారు భయపడుతున్నారు. వరకట్నం కూడా అలాంటి వివాహాలకు దారితీస్తుందని సామాజిక కార్యకర్త అన్నారు. ఎందుకంటే వధువు పెద్ద వయస్సు ఉంటే డిమాండ్ ఎక్కువగా ఉంటుందన్నారు. వారికి సరైన విద్య లేదా నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించగలిగితే బాల్య వివాహాల ముప్పు తప్పుతుందని, తద్వారా వివాహమే అమ్మాయి భవిష్యత్తుకు ఏకైక అడుగు అని వారు భావించ ఉంటారని అని చాద్దా అన్నారు. బాల్య వివాహాలను ఆపడానికి ఒడిశా ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు పంచాయతీ, బ్లాక్, అంగన్‌వాడీ స్థాయిలలో అవగాహన ప్రచారాలను నిర్వహిస్తున్నట్లు ఒక అధికారి తెలిపారు. చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మరియు రెసిడెన్షియల్ హాస్టళ్ల వార్డెన్లు/మాట్రన్‌లను చీఫ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ ఆఫీసర్లుగా నియమించారు. అదేవిధంగా, అన్ని పాఠశాలలు, కళాశాలల అధిపతులను చీఫ్ మ్యారేజ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లుగా నియమించినట్లు అధికారి తెలిపారు. బాల్య వివాహ నిషేధ చట్టం కింద ఏర్పడిన రాష్ట్ర స్థాయి కమిటీల సమావేశాలను ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు నిర్వహిస్తోంది. చిన్న వయసు వివాహాలతో పాటు, రాష్ట్రం బాల కార్మికుల సవాలుతో కూడా పోరాడుతోంది. గత ఆరు సంవత్సరాలలో కార్మికులుగా పనిచేస్తున్న 328 మంది పిల్లలను అధికారులు రక్షించారు. 2019–20లో 85 మందిని రక్షించగా, 2020–21లో నలుగురు, 2021–22లో 43 మందిని రక్షించినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. అదేవిధంగా, 2022–23లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి 107 మంది బాల కార్మికులను, మరుసటి సంవత్సరం 44 మంది బాల కార్మికులను రక్షించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి 15 వరకు, ఒడిశాలోని వివిధ జిల్లాల నుండి అధికారులు 45 మంది బాల కార్మికులను రక్షించారు. పిల్లలను పనిలో పెట్టుకునే వారిపై బాల కార్మిక (నిషేధం, నియంత్రణ) చట్టం, 1986 కింద ఇప్పటివరకు 159 కేసులు నమోదయ్యాయి. అంతేకాకుండా, తొమ్మిది విభాగాల సమన్వయంతో బాల కార్మిక నిర్మూలనకు రాష్ట్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నారు. కార్య ప్రణాళిక ప్రకారం, జిల్లా స్థాయిలో ఇతర విభాగాల సహాయంతో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. బాల, కౌమార కార్మిక (నిషేధం, నియంత్రణ) చట్టం 1986 కఠినమైన అమలు కోసం పోలీసు అధికారులు, జిల్లా కార్మిక అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఇతర వాటాదారులకు మద్దతుగా, రాష్ట్రంలో బాల కార్మికులను నిషేధించడానికి భారీ అవగాహన ప్రచారాలను కూడా నిర్వహిస్తుందని అధికారి తెలిపారు.



# 'ఆప్ సర్కార్'కు రైతుల నిరసనల సెగ

### పంజాబ్ పల్లెల్లో సిఎం దిష్టిబొమ్మలు దహనం

### మరో రెండురోజులు దహన కార్యక్రమాలు కొనసాగుతాయని కెఎంఎస్‌సి ప్రకటన

### ఆందోళనను ఇంకా ఉధృతం చేస్తామని రైతునేత సుఖ్‌వీందర్‌సింగ్ హెచ్చరిక



**ఛండీగఢ్ :** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వంపై పంజాబ్ రైతులు కన్నెర్ర జేశారు. పంజాబ్ రాష్ట్రంలోని పల్లెలు అన్నీ నిరసన జ్వాలలతో భగ్గుమంటున్నాయి. శంభుఖనౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద నుంచి పంజాబ్ రాష్ట్ర పోలీసులు రైతులను తరిమికొడుతూ రైతునేతల అరెస్ట్‌లతో దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణిచివేస్తున్న నేపథ్యంలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ధోరణిని వారు తీవ్రంగా ఆక్షేపించారు. కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ (కెఎంఎస్‌సి) విలేకరులతో మాట్లాడుతూ పంజాబ్ రైతులు శనివారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలలో పంజాబ్ ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేశారని ప్రకటించారు. రైతులు గ్రామాలలో దిష్టిబొమ్మలు దహనం చేస్తూ ఆప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదే సమయంలో పాటియాలా జైలులో ఉన్న శర్వణ్ సింగ్ పాంధర్ సహా పలువురు ముఖ్యరైతునేతలను కొంతమంది రైతునాయకులు కలుసుకుని పరామర్శించారు. వారు మాట్లాడుతూ దాదాపు 125మంది నిరసనకారులను పాటియాలా జైలులో ఉంచారని, 150మందిని నభా జైలులో, 40మంది నిరసనకారులను సంగ్రూర్ జైలులో ఉంచారని తెలియజేశారు. 'మహిళలు సహా రైతు నాయకులను మేం పాటియాలా జైలులో కలుసుకున్నాం. వారు మాతో మాట్లాడుతూ ఇంకా రెట్టించిన ఉత్సాహంతో పోరాటం కొనసాగిస్తాం'అని చెప్పారని రైతు నాయకుడు గుర్మీన్త్ సింగ్ మాంగత్ వివరించారు. బుధవారం రైతుల ఆందోళనను అణిచివేతలో భాగంగా ఛండీగఢ్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని తిరిగి వెళుతున్న పలువురు రైతుల నాయకులు జగ్‌జీత్‌సింగ్ డల్లేవాల్ సహా శర్వణ్ సింగ్ పాంధర్‌ను పంజాబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు అని చెప్పారు. కెఎంఎస్‌సి నాయకుడు సుఖ్‌వీందర్ సింగ్ మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం రైతు నాయకులను అదుపులోకి తీసుకుని శంభుఖనౌరీ సరిహద్దు నుంచి నిరసనకారులను తరిమికొట్టారని, అదుపులోకి తీసుకున్న రైతులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీసులు చేపట్టిన చర్యలలో పంజాబ్, హర్యానా రాష్ట్రాల మధ్య ఉన్న శంభుఖనౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద రైతులకు సంబంధించిన అనేక వస్తువులు పోయాయని ఆరోపించారు. కెఎంఎస్‌సి నాయకుడు సుఖ్‌వీందర్ సింగ్ మాట్లాడుతూ పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ దిష్టిబొమ్మలను పంజాబ్ రాష్ట్రంలోని గ్రామాలలో రైతులు దహనం చేశారని, మరో రెండు రోజులాపాటు ఈ దహన కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు.'రైతుల ఆందోళనను మరింత ఉధృతం చేస్తాం' అని ఆయన ప్రకటించారు. శంభుఖనౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద రైతుల ట్రాలీలతోపాటు ఎయిర్ కండీషనర్లు, రిఫ్రిజిరేటర్లు, ఇన్‌వర్టర్లు, ఎల్‌పిజి సిలిండర్లు, వాషింగ్ మెషీన్లు, ఫ్యాన్లు, ఇతర వస్తువులు పోయాయని, బహుశా దొంగిలించి ఉంటారని సింగ్ ఆరోపించారు. రైతులు పలు గ్రామాలలో తమ వస్తువుల కోసం వెతుకుతున్నారని ఆయన చెప్పారు. శంభుఖనౌరీ వద్ద రైతులు నిర్మించుకున్న తాత్కాలిక శిబిరాలు, నిర్మాణాలను కూల్చివేసి, రైతుల వస్తువులను దోచుకుపోవడంతో రైతులకు ఎంతో నష్టం జరిగిందని, పంజాబ్ ప్రభుత్వం బాధిత రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని మరో కెఎంఎస్‌సి నాయకుడు సత్నామ్ సింఘ్ పన్ను డిమాండ్ చేశారు. నిరసనతెలుపుతున్న రైతులు సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) సారథ్యంలో దేశ రాజధాని ఢిల్లీకి మార్చ్ నిర్వహిస్తుండగా భద్రతా బలగాలు అడ్డుకోవడంతో శంభు (శంభుఅంబాలా), ఖనౌరీ (సంగ్రూర్‌జింద్)సరిహద్దు పాయింట్ల వద్ద 2024, ఫిబ్రవరి 13నుంచి తాత్కాలిక శిబిరాలు ఏర్పాటు చేసుకుని, వేదికలు నిర్మించుకుని నిరసన దీక్షలు చేపడుతున్న విషయం తెలిసిందే.

## బడ్జెట్‌కు 10 వేల సూచనలు అందాయి: రేఖాగుప్తా



**న్యూఢిల్లీ:** అసెంబ్లీలో త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌కు సంబంధించి ప్రజల నుంచి సుమారు 10 వేల సూచనలు అందినట్టు ముఖ్యమంత్రి రేఖాగుప్తా తెలిపారు. 'వికసిత్ ఢిల్లీ బడ్జెట్' రూపకల్పన కోసం నిపుణులతో సహా వివిధ వర్గాలను తమ ప్రభుత్వం సంప్రదించిందని, ప్రజల నుంచి ఇమెయిల్ ద్వారా 3,300 సూచనలు, వాట్సాప్ ద్వారా 6,982 సూచనలు వచ్చాయని చెప్పారు. వికసిత్ ఢిల్లీ బడ్జెట్‌కు సమగ్ర రూపం ఇచ్చేందుకు ఈ సమాచారం కీలకం కానుందని తెలిపారు. 'ఇది కేవలం ప్రభుత్వ బడ్జెట్ కాదు. ఢిల్లీ ప్రజల బడ్జెట్. బడ్జెట్ సమావేశాలు మార్చి 24న 'ఖీర' ఫంక్షన్‌తో ప్రారంభమవుతాయని, 25న బడ్జెట్ సమర్పణ జరుగుతుందని, 28వ తేదీ వరకూ సమావేశాలు జరుగుతాయని సీఎం వివరించారు. 27 ఏళ్ల తర్వాత బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెడుతున్న తొలి బడెజ్ట్ ఇదని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభివృద్ధి విజన్‌కు బడ్జెట్ అద్దంపడుతుదని చెప్పారు.

# అల్లరిమూకల నుంచి ఆస్తినష్టం వసూలు చేస్తాం

### నాగ్‌పూర్ హింసపై మీడియా సమావేశంలో మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్



**నాగ్‌పూర్ :** ఇటీవలి నాగ్‌పూర్ హింస సమయంలో ఆస్తినష్టం ఖర్చును అల్లర్లకుపాల్పడ్డ వారి నుంచి ప్రభుత్వం తిరిగివసూలు చేస్తుందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ చెప్పారు. హింసకు పాల్పడిన వారు పరిహారం చెల్లించడంలో విఫలమైతే వారి ఆస్తులను స్వాధీనం చేసుకుని నష్టాలను తిరిగి పొందడానికి అమ్మేస్తామని ముఖ్యమంత్రి తెలియజేశారు. ఆయన శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ అల్లర్ల సమయంలో శాంతికి భంగం కలిగిస్తూ పోలీసులపై దాడిచేసిన వారిపై తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటామని సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ నొక్కిచెప్పారు. ఈ సంఘటన 'ఇంటెలిజెన్స్ వైఫల్యం' వల్ల కానేకాదని కొట్టిపారేశారు. కానీ గూఢచర్యం (గుమిగూడటం) మరింత మెరుగ్గా చేయగలగాలి అని తెలియజేశారు. వీడియో రికార్డింగ్స్, సిసిటివి ఫుటేజీని పరిశీలించి ఇప్పటివరకూ 104మంది వ్యక్తులను గుర్తించామని, చట్ట ప్రకారం 12మంది మైనర్లు సహా 92మంది నిందితులపై చర్యలు తీసుకున్నామన్నారు. మార్చి 17న నాగ్‌పూర్ నగరంలో హింస ప్రజ్వరిల్లింది. ఛత్రపతి శంభాజీనగర్‌లో ఔరంగజేబ్ సమాధిని తొలగించాలని డిమాండ్ చేస్తూ విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి)చేపట్టిన నిరసనల సమయంలో మతపరమైన శాసనాలు కలిగిన ఛాదర్‌ను తగుల బెడుతున్నారన్న పుకార్లు వ్యాపించిన తర్వాత ఈ హింస ప్రజ్వరిల్లింది. నగరంలోని పలు ప్రాంతాలలో అల్లరిమూకలు రెచ్చిపోయి రాళ్లదాడులు, ఆస్తుల లూటీలకు పాల్పడటంతో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ముగ్గురు డిసిపి ర్యాంక్ అధికారులు సహా 33మంది పోలీస్ సిబ్బంది ఈ ఘర్షణల సందర్భంగా గాయపడ్డారు. హింస ప్రభావితం కాకుండా ఉండేందుకు ప్రణాళిక ప్రకారం మార్చి 30న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన షెడ్యూల్ నాగ్‌పూర్‌లో ఏర్పాటైందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. అల్లర్లకు పాల్పడుతూ పోలీసులపై దాడి చేసిన వారిని ఉపేక్షించబోమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి బాధ్యతలను కూడా నిర్వర్తిస్తున్న ఫడ్నవీస్ చెప్పారు. ప్రస్తుతం నాగ్‌పూర్ నగరంలో ప్రశాంతత నెలకొన్నదని ముఖ్యమంత్రి చెప్పారు. వివిధ ప్రాంతాలలో విధించిన కర్ఫ్యూను సడలించే ప్రయత్నాలు సాగుతున్నాయని తెలియజేశారు. నగరంలోని కొన్ని ప్రాంతాలలో మాత్రమే అల్లర్లు చెలరేగాయని, నాగ్‌పూర్‌లోని 80శాతం ప్రాంతాలలో అల్లర్ల ప్రభావం కనిపించలేదని ముఖ్యమంత్రి వివరించారు. బాధితులకు నష్టపరిహారం త్వరలోనే అందజేస్తామని, అల్లర్లను రెచ్చగొట్టేల పోస్టింగ్‌లు పెట్టిన 68సోషల్ మీడియా పోస్ట్‌లను గుర్తించి వాటిని తొలగించివేశామని ఫడ్నవీస్ తెలియజేశారు. విదేశీయులు లేదా బంగ్లాదేశీయులకు ఏమైనా ఈ అల్లర్లతో సంబంధాలు ఉన్నాయా అని ప్రశ్నించిన విలేకరులతో ఆ కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. నాగ్‌పూర్‌లో హింస తర్వాత ఆయన తొలిసారిగా శుక్రవారం నాడు హింస ప్రజ్వరిల్లిన ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం పోలీస్ కమిషనరేట్‌లో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అధ్యక్షతన సీనియర్ పోలీస్ అధికారులు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులతో సమావేశం జరిగింది. హింస తలెత్తడానికి గల కారణాలు, పోలీసుల పాత్ర, ఇప్పటి వరకు పోలీసులు తీసుకున్న చర్యల గురించి ఆయన పోలీస్ ఉన్నతాధికారులతో చర్చించారు.

# ప్రపంచ తయారీ హబ్‌గా భారత్ ఇంకెప్పుడు?



### మోదీ సర్కార్ 'మేక్ ఇన్ ఇండియా' స్కీమ్ వాగ్దానంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే

**న్యూఢిల్లీ :** బిజెపి సారథ్యంలోని మోదీ సర్కార్‌ను కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే లక్ష్యంగా చేసుకున్నారు. 'మేక్ ఇన్ ఇండియా' స్కీమ్‌పై ఆయన శనివారం విమర్శల బాణాలను సంధించారు. భారతదేశాన్ని ఒక ప్రపంచ తయారీ హబ్‌గా మారుస్తామన్న బిజెపి వాగ్దానం ఇంకా నెరవేరలేదని ఆయన ధ్వజమెత్తారు. డెలివరీ కంటే పబ్లిసిటీకే అతిముఖ్యమైన ప్రాముఖ్యతను ఇస్తున్న ఒక అతిముఖ్యమైన కేసుగా మేక్ ఇన్ ఇండియా పథకం మిగిలిపోయిందని మల్లికార్జున్ ఖర్గే ఎద్దేవా చేశారు. 2014లో ఎన్నికల మేనిఫెస్టోలో బిజెపి చేసిన 10 వాగ్దానాలలో ప్రపంచ తయారీ హబ్‌గా భారత్‌ను తయారుచేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేస్తూ ఆ పార్టీ వాగ్దానాలలో ఏ ఒక్కటీ నెరవేరలేదు అని ఖర్గే తన 'ఎక్స్' పోస్ట్‌లో పెట్టారు. స్థూల జాతీయోత్పత్తిలో తయారీ వాటా, తయారీలో ఉపాధి భారీ క్షీణతతో పరిస్థితి అత్యంత దారుణంగా మారిందని కాంగ్రెస్ పార్టీ చీఫ్ ఆరోపించారు. పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్ (పిఎస్‌యు)లు అమ్ముడు అవుతున్నాయి. మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఇ)లు సంక్షోభానికి గురవుతున్నాయి. అధికారిక అడ్డంకులు దినచర్యగా మారాయి. భారతీయ పారిశ్రామికవేత్తలు భారత్‌కు ప్రాధాన్యత ఇవ్వడానికి బదులు విదేశాలకు తరలివెళ్లి అక్కడ తమ కంపెనీలను నెలకొల్పుతున్నాయి. ఎగుమతులు పడిపోయాయి.ఎగుమతుల స్వేచ్ఛ పతనం దిశగా సాగుతోంది అని ఆయన ఆరోపించారు.రెండు ప్రశ్నలను ఆయన పోస్ట్ ద్వారా సంధించారు. మోదీ ప్రభుత్వ హయాంలో కనీసం 50ఏళ్లుగాభారతదేశం మొత్తం ఎగుమతులలో సరుకుల వాటాను గుర్తించిన 14గుర్తించబడిన రంగాలను 12విఫలమైన తర్వాత ఎంతో ప్రచారం చేయబడిని రూ.1.97లక్షల కోట్ల ప్రొడక్షన్ లింక్‌డ్ ఇంటెన్సివ్ (పిఎల్ఐ) స్కీమ్‌ను మోడీ ప్రభుత్వం ముగించిందా అని మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వ హయాంలో భారతదేశం మొత్తం ఎగుమతులలో వస్తువుల వాటా కనీసం 50 సంవత్సరాలలో ఎందుకు కనిష్టస్థాయికి పడిపోయింది అని ఖర్గే ప్రశ్నించారు. వాస్తవంగా 'ఆత్మనిర్భర్ భారత్' కాంగ్రెస్ కిందనే ఉందని మోదీజీ తెలుసుకుని ఉంటారని కాంగ్రెస్ చీఫ్ అన్నారు. తయారీ ప్రోత్సాహాలకు 8శాతం కంటే తక్కువగా నిధులను కేటాయించినందువల్ల అక్టోబర్ 2024నాటికి కేవలం 37శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని మాత్రమే చేరుకోగలిగారని ఖర్గే ఉదహరించారు.

**బిహార్ ఆవిర్భావ దినం శుభాకాంక్షలు : ఖర్గే**

బిహార్ దివస్ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే బిహార్ ప్రజలకు శుభాకాంక్షలు అందజేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో బిహార్ రాష్ట్రం కీలకం పాత్రను పోషించాల్సిన సమయం ఆసన్నమైందని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఆయన తన 'ఎక్స్' పోస్ట్‌లో ప్రజాస్వామ్యానికి బిహార్ పుట్టినిల్లు అని, అంతేకాకుండా బిహార్ జ్ఞానభూమి కూడా అని కీర్తించారు. బ్రిటీష్ పరిపాలనకు వ్యతిరేకంగా భారతీయుల గళాన్ని గాంధీజీ బలోపేతం చేసింది బిహార్ రాష్ట్రం నుంచే అన్నారు. బిహార్ ఆవిర్భావ దినం సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేస్తున్నట్లు ఖర్గే తన పోస్ట్‌లో వెల్లడించారు. బిహార్‌లో సామాజిక న్యాయం, సమానత్వం, అందరినీ కలుపుకుపోయే అధ్యాయం త్వరలోనే ప్రారంభం కానున్నదని కాంగ్రెస్ పార్టీ చీఫ్ జోస్యం చెప్పారు. బిహార్ రాష్ట్ర ఆవిర్భావ దినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కూడా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. బిహార్‌లో సుసంపన్నమైన సంస్కృతి, నాగరికత, జ్ఞానం దశాబ్దాలుగా భారత దేశ ప్రతిష్టను సుసంపన్నం చేస్తున్నదని రాహుల్‌గాంధీ తన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

# 5.30 లక్షలమంది అమెరికా వదిలిపోవాలి




### క్యూబా సహా నాలుగుదేశాల ప్రజలకు ట్రంప్ ఆదేశం

**వాషింగ్టన్ :** క్యూబా సహా నాలుగుదేశాలకు చెందిన 5.30 లక్షలకుపైగా వలస ప్రజలకు ఉన్న తాత్కాలిక చట్టబద్ధమైన మనుగడ హోదాను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రద్దు చేశాయనున్నారు. క్యూబా, వెనిజులా, హైతీ, నికరాగువా దేశాలకు చెందిన వలస ప్రజలు ఏప్రిల్ 24వ తేదీలోపు అమెరికా వదలివెళ్ళిపోవాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో దేశంలో తీవ్ర గందరగోళం చెలరేగింది. విదేశాల నుండి వచ్చిన వలస ప్రజలను నేరస్థులుగా, అమెరికన్ వ్యతిరేకులుగా మొదటినుండీ ట్రంప్ పరిగణిస్తున్నారు. అమెరికాకు వలసవచ్చి బ్రతుకుతున్న ఈ ఐదు లక్షలమంది ప్రజలకు మనుగడలేకుండా చేసే ఉత్తర్వులు జారీ చేసుందుకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధపడింది. ఈ నాలుగు దేశాల ప్రజల పర్మిట్లు, డెపోర్టేషన్ అనుమతులు రద్దయ్యేలోపు దేశం వదిలి వెళ్ళిపోవాల్సి ఉంటుంది. సిహెచ్‌ఎన్‌వి పేరుతో స్పాన్సర్డ్ ప్రాసెస్‌లో ఈ ప్రజలు జో బైడెన్ ప్రభుత్వ హయాంలో అమెరికాకు వచ్చి బతుకుతున్నారు. ఐతే వీరిలో ఎంతమందికి ఇకముందు కూడా చట్టబద్ధంగా అమెరికాలో జీవించడానికి అనుమతి లభిస్తుందన్న విషయం కూడా ఇప్పుడు పెద్ద సస్పెన్స్‌గా మారింది. ఈ సిహెచ్‌ఎన్‌వి కార్యక్రమాన్ని 2022లో బైడెన్ ప్రారంభించారు. మొదట వెనిజులాకు దీనిని వర్తింపజేశారు. తర్వాత మూడుదేశాలకు వర్తింపజేశారు. దీనిప్రకారం ఆ వలసప్రజల భార్య, పిల్లలు వెంటనే అమెరికాకు తరలిరావచ్చు. ఐతే తాత్కాలికంగా రెండు సంవత్సరాలు మాత్రమే అక్కడ ఉండాలి. ప్రస్తుతం హౌతీ ఉగ్రవాదులపై అమెరికా దాడులు చేస్తున్న నేపథ్యంలో అక్కడి నుండి వచ్చిన 2.13 లక్షల మందిని తిప్పిపంపుతున్నారు. వెనిజులా నుండి 1.20 లక్షల మందిపైగా మూడేళ్ళక్రితం వచ్చారు. 1.11 లక్షలమంది క్యూబా ప్రజలు కూడా ఈ ఉత్తర్వుల ప్రకారం వచ్చారు. 93,000 మంది నికరాగువా ప్రజలు వలస వచ్చారు. ఇప్పుడు వీళ్ళందరినీ తిరిగి వెళ్ళిపోవాలని ట్రంప్ హెచ్చరించారు. ఇంతకుముందే అమెరికా ఫెడరల్‌కోర్టు న్యాయమూర్తి బోయాస్‌బర్గ్ ఈ విషయంపై వాషింగ్టన్ డీసీలో జరిగిన విచారణ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాదిని నిలదీసి అతడిని మందలించారు. వెనిజులా నుండి వచ్చిన వలస ప్రజలను ఆ దేశానికి తిప్పి పంపడంకోసం ట్రంప్ అరుదైన పురాతనకాలంనాటి చట్టనిబంధనల దుమ్ముదులిపి వాటిని ఎందుకు ఉపయోగించారని న్యాయమూర్తి సదరు న్యాయవాదిని ప్రశ్నించి మందలించారు కూడా. 1798 నాటి శత్రువులపై ఉపయోగించే చట్టాన్ని వెనిజులా నుండి వచ్చిన గ్యాంగ్స్‌ను తిప్పిపంపడంకోసం ట్రంప్ ఉపయోగించారు. ఈ మేరకు 238 మందిని ఎల్‌సాల్వడార్‌లోని మెగా జైలుకు ఆయన తరలించారు. దీనిని కోర్టు తప్పుపట్టింది.


### పని చేయాలన్న సంకల్పం ఉంటే...

# సమయం పరిమితమవ్వదు

### రాజ్యసభ ఎంపి సుధామూర్తి



**న్యూఢిల్లీ :** ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నారాయణ మూర్తి ఇటీవల పని గంటలపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. తాజా గా దీనిపై ఆయన భార్య, రాజ్యసభ ఎంపి సుధామూర్తి స్పందించారు. ఏదై నా పనిని ఇష్టంతో, ఉత్సాహంగా చేయాలనుకుంటే సమయం ఎప్పుడూ పరిమితంగా మారదని ఆమె వ్యాఖ్యానించారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. 'ప్రజలు ఏదైనా పనిని ఇష్టంతో, ఉత్సాహంగా చేయాలనుకుంటే దానికి సమయం ఎప్పుడు పరిమితిగా మారదు. నా భర్త డబ్బులు లేని సమయంలో కూడా ఇన్ఫోసిస్‌ను నిర్మించాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు అంకితభా వం కలిగిన వ్యక్తులతో కలిసి 70 గంటలు అంత కంటే ఎక్కువ సమయం పని చేయడం వల్లే అది సాధ్యమైంది. నా భర్త మాత్రమే కాదు.. జర్నలిస్టులు, డాక్టర్లు వంటి ఇతర రంగాల్లోని వారు కూడా 90 గంటలు పని చేస్తున్నారు. భగవంతుడు అందరికీ రోజుకి 24 గంటల సమయమే ఇచ్చాడు. దానిని మీరు ఎలా వినియోగించుకుంటారు అనేది మీ ఇష్టం' అని సుధామూర్తి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆమె వ్యక్తిగత జీవితం గురించి కూడా మాట్లాడారు. నారాయణమూర్తి ఇన్ఫోసిస్‌ను చూసుకున్నప్పుడు తాను ఇంటి బాధ్యతలు తీసుకున్నానని ఆమె గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో తాను ఇంటిని చూసుకోవడం, పిల్లలను పెంచడంతో పాటు కళాశాలలో కంప్యూటర్ సైన్స్ బోధించినట్లు తెలిపారు. ప్రస్తు తం తాను తన భర్త కంటే ఓవర్‌టైమ్ పని చేస్తున్నానని, దానికి ఆయన వెనక నుం చి సపోర్ట్‌గా ఉండి ముందుకు నడిపిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వృత్తి జీవితంలో భార్యాభర్తలు ఒకరికొకరు సాయం చేసుకోవాలని అదే జీవితమని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలతో పోటీపడాలంటే భారత్‌లోని యువత వారానికి 70 గంటల పాటు పని చేయాలని నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. కొందరు దీన్ని సమర్థించగా.. మరికొందరు వ్యతిరేకించారు. వారానికి 90 గంటల పాటు పనిచేయాలంటూ ఎల్‌అండ్ టి చైర్మన్ ఎస్‌ఎన్. సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలూ నెట్టింట చర్చకు దారితీశాయి.



# ప్రముఖ రచయిత వినోద్ కుమార్ శుక్లాకు 'జ్ఞాన్‌పీఠ్' అవార్డు

**న్యూఢిల్లీ :** హిందీ భాషలో ఎన్నో రచనలు చేసిన ప్రముఖ రచయిత వినోద్ కుమార్ శుక్లాకు దేశంలోనే అత్యున్నత సాహిత్య గౌరవమైన జ్ఞాన్‌పీఠ్ అవార్డు దక్కింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన 88 ఏళ్ల వినోద్ కుమార్ శుక్లా ఎన్నో రచనలు చేశారు. హిందీలో షార్ట్ స్టోరీస్, కవితలు, వ్యాసాలు రాశారు. దేశంలోని ప్రముఖ హిందీ రచయితల్లో ఒకరైన ఆయన సాహిత్య రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఈ ఉన్నత పురస్కారం దక్కింది. వినోద్ కుమార్ శుక్లాను జ్ఞాన్‌పీఠ్ అవార్డుకు ఎంపిక చేస్తున్నట్లు శనివారం సాయంత్రం ప్రకటించారు. శుక్లా అందుకోబోతున్నది 59వ జ్ఞాన్‌పీఠ్ పురస్కారం. ఇప్పటికే ఈ అవార్డును 58 మంది అందుకున్నారు. అయితే జ్ఞాన్‌పీఠ్ పురస్కారం అందుకున్న ఛత్తీస్‌గఢ్ తొలి రచయితగా వినోద్ కుమార్ శుక్లా గుర్తింపు పొందారు. అదేవిధంగా హిందీ భాషలో ఈ అవార్డు అందుకున్న 12వ రచయితగా నిలిచారు. ప్రఖ్యాత స్టోరీ టెల్లర్, జ్ఞాన్‌పీఠ్ అవార్డు గ్రహీత ప్రతిభా రే నేతృత్వంలోని జ్ఞాన్‌పీఠ్ సెలెక్షన్ కమిటీ సమావేశంలో వినోద్ కుమార్ శుక్లాను అవార్డుకు ఎంపిక చేశారు. జ్ఞాన్‌పీఠ్ పురస్కారంతోపాటు రూ.11 లక్షల నగదును, సరస్వతీదేవి కాంస్య విగ్రహాన్ని అందజేస్తారు. వినోద్ కుమార్ శుక్లా 1999లో సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు.

**CHANGE OF NAME**

**I, VANITHA** (Old Name), W/o. RANGA SATISH GOUD, H.No. 2-80, near Post Office, Lingojiguda, Saroornagar, Rangareddy Dist., Telangana. here by declare that I have changed my name **CHANDRAKALA.P** (New Name) for all purpose.

# ఇతరులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించొద్దు

## పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్, ఎస్పి తనిఖీ



**ప్రజా పక్షం/ హాలియా:** పదో తరగతి పరీక్షా కేంద్రాలను శనివారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పి శరత్ చంద్ర పవార్ హాలియా మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఈ కేంద్రంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు,పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలు అన్నింటిని ఎంఈఓ కృష్ణమూర్తి, చీఫ్ సూపరింటిండెంట్ ల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ స్థానిక పోలీసులతో మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద భద్రతను పకడ్బందీగా నిర్వహించాలని, ఎట్టి పరిస్థితులలో ఇతరులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించవద్దని సూచించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, మిర్యాలగూడ డిఎస్పి రాజశేఖర్ రాజు, హాలియా సిఐ జనార్ధన్ గౌడ్, ఎస్ఐ సతీష్ రెడ్డి ఉన్నారు.

# కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చర్యలు

## పది పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/యాదాద్రి :** పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అయిన నేపథ్యంలో శనివారం భువనగిరి పట్టణంలోని యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సందర్శించి, పరీక్ష నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎలక్ట్రిసిటీ, త్రాగునీరు తదితర మౌలిక వసతులను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ పైన చీఫ్ సూపరింటెండెంట్‌కి పలు సూచనలు చేశారు. ఎక్కడ కూడా కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా, పక్కాగా పరీక్షలు జరిపించాలన్నారు.

# పది పరీక్షలకు 25మంది విద్యార్థులు గైర్హాజర్




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** పదవ తరగతి హిందీ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా శనివారం 25 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలిపారు. హిందీ పరీక్షకు 11901 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 11876 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు మొత్తం 67 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 33 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగుతున్నాయని చెప్పారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 60ఫీట్ల రోడ్డులోని కాకతీయ హైస్కూల్‌లోని పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును ఆయన, హాజరు శాతంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ శ్రీహరిలు ఉన్నారు.

# రైతు సమస్యల పరిష్కారమే ఎజెండాగా రైతు సంఘం మహాసభ

## రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతుల సమస్యల పరిష్కారమే ఎజెండాగా రైతు సంఘం మహాసభ జరుగుతుందని రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 23న దేవరకొండ నియోజకవర్గం చింతపల్లి జీపీరెడ్డి గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం 15వ మహాసభ జరుగుతుందని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన ఘన చరిత్ర ఆల్ ఇండియా కిసాన్ ఏఐకేఎస్ ఉందన్నారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ, రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం తాకట్టు పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ, రూపొందిస్తామన్నారు. మహాసభకు ముఖ్య అతిధులుగా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యా పద్మ, ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, మాజీ శాసనసభ్యులు, రైతు సంం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉజ్జని యాదగిరిరావు తదితరులు హాజరవుతారని అన్నారు.

# స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్:** కిసాన్ నగర్, అర్బన్ కాలనీ రైల్వే అండర్ పాస్ వద్ద స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలనీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో భువనగిరి పురపాలక సంఘం కమిషనర్ జి.రామలింగం అధికారికి మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి పట్టణంలోని కిసాన్ నగర్ రైల్వే అండర్ పాస్ నుండి అర్బన్ కాలనీ, హుస్సేనాబాద్ బస్వాపురం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి ఉన్నది. రైల్వే అండర్‌పాస్ దగ్గర నాలుగు దిక్కులు వెళ్లే రహదారి కలదు స్పీడు బ్రేకర్లు లేకపోవడం వలన తరచూ ప్రమాదాలు జరుగుచున్నవి అని తెలిపారు. ఇదే దారిలో సివిల్ సప్లై, వ్యవసాయ మార్కెట్ యార్డు ఉన్నందున పెద్ద వాహనాలు కూడా వెలుచున్నవి అతివేగం కారణంగా చాలా ప్రమాదాలు జరిగాయాని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు వస్థుపుల అభిలాష్, సిపిఐ నాయకులు దాసరి లక్ష్మయ్య, చింతల పెంటయ్య, గుండెబోయిన స్వామి, బద్దం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాటేపల్లి బ్రిడ్జి వద్ద రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

## సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ

**ప్రజాపక్షం/మోటకొండూరు :** కాటేపల్లి బ్రిడ్జి వద్ద ఆగిపోయిన రోడ్డు బిటి నిర్మాణం వెంటనే పూర్తిచేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన శనివారం మోటకొండూరు మండలంలోని కాటేపల్లి బ్రిడ్జి వద్ద రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని సిపిఐ మోటకొండూరు మండల సమితి ఆధ్వర్యంలో రోడ్డు పై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయగిరి మోత్కూరు ప్రదాన రోడ్డు గత ఐదు సంవత్సరాలుగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. రాయగిరి నుండి కాటేపల్లి వరకు ఫార్మేషన్‌తో పాటు బీటీ పోసి అక్కడి నుండి ముత్తిరెడ్డిగూడెం వరకు కలపకుండా రోడ్డును ఆపి గత రెండు సంవత్సరాలుగా ఈ రోడ్డుపై వెళ్తున్న ప్రజలు ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, కంకర రోడ్డు ఉండడం ద్వారా ఇసుక డస్ట్‌తో బస్సు వాహనము అతివేగంగా వెళ్ళినప్పుడు వెనుక వచ్చే ట్రక్కుల గాని మోటార్ బైక్‌లు గాని గాలి స్పీడ్‌గా వెళ్ళినప్పుడు బాగా దుమ్ము విపరీతంగా లేచి ప్రయాణికులకు ఎక్కడ వైపు వెళ్లాలని తెలియక రోడ్డుపై నుండి కింద పడిపోతున్నారన్నారు.ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులను పూర్తిస్థాయి బీటీ రోడ్డును నిర్మించాలని లేని పక్షంలో భారతకమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి గాధగాని మాణిక్యం, ఆలేటి బాలరాజు, పశువుల నరసింహ, మంచాల రాధమ్మ, బోలగాని అశోకు, పైల రామిరెడ్డి, నల్ల రాములు, సుదర్శన్, మంచాల పద్మ, మచ్చ సూర్యనారాయణ, బొంగు బిక్షం, శనిగరం భాగ్యమ్మ, పిట్టల కరుణాకర్, బీరకాయల మధు, వాకిటి రవీందర్ రెడ్డి, నరసింహ, పల్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.




# ప్రపంచ సుందరీమణులకు బుద్ధవనంలో ఏర్పాట్లు

## పర్యాటకశాఖ ఎండి ప్రకాష్ రెడ్డి



**ప్రజాపక్షం/నందికొండ:** మే 7 నుండి 31 వరకు హైదరాబాదులో ప్రపంచ సుందరి పోటీలు జరగనున్నాయని, మే 12న బుద్ధపూర్ణిమ సందర్భంగా నాగార్జునసాగర్ వద్ద ఉన్న బుద్ధవనం లో నిర్వహించే కార్యక్రమాలతో పాటు ధ్యానం లో పాల్గొనేందుకు ప్రపంచ సుందరి పోటీలలో పాల్గొన్న వారు రానున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి తెలిపారు.బుద్ధవనంలో అవసరమైన ఏర్పాట్ల నిమిత్తం శనివారం ఆయన నాగార్జునసాగర్ సమీపంలోని బుద్ధవనం లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,ఎస్పి శరత్ చంద్ర పవార్‌లతో కలిసి సమీక్ష నిర్వహించారు.సుమారు140 దేశాల నుంచి 140 మంది ప్రపంచ సుందరి మణులు పోటీలలో పాల్గొంటున్నారని, ఆసియా ఖండం నుంచి సుమారు 30 మంది పాల్గొంటున్నట్లు ఆయన వెల్లడించారు. మే 12 నవివిధ దేశాల నుండి వచ్చిన వారందరికీ బుద్ధవనాన్ని ఒక పర్యాటక ప్రాంతంగా,ధ్యాన కేంద్రంగా చూపించడంతోపాటు, ప్రపంచవ్యాప్తంగా బుద్ధవనం పేరు, ప్రతిష్టలు చాటి చెప్పే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ బుద్ధ వనం సందర్శించే ప్రపంచ సుందరి పోటీదారులందరికి పూర్తిస్థాయిలో భద్రత కల్పిస్తామని, ఆరోజు బుద్ధ వనం వచ్చే వారికి పాసులను జారీ చేయడంతో పాటు, పోలీస్ సెక్యూరిటీని, అంబులెన్స్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.అనంతరం బుద్ధ చరిత వనం, బోటింగ్ పాయింట్, నాగార్జునసాగర్ డ్యాంలను సందర్శించారు.మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, దేవరకొండ ఏఎస్పి మౌనిక, బుద్ధ వనం ఓఎస్డి సుబాన్ రెడ్డి,పురావస్తు శాఖ కన్సల్టెంట్ శివ నాగిరెడ్డి , పర్యాటకశాఖ జనరల్ మేనేజర్లు సూర్యప్రకాష్,ఇబ్రహీం,పర్యాటక శాఖ ఇంజనీరింగ్ అధికారులు, అటవీశాఖ అధికారి సంగీత ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో నిలిచేందుకు సిపిఐ సిద్ధం

## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి




**ప్రజాపక్షం/దేవరకొండ:** రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ బరిలో నిలిచేందుకు సిద్ధంకావాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.దేవరకొండ మండలం పడమటిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి శుభమస్తు గార్డెన్ లో జరిగిన సిపిఐ పడమటిపల్లి గ్రామ శాఖ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ స్థానిక సంస్థలైన ఎంపిటిసి, జడ్పిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో అధిక స్థానలలో పోటీచేసి ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుండాలన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే ఎర్రజెండా గ్రామ గ్రామానికి విస్తరించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడేది సిపిఐ పార్టీ మాత్రమేనని ఆ పార్టీ అవసరాన్ని ప్రజలు గుర్తించి కమ్యూనిస్టు పార్టీలో చేరాలని కోరారు.పార్టీ శ్రేణులు అన్ని గ్రామాలు తిరిగి కొత్త శాఖలు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గానికి సాగునీరు అందించే డిండి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రైతు బంధు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు సంక్షేమ పథకాలు ఇచ్చే ప్రక్రియ వెంటనే చేపట్టి అర్హులైన వారికి ఇవ్వాలన్నారు.ఈ మహాసభ మాజీ సర్పంచ్ కిన్నెర యాదయ్య అధ్యక్షతన జరిగింది.మహాసభ అనంతరం సిపిఐ గ్రామ శాఖ నూతన సమితిని,మహిళా సమాఖ్య,రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఏఐటీయూసీ,ఏఐవైఎఫ్ ప్రజా సంఘాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈమహాసభలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్ రెడ్డి,జిల్లా కౌన్సిల్ సభ్యులు వలమల్ల ఆంజనేయులు,గ్రామ శాఖ కార్యదర్శి పల్లా రంగా రెడ్డి,మండల కార్యవర్గ సభ్యులు గంగిడి రాంరెడ్డి, గ్రామ శాఖ సహాయ కార్యదర్శులు కాటం గోవర్ధన్, కడారి నర్సింహా, మహిళా సమాఖ్య మండల నాయకురాలు పల్లె లాలమ్మా, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కిన్నెర భారీములు, ఏఐవైఎఫ్ నాయకులు ఉడుత జంగయ్య పార్టీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రైతు సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలి : ఉజ్జిని

**ప్రజాపక్షం/చింతపల్లి :** నేడు మండల కేంద్రంలోని సాయిసుమంగళి గార్డెన్‌లో నిర్వహించే తెలంగాణ రైతు సంఘం నల్లగొండ 15వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని మానుగోడు మాజీ ఎంఎల్‌ఏ, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉజ్జిని యాదగిరిరావు కోరారు. శనివారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం పదకొండు గంటలకు మహాసభను తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ ప్రారంభిస్తారన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డితో పాటు రైతు ఈ మహాసభలలో పాల్గొంటారని తెలిపారు. సుదీర్ఘ కాలంగా కరువు, ఫ్లోరిన్ పీడిత ప్రాంతంగా ఉన్నా నల్లగొండ జిల్లాకు సరిపడ నిధులు కేటాయించి యుద్ధప్రాతిపాదికన ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రైతులందరికీ రూణమాఫీ చేయాలని, తదితర రైతాంగ సమస్యలు సాధించుటకు ఈ జిల్లా మహాసభలను వేదిక చేసుకొని భవిష్యత్ ప్రణాళికను రూపొందిచటం జరుగుతుందన్నారు. నేడు జరిగే ఈ మహాసభకు ప్రతినిధులు సకాలంలో హాజరయి సభను విజయవంతం చేయాలని యాదగిరిరావు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావు, పల్లపు లక్ష్మయ్య, వేముల బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# రేపు జనరల్ బాడీ సమావేశం

## సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రేపు సూర్యాపేటలో జరిగే జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం హుజూర్‌నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 24వ తేదీన జరిగే జనరల్ బాడీ సమావేశానికి ముఖ్యఅతిథులుగా పల్లా వెంకటరెడ్డి,బొమ్మగాని ప్రభాకర్,ఎమ్ఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్‌లు పాల్గొంటారని తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలపరుచుకొని ప్రజాపోరాటాలు,ఉద్యమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి,సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్,మండల వెంకటేశ్వర్లు,మామిడి నర్సయ్య,మీసాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# చిట్యాలలో గంజాయి విక్రేతల పట్టివేత



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల శివారులోని డాబాల దగ్గర లారీ డ్రైవర్లకు, కాలేజీ, స్కూల్ విద్యార్థులకు నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న ఇరువురు స్థానిక పోలీసులు శనివారం పట్టుకున్నారు. వారి దగ్గర నుండి రూ. 37,500 విలువ చేసే 1కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం రోజున నల్లగొండ డిఎస్‌పి కె శివరాంరెడ్డి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలు తెలియజేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫతేపూర్ జిల్లా రోషన్‌పూర్, శివపురి గ్రామాలకు చెందిన కమలేశ్ పాల్, నిర్భయ్ సింగ్‌లు యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో నివాసం ఉంటూ చిట్యాల పట్టణంలో సైకిళ్లపై ఐస్‌క్రీంలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. జల్సాలకు అలవాటు పడిన వీరిరువురు ఐస్‌క్రీంల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయం సరిపోక అక్రమ సంపాదించడం కోసం గంజాయి అమ్మకానికి పూనుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కే చెందిన పంకజ్ అనే వ్యక్తి దగ్గర కిలోన్నర గంజాయిని కొనుగోలు చేసి డాబాల దగ్గర లారీ డ్రైవర్లకు, గంజాయి అలవాటు ఉన్న విద్యార్థులు, వ్యక్తులకు చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి అమ్మకం సాగిస్తున్నారు. పోలీసులకు నమ్మదగిన సమాచారం చేరడంతో వారిని శనివారం రోజు రామన్నపేట రోడ్డులో గల పంజాబీ దాభా దగ్గర వారిని అరెస్ట్ చేయడం జరిగింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న శివరాంరెడ్డి తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిఐ కె నాగరాజు, ఎస్ఐ ఎన్ ధర్మ, సిబ్బంది పాష, మధు, మల్లేష్, ఖలీమ్, నాగరాజు, గణేష్‌లను శివరాంరెడ్డి అభినందించారు.

# గేదెలను అపహరించిన నిందితుల రిమాండ్



**ప్రజాపక్షం/దేవరకొండ:** మండలంలోని మంగలోని భావిలో ఈనెల 1వ,తేదిన అర్ధరాత్రి గేదెలు అపహరించిన దొంగలను రెండు పోలీస్ బృందలను ఏర్పాటు చేసి పట్టుకున్నట్లు దేవరకొండ ఏఎస్పీ పి.మౌనిక తెలిపారు.శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేషంలో ఆమె మాట్లాడుతూ నిందితులు సూర్యాపేట జిల్లాకు చెందిన మహ్మద్ సాహెబ్,శ్రీనివాస్, షేక్ రఫీ, అస్లాం,అఖిల్, సైదులు ఈజీ మనీకోసం అలవాటు పడి రాత్రి వేలల్లో గేదెలను తస్కరిస్తున్నట్లు ఆమె తెలిపారు.మంగలోని బావి కి చెందిన ఉడుత శ్రీను, ఉడుత సైదులు లకు సంభందించిన గేదెలను ఈనెల 1న అపహరించగా పిర్యాదు చేసారని కీలక నిందితుడు మహ్మద్ సాహెబ్ కీలక సూత్రదారని గేదలను అపహరించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమ్మేవారని నిందితులను సీసీ కెమెరాల రికార్డుల ఆధారంగా మల్లీ దేవరకొండ కు వచ్చిన సమయంలో పట్టుకొని నిందితుల నుండి అశోక్ లీలాండ్ ట్రాలీ,బేలనో కార్, 3.2 లక్షల రూపాయలు రికవరీ చేసినట్లు ఆమె తెలిపారు.త్రిపురారం, గుండాల మండలాల్లో సైతం దొంగతనాలకు పాల్పడినట్లు సమాచారం.ఐదుగురిని రిమాండ్ తరలించగా నిందితుల్లో సైదులు పరారిలో ఉన్నాడని తెలిపారు.ఎవరైనా ఎంతటి వారైనా నేరం చేస్తే శిక్షార్హులని చట్టం ముందు ఎవరు తప్పించుకోలేరని ఏఎస్పీ మౌనిక అన్నారు.

# ‘బర్డ్‌ఫ్లూ’ను నిర్ధారించిన అధికారులు

## జోరుగా సాగుతున్న పూడ్చివేత కార్యక్రమాలు

## ఆందోళన అవసరంలేదన్న పశు సంవర్ధక శాఖ



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలోని ఒక పరిశ్రమలో కోళ్ళకు బర్డ్‌ఫ్లూ సోకిందన్న ‘ప్రజాపక్షం’ శనివారం వెలువరించిన వార్త నిజ రూపం దాల్చింది. పరిశ్రమలోని కోళ్ళకు బర్డ్‌ఫ్లూ సోకినట్లు అధికారులు అధికారికంగా శనివారం వెల్లడించారు. గుండ్రాంపల్లి, ఏపూర్ గ్రామాల మధ్య 2 లక్షల కోళ్ళ సామర్థ్యం గల కోడిగడ్లను ఉత్పత్తి చేసే కోళ్ళ పరిశ్రమను వివిఎస్‌కె ఫౌల్ట్రీ ఫాం పేరుతో కొన్ని సంవత్సరాల క్రితం స్థాపించడం జరిగింది. ఈ కోళ్ళ ఫాంలో ఇటీవల వందల సంఖ్యలో కోళ్ళు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో పరిశ్రమ యజమాని వంగేటి బాలకృష్ణా రెడ్డి మండలం పశువైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్ళడం జరిగింది. అధికారులు పరిశ్రమలోని 5 కోళ్ళను సేకరించి హైదరాబాద్, మధ్యప్రదేశ్‌లోని బోపాల్‌లో గల బర్డ్‌ఫ్లూ వ్యాధి నిర్ధారణ కేంద్రాలకు తరలించడం జరిగింది. కోళ్ళకు వ్యాధి ఉన్నట్లుగా పాజిటివ్ రిజల్ట్స్ రావడంతో అధికారులు ఉన్నత అధికారులకు సమాచారం అందించి పరిశ్రమలోని సుమారు 2 లక్షల కోళ్ళను సమూలంగా ధ్వంసం చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. శుక్రవారం, శనివారం 52 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు పరిశ్రమలోని అన్ని కోళ్ళను, కోడిగడ్లను భూమిలో గోతులు తీసి పూడ్చివేసే కార్యక్రమాన్ని చేపట్టారు. అన్ని కోళ్లను పూడ్చివేసేందుకు మరో మూడు రోజుల సమయం పట్టవచ్చని అధికారులు తెలిపారు.

**ఆందోళన అవసరం లేదు: జెడి రమేష్**

వివిఎస్‌కె ఫౌల్ట్రీ ఫాంలో బర్డ్‌ఫ్లూ సోకిన విషయంపై ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా పశుసంవర్ధక శాక జాయింట డైరక్టర్ జివి రమేష్ అన్నారు. ఈ పరిశ్రమకు 1 కిలో మీటరు పరిధి వరకు రెడ్ జోన్‌గా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ పరిధిలోని అన్ని రకాల బ్రాయిల్, లేయర్, నాటు కోళ్లను స్వాధీనం చేసుకుని చంపివేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పరిశ్రమలో మరో 3 నెలల వరకు కోళ్ళను తిరిగి పెంచడానికి అనుమతి ఉండదని అన్నారు. పరిశ్రమలో ఉన్న కోళ్ళతో పాటు, కోడి గ్రుడ్లు, దాణా తదితర వాటినన్నింటిని ధ్వంసం చేయడం జరుగుతుందన్నారు. కోళ్ళ ఫాంలు నిర్వహిస్తున్న రైతులు షెడ్లను, బయటి నుండి వచ్చే వాహనాలను శానిటైజేషన్ చేస్తూ ఉండాలని రమేష్ సూచించారు. ఈ సమావేశంలో పశు వైద్యాధికారులు డాక్టర్ అమరెందర్, డాక్టర్ అభినవ్‌లు పాల్గొన్నారు.





# హరితహారం నర్సరీ ఏర్పాటులో నిర్లక్ష్యం

## గ్రామంలో లోపించిన పారిశుద్ధ్య నిర్వహణ



**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరిత హారం మంచి ఫలితాలను ఇస్తోంది. గద్వాల మండలంలో ఇప్పటికే గ్రామ పంచాయతీల వారీగా నవంబర్, డిసెంబర్ నెలలోనే నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. వీటిని రానున్న వర్షాకాలం ప్రారంభంలో మొదలు కానున్న హరిత హారం పథకంలో భాగంగా గ్రామంలో పచ్చదనం పెంచేందుకు విరివిగా మొక్కలను నాటాల్సి ఉంది. కానీ సాక్షాత్తు జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రానికి సమీపంలోనే ఉన్న సంగాల గ్రామంలో మాత్రం ఇప్పటికీ ఉపాధి హామీ వన నర్సరీ ఏర్పాటుకు నోచుకోలేదు. గ్రామపంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ప్రస్తుతం కవర్లలో మట్టి నింపే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. నవంబర్, డిసెంబర్ లోనే నర్సరీలో మొక్కలను పెంచే ప్రక్రియను చేపట్టాల్సి ఉండగా నిండు వేసవిలో విత్తనాలు మొలకెత్తడం, వాటి పెరుగుదల ఏ విధంగా ఉండబోతుందోనని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికే మొక్కలు పెరుగుతున్నట్లయితే రానున్న వర్షాకాలంలో ప్రారంభమయ్యే హరితహారం పథకంలో మొక్కలు నాటేందుకు అనువుగా ఉండేదని గ్రామ ప్రజలు భావిస్తున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రత్యేక అధికారులు చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## హమాలీ వర్కర్స్ యూనియన్ నూతన జిల్లా కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/ కాగజ్ నగర్:** తెలంగాణ సివిల్ సప్లయీస్ హమాలి వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నాలుగో మహాసభలు శుక్రవారం కాగజ్ నగర్ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు ప్రకటించారు. నూతనంగా బోగే ఉపేందర్ జిల్లా ప్రెసిడెంట్‌గా, బొట్టుపల్లి సుధాకర్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక య్యారు. అలాగే బుదాజి (అంజి), దత్తు ఉపాధ్యక్షులుగా, మేకల శ్రీనివాస్, కె. రాజన్న జిల్లా కార్యదర్శులుగా ఎన్. శంకర్ కోశాధికారిగా, శ్రీనివాస్, తిరుపతి, సాయి, కిషోర్, మారుతి జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ మహాసభల్లో సంఘం భవిష్యత్ కార్యాచరణపై చర్చించి, హమాలీల హక్కుల కోసం పోరాటం కొనసాగించాలని నేతలు పేర్కొన్నారు.

## మరోసారి అధికారమిస్తే పంచభూతాలూ దోపిడీ!

**ప్రజాపక్షం/గజ్వేల్:** రాష్ట్రంలో ఇసుక, మట్టి, నీటి దోపిడీ చేసిన కేసీఆర్ కుటుంబం మరోసారి రాష్ట్రంలో అధికారం చేపడితే పంచభూతాలను కూడా దోచేసేవారని డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి విమర్శిం చారు. కాంగ్రెస్ పోరుబాట పాదయాత్రలో భాగంగా శనివారం గౌరారంలో జరిగిన పాద యాత్రలో ఆయన ప్రసంగించారు. కెసిఆర్ ను బర్తరఫ్ చేయాలని ఇప్పటికే కోర్టులో కొందరు ప్రజా ప్రయోజన వాజ్యం వేయగా, భయంతోనే ఆయన అసెంబ్లీకి వచ్చి వెళ్లినట్లు ఎద్దేవా చేశారు. గజ్వేల్ ప్రజల సమస్యలు పరిష్కరించకుండా ఎమ్మెల్యేగా జీతభత్యాలు పొందడం భావ్యం కాదని విమర్శించారు. కెసిఆర్ లో మార్పు తేవాలని, గజ్వేల్ ప్రజల ఇబ్బందులు పరిష్కరించే క్రమంలో ప్రభుత్వం నుండి నిధులు సాధించాలని, గజ్వేల్ ప్రజలను పట్టించుకోని కేసీఆర్ ను గవర్నర్ బర్తరఫ్ చేయాలని డిమాండ్‌తో పోరుబాట పాదయాత్ర చేపట్టి సోమవారం రాష్ట్ర గవర్నర్ కు వినతి పత్రం అందించను న్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్లు భూం రెడ్డి, ఎలక్షన్ రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ అంక్షారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ 25 శాతం రాయితీ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన వారందరూ నిర్ణీత గడువులోగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఒక ప్రకటనలో సూచించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం నూతన నిర్ణయాలు తీసుకుందని గుర్తు చేశారు. ఎఫ్‌టిఎల్ నిషేధించిన సర్వే నెంబర్లు మినహా ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న అందరికి రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించామని తెలిపారు. రుసుము ఎంత అనేది ఎవరైనా తమ సెల్‌నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి పరిశీలించుకోవచ్చన్నారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఈనెల 31 లోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని తెలిపారు. రుసుము చెల్లించిన వారి దరఖాస్తును అధికారులు పరిశీలించి వెంటదివెంట అనుమతి మంజూరు చేస్తారని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అనేక మంది తమ ప్లాట్లను అనధికార లేఅవుట్లను రాయితీతో కూడిన రుసుము చెల్లించి రెగ్యులరైజ్ చేసుకున్నారన్నారు. అనధికారికంగా లేఅవుట్లు చేసి అందులో 10 శాతం ప్లాట్లను విక్రయించిన వారికి మిగతా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశముందని కలెక్టర్ సూచించారు. ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో కూడా ఎల్ఆర్ఎస్ రుసుసము చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని తెలిపారు. క్రమబద్ధీకంచని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు నిర్మాణాలకు అనుమతి మంజూరు చేయటం జరగదని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అర్హులైన వారందరూ ఈ నెల 31 లోగా క్రమబద్ధీరణ చేసుకోవాలని ప్రభుత్వం కల్పించిన రాయితీ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధమైన తాగునీరు

### కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** మిషన్ భగీరథ పథకం ద్వారా మారుమూల ప్రాంతాలకు శుద్ధమైన త్రాగునీటిని అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులను ఆదేశించారు. శనివారం ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నీటి సరఫరా ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, మిషన్ భగీరథ ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీలు ఉన్నట్లయితే వెంటనే మరమ్మత్తులు చేపట్టి, నీటి సరఫరాను నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవికాలంలో బావులు, బోరు బావుల్లో నీరు అడుగంటే అవకాశం ఉండటంతో ప్రజలు మిషన్ భగీరథ నీటిని వినియోగించుకోవాలని, ఎలాంటి అపోహలు లేకుండా శుద్ధమైన తాగునీటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రామంలో మరుగుదొడ్ల కోసం దరఖాస్తు చేసిన వారు ఉంటే, వాటిని పరిశీలించి నిబంధనల ప్రకారం మంజూరు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, మిషన్ భగీరథ ఇంజనీర్లు, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దు

### ఎమ్మెల్యే బొజ్జు పటేల్



**ప్రజాపక్షం/ఖానాపూర్:** అసెంబ్లీలో ఖానాపూర్ నియోవకవర్గ సమస్యలపై మాట్లాడిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కవ్వాల్ టైగర్ జోన్లో ఫారెస్ట్ అధికారులు అభివృద్ధి పనులను, అడ్డుకుంటున్నారని, తక్షణమే అభివృద్ధి పనులు జరిగేలా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఖానాపూర్ ఎమ్మెల్యే అన్నారు. శనివారం శాసన సభలో ఖానాపూర్ నియోజకవర్గంలోని సమస్యలపై గళమెత్తారు. ఫారెస్ట్ ప్రాంతాల్లోని గ్రామాల్లో 3ఫేస్ కరెంటు అందించడానికి అధికారులు అడ్డుకుంటున్నారని, కడెం మండలంలోని గంగపూర్ పరిసర ప్రాంతాలలో 3ఫేస్ కరెంటు ఏర్పాటు చేస్తే ఫారెస్ట్ అధికారులు ఆ గ్రామ ప్రజలను కార్యాలయాలకు పిల్చి ఇబ్బందులకు గురి చేసి అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనులు దాదాపు పూర్తి అయ్యాయని ఫారెస్ట్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. దస్తురాబాద్ మండలంలోని పోచమ్మ ఆలయ నిర్మాణానికి ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారని, అటవీ శాఖ మంత్రి తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ ఫారెస్ట్ అధికారులు ఆదేశాలు జారీచేసి అభివృద్ధి సక్రమంగా జరగడానికి కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులకు 12 నెలల జీతం ఇవ్వాలని, వాటినే ఆటో రేవివల్ పద్ధతిలో ఎంపిక చేయలన్నారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి



**ప్రజాపక్షం/వెల్దుర్తి:** మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మంగళపర్తి గ్రామానికి చెందిన గద్దె దశరథ్ (54) అనే రైతు శనివారం తన వ్యవసాయ పొలం వద్ద వరికి నీరు పెట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యులు పోలీస్ లకుసమాచారం అందించారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు.

## 25న రాష్ట్ర రైతు సంఘం బహిరంగ సభ



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** రాష్ట్ర రైతు సంఘం బహిరంగ సభలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య కోరారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య మాట్లాడారు. రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ఈ మహాసభల్లో చర్చించటం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం నిజామాబాద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పసుపు బోర్డుకు నిధులు కేటాయించకపోవటం అన్యాయమన్నారు. రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తూ ప్రభుత్వాలు ఎంఎస్‌పి ధరను నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రైతు సంఘం మహాసభలు ఈ నెల 25 నుండి 27 లలో నిజామాబాద్‌లో జరగనున్నాయని మొదటి రోజు మార్చి 25న మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక ప్రెస్‌క్లబ్ నుండి పూలాంగ్‌లోని గోనెరెడ్డి ఫంక్షన్ వరకు ప్రదర్శన ఉంటుందని, అనంతరం గోనెరెడ్డి ఫంక్షన్ హాల్‌లో బహిరంగ సభ కలదని ఈ బహిరంగ సభకు జిల్లాలోని రైతాంగం, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ బహిరంగ సభకు అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రాజన్, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, హేమంతరావు, పద్మ పాల్గొంటారని జిల్లాలోని రైతాంగం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. 26, 27 లలో బీఎల్ఎన్ గార్డెన్‌లో మహాసభలు కొనసాగుతాయన్నారు. సమావేశంలో ఆహ్వాన సంఘం ప్రతినిధులు పి.సుధాకర్, రాజేశ్వర్, రాజిరెడ్డి, నర్సింలు, మహేష్ పాల్గొన్నారు.

## పొలాలు ఎండుతున్నా ప్రభుత్వం పట్టించుకోదా...?



**ప్రజాపక్షం/గజ్వేల్:** రాష్ట్రంలో పంట పొలాలు ఎండుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేపట్టిన పాదయాత్రకు సిద్దిపేట జిల్లా శ్రీగిరిపల్లి వద్ద ఎమ్మెల్సీ కవిత, ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి గుప్త, మాజీ జెడ్పిటిసి డాక్టర్ మల్లేశం, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి తదితరులు సంఘీభావం ప్రకటించారు. సిఎం రేవంత్‌రెడ్డి, అధికార యంత్రాంగం నిర్లక్ష్యంతో లక్షలాది ఎకరాల పంటలు ఎండుతున్నప్పటికి సిగ్గు లేకుండా చూస్తూ కూర్చుంటున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మక్క సారక్క వద్ద కేవలం రూ 6 కోట్లు ఖర్చు పెడితే పంట పొలాలకు సాగునీరు అందేదని, అలాగే మేడిగడ్డ వద్ద ఏదో జరిగిందని రాద్ధాంతం చేసిన కాంగ్రెస్ నేతలను రైతులు నిలదీయాలని కోరారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలు కుట్రలు పన్ని మేడిగడ్డ అంశాన్ని రాజకీయం చేయగా, గోదావరి పొంగి పొర్లి పూర్వ వైభవం తెచ్చేందుకు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పాదయాత్ర చేపట్టి రైతులు, ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. బీసీలు సంఘటితంగా ఉద్యమించి 42 శాతం రిజర్వేషన్లు సాధించుకోగా, జనగణన సక్రమంగా నిర్వహిస్తే మరింత న్యాయం జరిగేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బెండ మధు, ప్యాక్స్ చైర్మన్ వెంకటేష్ గౌడ్, సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారమే ఎఐటియుసి లక్ష్యం



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని ఎఐటియుసి గుర్తింపు సంఘం ఉప ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా తెలిపారు. శనివారం ఆర్‌కె న్యూటెక్ గనిని సందర్శించిన వారు గనిలోని అన్ని విభాగాల్లో తిరిగి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గని వార్షిక లక్ష్యం గత నెలలోనే నెరవేరినప్పటికీ ఫిబ్రవరి నెలలో ఇన్సెంటివ్‌గా ప్రతి కార్మికుడికి రూ.2200 ఇవ్వాల్సిందిగా ఆశించినప్పటికీ కేవలం రూ.1200 మాత్రమే అందించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమైందని, బొగ్గు నిల్వలు ఉన్నప్పటికీ తక్కువ ట్రాన్స్ పోర్ట్ చేయడం వల్ల ఇన్సెంటివ్‌ను తగ్గించడం కార్మికులకు అసహనాన్ని కలిగించిందని పేర్కొన్నారు. కార్మికులకు రక్షణ గ్లౌజెస్, డస్ట్ మాస్కులు అందుబాటులో ఉన్నప్పటికీ యాజమాన్యం వాటిని అందించకుండా ఆలస్యం చేస్తోందని ఆరోపించారు. జన్మభూమి పేరుతో ఉదయం 7:30 నుంచి 9 గంటల వరకు పని చేయిస్తున్నప్పటికీ భోజనానికి తగిన సమయం ఇవ్వకుండా తొమ్మిదింటికల్లా మ్యాన్ రైడింగ్ నిలిపివేడం అన్యాయమని విమర్శించారు. అలాగే అండర్ గ్రౌండ్ కార్మికులను సర్ఫేస్ పనులకు బదిలీ చేసి అండర్ గ్రౌండ్ అలవెన్స్‌ను తగ్గించడం కూడా తీవ్ర అభ్యంతరంగా పేర్కొన్నారు. క్యాంటీన్ వద్ద చెత్త పేరుకుపోయి శుభ్రం చేయక పోవడం వంటి సమస్యలను కార్మికులు తమకు వివరించారని తెలిపారు. యాజమాన్యం కార్మికుల కష్టాన్ని తక్కువగా భావించడం సమంజసం కాదని, సంబంధిత సమస్యల పరిష్కారం కోసం అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా సెక్రటరీలు ప్రసాద్ రెడ్డి, సంపత్ కుమార్, ట్రేడ్స్‌మెన్ ఇన్‌చార్జి సురేష్, లక్ష్మ ణ్, సందీప్, చంద్రమౌళి, వెంకటేశం, మల్లేష్ పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోండి..



**ప్రజాపక్షం/ఆర్మూర్:** షెడ్యూల్డు కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు, తద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ కుమార్ రెడ్డి కోరారు. 21 నుంచి 60 సంవత్సరాల వయసు గల అభ్యర్తులు అర్హులని తెలిపారు. అభ్యర్థి సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. లక్ష 50 వేలు, పట్టణ, మునిసిపాలిటి ప్రాంతాల వారికి రూ. 2 లోలు మించి ఉండరాదని, మీ సేవ నుండి పొందిన కులం, ఒక సంవత్సరం లోపు ఆదాయ ధృవపత్రం, ఆధార్ కార్డు, ఫుడ్ సెక్యురిటి కార్డు కలిగిన దారిద్ర్య రేఖకు దిగువన గల అభ్యర్తులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత ఆసక్తిగల అభ్యర్తులు TSOBMMS ఆన్‌లైన్ పోర్టల్ https://tgobmmsnew.cgg.gov.in లో ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు.

## పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్‌పి



**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరడిగొండ మండలంలోని పోలీస్ స్టేషన్ని నూతనంగా నియమితులైన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్,శనివారం తనిఖీ చేశారు.ప్రజల భద్రత కు సంబంధించి రోడ్డు ప్రమాదాల వివారణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్నటువంటి సెక్యూరిటీ పటిష్టతపై పలు సూచనలు చేశారని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.ఆయనతో పాటు ఉట్నూరు ఏఎస్పి కాజల్ సింగ్,ఇచ్చోడ సిఐ భీమేష్,తదితరులు ఉన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తుందని పిట్లం ఏఎంసీ చైర్మెన్ చీకోటి మనోజ్‌కుమార్ అన్నారు. ఆయన ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన నిధులతో జక్కాపూర్ గ్రామంలో శనివారం సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో జుక్కల్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. సంక్షేమ అభివృద్ధి పథకాలు అన్ని గ్రామాల్లో అమలవుతున్నాయమని పేర్కొన్నారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ష నాయకులు వెంకట్‌రాంరెడ్డి, బస్వప్ప, గుండిమి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మకానికి బడి పిల్లల సన్నబియ్యం!

### అలస్యంగా వెలుగు చూసిన గోదాం ఇన్‌చార్జ్ నిర్వాకం



**ప్రజాపక్షం/చెన్నూరు:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం అందజేస్తున్న సన్నబియ్యం అధికారులే అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్న ఘటన చెన్నూరులో ఆలస్యంగా వెలుగు చూసింది. శనివారం మధ్యాహ్నం, చెన్నూరు ఎఫ్‌సిఐ గోదాం నుండి తెల్ల సంచుల్లో సన్న బియ్యం తరలిస్తున్న వ్యక్తులను స్థానికులు గమనించారు. వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చి గోదాంలోకి వెళ్లి పరిశీలించగా, మరిన్ని సంచులు తరలించేందుకు సిద్ధంగా ఉన్నాయని గుర్తించారు. గోదాం ఇంచార్జి సంతోష్‌ను నిలదీయగా, పొంతన లేని సమాధానాలు ఇచ్చి, తాళం వేసి అక్కడి నుండి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. గత కొద్దిరోజులుగా లక్షల రూపాయల విలువైన సన్నబియ్యాన్ని, ప్రతి క్వింటాను 2600 చొప్పున అమ్ముకుంటూ గోదాం ఇంచార్జి అక్రమ దందా నిర్వహిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. పేద విద్యార్థులకు అందాల్సిన బియ్యాన్ని అధికారులు దొంగదారి పట్టించడం అత్యంత దారుణమని, ఇలాంటి వ్యక్తులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ స్పందిసూ, నిరుపేద విద్యార్థులకు అందాల్సిన బియ్యం అమ్మకాన్ని ఉపేక్షించేది లేదని, తద్వారా బాధ్యులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాసుల **కోసం పేద విద్యార్థుల కడుపు కొడతారా?.. సిపిఐ నేత మధునయ్య**

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చాలకపోయినట్లుగా, విద్యార్థులకు అందాల్సిన బియ్యాన్ని అమ్ముకోవడం సిగ్గుచేటు అని సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు మధునయ్య మండిపడ్డారు. బడి పిల్లలకు పౌష్టికాహారం అందించాల్సిన బియ్యాన్ని కూడా వదలని అధికారులు, రేషన్ కార్డు ద్వారా అందనున్న సన్నబియ్యాన్ని సైతం దోచుకునే ప్రమాదం ఉందని, తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, బియ్యం దొంగలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## తహసీల్దార్ కార్యాలయానికి రూ.50 లక్షల నిధులు మంజూరు

### ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



**ప్రజాపక్షం/బైంసా:** ఎన్నో సంవత్సరాలుగా తహసిల్దార్ కార్యాలయం లేక ఇబ్బందులు పడుతున్న ప్రజానీకానికి శుభవార్త ను అందించారు.ఎమ్మెల్యే పవర్ రామరావు పటేల్,భవన నిర్మాణానికి 50 లక్షల రూపాయల ఎస్.డి.ఎఫ్ నిధులు మంజూరైనట్లు ఆయన చెప్పారు.గత కొన్ని సంవత్సరాలుగా కార్యాలయం లేక అక్కడి ఆసుపత్రి గది,ప్రస్తుతం బీసీ హాస్టల్ భవనంలో తహసీల్దార్ కార్యాలయం ఉంది.దీంతో సంవత్సరాల తరబడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.ప్రస్తుతం కార్యాలయం నిర్మిస్తే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో కుబీర్ మండల ప్రజలు,బిజెపి నాయకులు,అధికారులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెప్పారు.మారుమూల మండలమైన కుభీర్ లో భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ఉరి వేసుకుని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఊట్ల భువనేశ్వరి (33) గత కొంత కాలంగా దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. అదే విషయమై తరచూ ఇంట్లో బాధపడుతుండేది. శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కాసేపటికి ఇంట్లోకి వచ్చిన కుటుంబీకులు గమనించి చికిత్స నిమిత్తం అంబులెన్సులో మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుడు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్తతోపాటు ఇద్దరు కుమారులున్నారు. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## అకాల వర్షం...అపార నష్టం

### ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు



**ప్రజాపక్షం/వెల్దుర్తి:** రాత్రి వీచిన గాలి దుమారము కురిసిన వర్షానికి వెల్దుర్తి మండలం లో భారీగా నష్టం జరిగింది. బండ పోసాని పల్లి గ్రామంలో పడిపోయిన విద్యుత్ స్తంభం, పడిపోయిన భారీ చెట్టు, మూడు ఇండ్లకు చెందిన ఇంటి రేకులన్నీ ఎగిరిపోయిన కల్లు డిపో రేకులు, గుండు మహేష్ ఇంటిపై రేకులు, మ్యాదరి నర్సింలు ఇంటిపై రేకులు ఎగిరిపోయాయి చింతల కిష్టయ్యకు సుమారు లక్ష రూపాయల నష్టం జరిగింది. సుమారు 10 ఎకరాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. పలు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. విద్యుత్ శాఖ అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి పరిశీలిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించారు బండ పోసానిపల్లి గ్రామంలో రాత్రి నుండి ఇప్పటి వరకు పునరుద్ధరణ కాలేదుచేసి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

## మంచిర్యాలలో అకాల వర్షం.. మట్టిలో రైతుల కష్టం

### జిల్లాలో వర్ష బీభత్సం.. వడగండ్లతో పంటలకు తీవ్ర నష్టం





**ప్రజాపక్షం/మంచిర్యాలప్రతినిధి:** మంచిర్యాల జిల్లాలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. పలుచోట్ల చెట్లు విరిగి రహదారులపై పడగా, వ్యవసాయ పొలాల్లోని పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. జిల్లాలోని హాజీపూర్, దండేపల్లి, కర్ణమామిడి, నర్సింగపూర్, ధర్మారం, బుగ్గగట్టు గ్రామాల్లో మామిడి, వరి, మొక్కజొన్నతోటలు పూర్తిగా నేలమట్టమయ్యాయి.

**రైతుల ఆశలపై నీళ్లు చల్లిన అకాల వర్షం..**

వేసవి వేడి మండిపోతున్న వేళ ఆకస్మికంగా కురిసిన అకాల వర్షాలు రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. హాజీపూర్ మండలంలోని సబ్బేపల్లి, రాపల్లి, ధర్మారం, బుగ్గగట్టు గ్రామాల్లో మామిడి తోటలకు భారీగా నష్టం వాటిల్లింది. ఇప్పటికే తేనె మంచుతో పూత వాడిపోవడంతో తక్కువ దిగుబడికి గురైన మామిడి రైతులకు ఈ వడగండ్ల వాన మరింత నష్టాన్ని తెచ్చిపెట్టింది. కాసిన మామిడి కాయలు వడగండ్ల వానకు రాలిపోవడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. మరో 20 రోజుల్లో పంట కోయాలని భావించిన రైతులకు అకాల గాలిదుమారం భారీ ఎదురుదెబ్బ అని రైతులు వాపోతున్నారు.

**వరి, మొక్కజొన్న రైతుల పరిస్థితి దయనీయం**

హాజీపూర్ మండలంలోని కర్ణమామిడి గ్రామంలో పోచయ్య అనే రైతు రెండు ఎకరాల్లో సాగుచేసిన వరి పూర్తిగా నష్టపోయింది. జునగరి కోటయ్య, కొట్టే నర్సయ్యల 8ఎకరాల వరి నేలమట్టమైంది. నర్సింగపూర్, ధర్మారం గ్రామాల్లో మొక్కజొన్న పంట తీవ్రంగా దెబ్బతింది. భారీ గాలులతో మొక్కజొన్న పూర్తిగా నేలకూలడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం ఇవ్వాలి..**

హాజీపూర్ మండల వ్యాప్తంగా 80 ఎకరాల వరి, 50 ఎకరాల మొక్కజొన్న పంట పూర్తిగా నష్టపోయిందని రైతులు చెబుతున్నారు. హాజీపూర్, దండేపల్లి మండలాలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో కూడా రైతులు భారీ నష్టాన్ని చవిచూశారు. ప్రభుత్వమే ముందుకు వచ్చి పంట నష్టం అంచనా వేసి తక్షణ సహాయాన్ని అందించాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందించాలని, తక్షణ సాయం ప్రకటించాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. సహాయ చర్యలు తీసుకోకపోతే తీవ్ర ఆందోళనకు దిగుతామని రైతులు హెచ్చరిస్తున్నారు. పంట నష్టాన్ని పరిశీలించేందుకు గ్రామంలో వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టారు.

## పది పరీక్షా కేంద్రాలు తనిఖీ



ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : సిరిసిల్ల పట్టణంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కృష్ణవేణి టాలెంట్ పాఠశాల, సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాల్లోని అన్ని గదులను సందర్శించి పరీక్షలు జరుగుతున్న సరళిని పరిశీలించారు. ఎంతమంది హాజరు, గైర్హాజరు అయ్యారు అనే వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రం లోపలికి అనుమతించవద్దన్నారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

## ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఏర్పాటు

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కమిటీ శనివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో మార్వాడి సుదర్శన్ అధ్యక్షతన వివిద ప్రజాసంఘాలు, అస్థిత్వ సంఘాలు, పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ ఆద్వర్యంలో ఉమ్మడి జిల్లా ఆదివాసీ హక్కుల పో రాట సంఘీభావ వేదిక ఏర్పాటును ప్రకటించారు. ఈ వేదిక కన్వీనర్‌లుగా రైతు సంఘం నాయకులు ముడిపడుగుల మల్లన్న, సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, డిహెచ్‌పిఎస్ తాళ్లపల్లి లక్ష్మణ్, జెఎసి నాయకులు వెంకటమల్లయ్య, రాజమల్లయ్య, డిఎల్ఎఫ్ రామిళ్ల బాపు, జిందం ప్రసాద్, లెనిన్, విరసం బాలసాని రాజయ్య, దండు అంజన్న, బాపన్న, సతీష్, కొయ్యడ సృజన్, తెలంగాణ ప్రజాఫ్రంట్ పెద్ద పల్లి జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య, పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్‌లుగా నియమితులైనట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణరావు, డిఎల్ఎఫ్ ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్, ఆదివాసీ సంఘీభావ పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ సోయం చిన్నన్నలు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా ఉంటాం

* జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



ప్రజాపక్షం / ధర్మపురి : వడగళ్ల వర్షంతో పంట నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. ధర్మపురి మండలం రాయపట్నం, తిమ్మాపూర్ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన కురవడంతో పంటలకు తీవ్రనష్టం కలిగింది. శనివారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆయా గ్రామాలను సందర్శించి పంటలను పరిశీ లించారు. పంట నష్టం తీవ్రతను రైతులను అడిగి తెలుసుకున్నారు. రాయపట్నం గ్రామంలో వరి పంట 850 ఎకరాల్లో దెబ్బతినగా, తిమ్మాపూర్ గ్రామంలో 460 ఎకరాల్లో, నేరేళ్ల లో 8ఎకరాలలో మొక్కజొన్న పంట నష్టం జరిగినట్లు అంచనా వేశారు. నష్టపోయిన రైతుల వివరాలు ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు తెలిపారు. ఆర్డీవో మధుసూధన్, తహశీల్దార్ కృష్ణ చైతన్య, మండల వ్యవసా యాధికారి ఎం. రాజ్ కుమార్, నాయకులు రాందేని మొగిలి, తిరుపతి పాల్గొన్నారు.

## నేలకొరిగిన మొక్కజొన్న..రాలిన మామిడి



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : జగిత్యాల జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం వల్ల రైతులకు తీరని నష్టం సంభవించిందని పలువురు స్థానిక రైతులు ఆవేదనచెందుతున్నారు. పంట చేతికచ్చే సమయంలో కురిసిన వర్షంతో వరి, మొక్కజొన్న, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. జగిత్యాల జిల్లాలోని రాయపట్నం, మల్యాల, కొండగట్టు, చెప్యాల, కొడిమ్యాల తదితర ప్రాంతాల్లో రాళ్ళ వర్షం కురియడంతో పొట్ట దశలో ఉన్న వరి తో పాటు మొక్కజొన్న నెలమట్టమైంది. కొన్నిచోట్లా రోడ్డుపై చెట్లు విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో పాటు వర్షం కురియగానేలకొరిగిన మొక్కజొన్న, తడిసిన పసుపు, మామిడి కాయలునెల రాలడంతో రైతులు ఆందోళన చెందారు. కురిసిన అకాల వర్షానికి జగిత్యాల నియోజకవర్గంలో సు మారు 1500 పైగా ఎకరాల్లో మామిడికాయలు రాలిపోయాయి. వెయ్యి ఎకరాలకు పైగా మొక్కజొన్న నెలకొరిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మి పూర్ గ్రామంలోనే దాదాపు 200 ఎకరాలకు పైగా మొక్కజొన్న, 150 ఎకరాలకు పైగా మామిడి పంటను రైతులు నష్టపోయారు ప్రభుత్వం వెంటనే స్పందించి ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం అందించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



సిద్దిపేట అర్బన్ : సిద్ది పేట అర్బన్ మండలంలోని ఎన్సాన్ పల్లి గ్రామ రైతు మల్లేశంకు చెందిన మొక్కజొన్న పంట శుక్రవారం కురిసిన ఆకాల వర్షానికి నేలకు ఒరిగింది. శనివారం సిద్దిపేట అర్బన్ మండల వ్యవసాయ అధికారి శ్రీనాథ్ పంటను పరిశీలించి వివరాలను తెలుసుకు న్నా రు. పంట నష్టాన్ని పైఅధికారుల దృ ష్టికి తీసుకువెళ్తామని రైతుకు న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తానని తెలిపారు.


## వర్షానికి దెబ్బతిన్న పంటల పరిశీలన



ప్రజాపక్షం/చొప్పదండి : చొప్పదండి మండలం కొలిమికుంట గ్రామంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను మండల కాంగ్రెస్ నేతలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు అధైర్యపడొద్దని ప్రభుత్వపరంగా వారికి తగిన సహాయాన్ని అందజేసేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల గంగయ్య గౌడ్, మాజీ కౌన్సిలర్ కొట్టె అశోక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, ముద్దం తిరుపతిగౌడ్, తదితరులున్నారు.

## రైతన్నలకు నష్టపరిహారం అందించాలి

జగిత్యాల జిల్లా మాజీ జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల రూరల్ మండలం హైదర్ పల్లి గ్రామంలో శుక్రవారం కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన మొక్కజొన్న పంటను స్థానిక నాయకులు, రైతులతో కలిసి జగిత్యాల జిల్లా మాజీ జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత సురేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి రైతన్నలకు నష్ట పరిహారం అందించి రైతన్నలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకాన్ని సక్రమంగా అ మలు చేయాలని మండలాన్ని కేంద్రంగా కాకుండా గ్రామాన్ని కేంద్రంగా తీసుకోవాలని మాజీ జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. అనంతరం హైదర్‌పల్లిలోని పర్స వెంకటి అనే రైతుకు చెందిన గేదె పిడుగుపాటుతో మరణించగా రైతును పరామర్శించి ప్రభుత్వం రైతుకు తగిన నష్టపరిహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ అంజన్న, సీనియర్ నాయకులు గంగారెడ్డి, సాగి సత్యంరావు, మాజీ ఉప సర్పంచ్ గంగాధర్, నాయకులు నర్సయ్య, మహిపాల్, శంకర్, గంగాధర్, స్వామి రెడ్డి, నరేష్,శేఖర్, బదే భీమయ్య, భూమయ్య, దుబ్బ రాజం, రాజన్న,ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు అధైర్య పడొద్దు..
# ప్రభుత్వం అండగా ఉంటుంది

నష్టపోయిన రైతులకు ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి భరోసా




ప్రజాపక్షం/కరీంనగర్ప్రతినిధి : రాష్ట్రంలో వివిధ జిల్లాలలో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వానకు నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని, ప్రభుత్వం ఆదుకుని అండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకుడు ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం కొత్తపల్లి మండల కేంద్రంలో అకాల వర్షానికి నష్టపోయిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, ఉపరితల ఆవర్తన ప్రభావంతో తెలంగాణలో అకాల వర్షం ముంచెత్తి మొక్కజొన్న, మామిడి పంటతో పాటు కూరగాయల పంటలకు సైతం తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. చాలా చోట్ల వ్యవసాయ మార్కెట్లలో ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని, పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సకాలంలో పరిహారం అందే విధంగా కృషి చేస్తామని వెల్లడించారు. కొత్తపల్లి మండలంలో 200 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయబడిందని, కొన్ని చోట్ల పంటను రైతులు హార్వెస్టింగ్ చేశారని, నిన్న కురిసిన అకాల వర్షానికి సుమారు 50 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందన్నారు. మొన్నటి వరకు నీటి ఎద్దడితో వరి పంటకు నష్టం వాటిల్లి ందని, మరో 10 రోజుల్లో చేతికి వచ్చే మొక్కజొన్న పంట ప్రకృతి కన్నెర్ర చేయడంతో గాలివాన బీభత్సానికి నేల వాలి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ నియోజకవర్గంలో నష్టపోయిన పంటలకు అధికారులతో సర్వే చేయించి ప్రభుత్వానికి నివేదక అందించి నష్టపరిహారం ఇప్పించేందుకు కలెక్టర్, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు. అకాల వర్షాలతో కౌలు రైతు విలవిలలాడుతున్నాడని, ఎకరాకు 25 వేలు కౌలు చెల్లించడంతో పాటు 40 వేల వరకు పెట్టుబడి పెట్టి నష్టపోయారని, ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, చింతల శ్రీనివాస్ రెడ్డి, కొత్తపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దుబ్బాసి కుమార్, మాజీ ఉపసర్పంచ్ ఎర్రం కనకరెడ్డి, కొత్తపల్లి పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జేరిపోతుల వాసు, చిట్కూరి బీరయ్య, బేతి సుధాకర్‌రెడ్డి,నంది తిరుపతిరెడ్డి, కాశెట్టిశ్రీనివాస్, జిల్లా మహిళా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ వెన్నం రజిత రెడ్డి, మాడుగుల మమత, శ్రీమతి రెడ్డి, చెప్యాల రాజిరెడ్డి, సిరిశెట్టి రాజేష్‌లున్నారు.

## విధి నిర్వహణలో అలసత్వంవద్దు..

అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవు

సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ



ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి కేసులు నమోదైన వెంటనే నిందితులను అరెస్టు చేయాలని.. నిందితులను అరెస్టు చేసే విషయంలో ఏలాంటి జాప్యం చేయవద్దని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ అన్నారు. నూతన టెక్నాలజీని పోలీసు అధికారులు అం దిపుచ్చుకొని ఏరోజుకు..ఆరోజుకు సమాచారం అందించాలన్నారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యను పరిష్కరించుకోవాలని సిపి అనురాధ అన్నారు. శనివారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న కేసులపై సిపి అనురాధ సమీక్ష సమావేశం నిర్వహించారు. 2023—2025 సంవత్సరాల్లో అండర్ ఇన్‌వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల్లో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులపై సిఐ, ఎస్ఐలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపి అనురాధ మాట్లాడుతూ పదవతరగతి పరీక్షల్లో పటిష్ట మైన బందోబస్తును నిర్వహించాలన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. లాంగ్ పెండింగ్ కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి తగు జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. సిసిటిఎంఎస్ డెటా ప్రతిరోజు మానిటరింగ్ చేయాలన్నారు. సిఈఐఆర్ పోర్టల్‌లో పోస్లు పోయినట్లు నమోదైన ఫిర్యాదుల్లో వెంటనే పోన్‌లు రికవరి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను విచారణ జరిపి త్వరగా డిస్పోజల్ చేయాలని సూచించారు.ప్రతి అధికారి విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని, అలసత్వం వహించేవారిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిద్దిపేట రూరలర్, దుబ్బాక సిఐలు శ్రీనివాస్, శ్రీను, సిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, కిరణ్, శ్రీధర్, ఎస్ఐలు అపూర్వరెడ్డి, కృష్ణారెడ్డి, బాలకృష్ణ, ఆసీప్,గంగరాజు,హరిష్, పర్శారాములు, రాజేశ్ తదిరతులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబుతోనే నియోజకవర్గం అభివృద్ధి

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సదానందం

ప్రజాపక్షం/ముత్తారం: మంత్రి శ్రీధర్ బాబు తోనే మంథని నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి చొప్పరి సదానందం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ లు అన్నారు.శనివారం ముత్తారం మండల కేంద్రంలోని కాసర్ల గడ్డ బస్టాండ్ ఆవరణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పుట్ట మధు మాటలు మంథని నియోజకవర్గంలో ఎవరు నమ్మరని, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, ముత్తారం మాజీ జడ్పిటిసి చొప్పరి సదానందం అన్నారు. మంథని నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అన్ని రంగాల్లో అగ్రపథంలో నిలపాలన్న దృడ సంకల్పంతో ముందుచూపుతో నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి మంత్రి శ్రీధర్ బాబు అభివృద్ధి చర్యలు చేతల్లో చేసి చూపిస్తున్నారని కానీ కొందరు మతిభ్రమించిన అవివేకమైన నిరక్షరాస్యులు వారి ఉనికి కోసం మంథని ప్రజలకు మాయమాటలతో మంథనికి ఎలాంటి అభివృద్ధి నిధులు రావట్లేదని మంత్రి శ్రీధర్ బాబుపై దుష్ప్రచారాలు చేయడమే విధిగా పెట్టుకున్నారని అవేదన వ్యక్తం చేశారు. వారి మాటలు మంథనిలో పట్టించుకునే వారు ఎవరు లేరన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ, ఎస్సీ సెల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మద్దెల రాజయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బక్కతట్ల వినిత్, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోవిందుల పద్మ ఆనంద్, పిఎసిఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరి రావు, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాదం శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఎడవేన సంపత్, బీసీ సెల్ మండల అధ్య క్షులు అల్లం కుమార్ స్వామి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు వాజీద్ పాషా, మాజీ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బియ్యని శివకుమార్, తాజా మాజీ ముత్తారం గ్రామ సర్పంచ్ తూటి రజిత రఫీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి నీటి బొట్టు..ఒడిసి పట్టు..

నీటి వృథాను అరికట్టాలి

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి





ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ప్రతి వర్షం నీటి చుక్కను ఒడిసి పట్టాలని, నీటి వృథాను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ పమే లా సత్పతి అన్నారు. తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండి కాలనీలో గల మిషన్ భగీరథ కార్యాలయ సమావేశ మందిరంలో శని వారం 'ప్రపంచ నీటి దినోత్సవం' నిర్వహించారు. మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో యునిసెఫ్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ మనుగడకు నీటి లభ్యత కోసం వెతకాల్సిన పరిస్థితి రావడం భాధాకరమన్నారు. వర్షాధార నీటిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మురుగునీరు వెళ్లేందుకు ఇంటిలో పకడ్బందీ ఏర్పాట్లు చేసుకుంటున్నట్లుగానే ప్రతి ఇంట్లో వర్షాధార నీటిని నిల్వ చేసే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా మరిన్ని చెక్ డ్యాములు, ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన విలువైన తాగునీరును సరఫరా చేస్తున్నామని, ఈ నీటిని వృధా చేయరాదని సూచించారు. మిషన్ భగీరథ సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాల్లో ప్రజల ముందే నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా అసిస్టెంట్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ తాగునీటి సరఫరా సజావుగా సాగేలా చూడాలన్నారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో ఎక్కడైనా లోపాలుంటే గుర్తించి సరిచేయాలన్నారు. ఈ సందర్భంగా నీటిని వృధా చేయరాదని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ కె.రాములు, ఇఇలు అంజన్‌రావు, రామ్ కుమార్, ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులు పాల్గొన్నారు.

### పరీక్ష కేంద్రాల ఆకస్మిక తనిఖీ

పదవ తరగతి పరీక్షల కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కరీంనగర్ ముకరంపురలోని ప్రభుత్వ పురాతన పాఠశాల, వాణినికేతన్ పాఠశాల, మంకమ్మతోటలోని ధన్గర్‌వాడీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్ష జరుగుతున్న సరళిని పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో కల్పించిన మౌళిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని, పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులతో పాటు సిబ్బందిని నిశిత పరిశీలన అనంతరమే అనుమతించాలని తెలిపారు. పరీక్షా పత్రాలు, జవాబు పత్రాల రవాణా పోలీసు ఎస్కార్ట్‌తో చేయాలని వారు తెలిపారు.

## పోరాటాలతోనే రైతుల సమస్యల పరిష్కారం

హామీలను విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజా సమస్యలపై సిపిఐ నిరంతర పోరాటం

రైతు సంఘం సమావేశంలో సిపిఐ నేతలు




ప్రజాపక్షం/చిగురుమామిడి: చిగురుమామిడి మండల కేంద్రంలోని అమరజీవి కామ్రేడ్ ముస్కు రాజిరెడ్డి స్మారక భవనంలో శనివారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మండల మహాసభను సీతారాంపూర్ మాజీ సర్పంచ్ గోలి బాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి, జిల్లా రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు పొనగంటి కేదారి మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతుకు అష్టకష్టాలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన వాగ్దానాలు నీటిమూటలే అవుతున్నా యన్నారు. రైతు సంఘాలను బలోపేతం చేసి అన్నదాతల సమస్యలపై ప్రభు త్వా లపై తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. రైతు బంధు, రైతు బీమా, రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ అని హామీ ఇచ్చి పూర్తి స్థాయిలో అమలు పరచకుంటే భారీ ఎత్తున రైతు సంఘాలతో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతు సమ స్యలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. అంతకుముందు సిపిఐ భవనంలో రైతు సంఘం జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బండ రాజిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాళ శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యు లు అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు గూడెంలక్ష్మి ,జిల్లా కౌన్సిల్ సభ్యులు ముద్రకోల రాజయ్య, ఎలగందుల రాజయ్య, సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా రైతు సంఘం నాయకులు ఆవునూరి రమేష్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి అందె చిన్న స్వామి, సిపిఐ నాయకులు తదితరులున్నారు.

## విద్యారంగ సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులా!




ప్రజాపక్షం/కోనరావుపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి తక్కువ 7శాతం నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వ ర్యంలో చలో అసెంబ్లీ కార్యక్రమం పిలుపులో భాగంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంగూరి రంజిత్‌ను నిజామాబాద్ గ్రామంలో ముం దస్తు అరెస్టు చేసి కోనరావుపేట పోలీస్ స్టే షన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ విద్యారంగ సమస్యలపై విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేస్తున్నారని అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని, నూతన జాతీయ విద్యా విధానం వ్యతి రేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పం పాలని ఉద్యమాల గడ్డ ఉస్మానియా యూని వర్సిటిలో ఎలాంటి నిరసన కార్యక్రమాలు చేయ కూడదని వైస్ చాన్సలర్ జారీ చేసిన సర్క్యులర్ ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఇది భావప్ర కటన స్వేచ్ఛను హరిస్తుందని రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. వెంటనే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో చూపించిన మానిఫెస్టోలో ఉన్న విధంగా ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని ఎడల పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని అన్నారు.

# అదుపుతప్పి ఆటో ట్రాలీ బోల్తా...

- స్టీరింగ్ రాడ్ ఊడటంతో ప్రమాదం
- 16మంది కూలీలకు తీవ్ర గాయాలు
ముగ్గురి పరిస్థితి విషమం
- మిరి నాగేపల్లి వద్ద ఘటన
- స్పందించిన మంత్రి దుద్దిళ్ల





ప్రజాపక్షం/మంథని: కూలీలను తీసుకెళ్తున్న ఓ ఆటో ట్రాలీ అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో 16మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం నాగెపల్లి ఎక్స్‌రోడ్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే...మంథని మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు మల్హార్ మండలం మల్లారంలో మిర్చి పంట ఏరేందుకు టాటా ఏసీ ట్రాలీలో ఆటోలో బయలుదేరారు. అయితే నాగెపల్లి ఎక్స్‌రోడ్‌సమీపంలోకి వెళ్లగానే ఆటో స్టీరింగ్ రాడ్ ఊడిపోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాలీ ఆటోలో ప్రయాణిస్తున్న 16మంది వ్యవసాయ కూలీలకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను బయటకు తీశారు.అలాగే మంథని పోలీసులకు, 108కు సమాచారం ఇవ్వడంతో హుటాహుటీన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ బాధితులను 108సహాయంతో మంథని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స అందిస్తున్నారు. బొందల కిష్టమ్మ, అ ప్పాల శైలజ, వనితల పరిస్థితి ఆందోళన కరంగా ఉండటంతో ప్రథమ చికిత్స చేసి గోదావరిఖని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గోదా వరిఖని ఏసిపి మడత రమేష్ ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులకు వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

### మెరుగైన వైద్యం అందించాలి : మంత్రి శ్రీధర్‌బాబు

మంథని మండలం నాగేపల్లి క్రాస్ రోడ్ సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వైద్యాధికారులను ఆదేశించారు. జరిగిన సంఘటన సమాచారం తె లుసుకున్న ఆయన పూర్తి వివరాలను స్థానిక నాయకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో ఎంత మందికి గాయాలయ్యాయి..ఎక్కడి ఆస్పత్రికి తీసుకెళ్లారనే విషయాలు తెలుసుకున్న మంత్రి మంథని ఆస్పత్రి సూపరిండెంట్‌తో ఫోన్ మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అలాగే ఈ ప్రమాదంలో గాయపడి పరిస్థితి విషమంగా ఉన్న ముగ్గురిని గోదావరిఖని ఆస్పత్రికి తరలించగా వారికి సైతం మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించడంతో పాటు బాధితుల పరిస్థితులను పర్యవేక్షించాలని ఎసిపి మడత రమేష్‌కు ఆదేశించారు. దీంతో ఎసిపి ఆస్పత్రికి వెళ్లి బాధితులను ఆస్పత్రిలో చేర్పించి వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే అవసరమైతే మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం, హైదరాబాద్ నిమ్స్‌కు తరలించాలని సూచనలు చేశారు.

ఫోకస్

# క్రీడ

## ఓ శకానికి తెర





ప్రపంచ హెవీవెయిట్ బాక్సింగ్ చాంపియన్ జార్జి ఎడ్వర్డ్ ఫోర్మన్ (జననం 1949 జనవరి 10) మృతితో ఓ శకానికి తెరపడింది. అమెరికాలోని టెక్సాస్‌లో అల్లరిచిల్లరగా తిరుగుతూ, నేరాలకు పాల్పడిన పిల్లవాడు, ప్రపంచ మేటి బాక్సింగ్ స్టార్‌గా ఎదగడం ఆషామాషి విషయం కాదు. బాక్సింగ్ అతని జీవితాన్ని మలుపు తిప్పింది. 1968 మెక్సికో సిటీ ఒలింపిక్స్‌లో అమెరికా తరఫున హెవీవెయిట్ విభాగంలో బరిలోకి దిగినప్పుడు ఫోర్మన్ వయసు కేవలం 19 సంవత్సరాలు. వయసులో తనకంటే సుమారు 10 సంవత్సరాలు పెద్దవాడైన, నాటి సోవియట్ యూనియన్ బాక్సర్ జొనాస్ సెప్యులిస్‌ను ఓడించి సంచలనం సృష్టించిన ఫోర్మన్, భవిష్యత్తు తనదేనని బాక్సింగ్ రింగ్ నుంచే సంకేతాలు పంపాడు. హెవీవెయిట్ బాక్సింగ్‌లో తిరుగులేని ఆధిపత్యాన్ని కనబరుస్తున్న మహమ్మద్ అలీపై గెలిచి, ప్రపంచ దృష్టిని ఆకర్షించిన జో ఫ్రేజర్‌ను 1973లో కేవలం రెండు రౌండ్లలోనే ఫోర్మన్ చిత్తుచేశాడు. అత్యంత బలమైన పంచ్‌లతో విరుచుకుపడిన ఫోర్మన్ ధాటికి నిలవలేక, ఫ్రేజర్ ఆరు పర్యాయాలు నేలపై పడిపోయాడు. ఈ ఫైట్‌తో ఫోర్మన్ పేరు ప్రపంచ వ్యాప్తంగా మారుమోగిపోయింది. అయితే, 1974 అక్టోబర్ 30న జైర్ (ఇప్పటి కాంగో)లోని కిన్షాసాలో జరిగిన చారిత్రక ఫైట్‌లో మహమ్మద్ అలీ చేతిలో పరాజయాన్ని ఎదుర్కొన్నాడు. కెరీర్‌లో అతనికి అదే తొలి ఓటమి. 15 రౌండ్ల ఫైట్‌ను అలీ ఎనిమిది రౌండ్లలో ముగించాడు. 'రంబుల్ ఇన్ ది జంగిల్'గా ప్రసిద్ధి పొందిన ఈ ఫైట్ ముగిసిన కొద్ది కాలానికే ప్రొఫెషనల్ బాక్సింగ్ నుంచి ఫోర్మన్ రిటైర్మెంట్ ప్రకటించినప్పుడు యావత్ ప్రపంచం విస్తుబోయింది. హఠాత్తుగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని 'దైవ ఆజ్ఞ'గా అప్పట్లో ఫోర్మన్ ప్రకటించాడు. ఆ సమయంలోనే అతను వ్యాపార రంగంలోకి అడుగుపెట్టాడు. 'జార్జి ఫోర్మన్ గ్రిల్‌'ను మార్కెట్‌లోకి తీసుకొచ్చాడు. అనవసరమైన కొవ్వును తగ్గించేలా బ్రెడ్డు, బన్నును రోస్ట్ చేసే ఈ గ్రిల్ అనూహ్య విజయం సాధించింది. బాక్సింగ్ కెరీర్ మొత్తంలో సంపాదించనంత మొత్తం అతను ఒకటిరెండు సంవత్సరాల్లోనే ఆర్జించాడు. వ్యాపారవేత్తగా జీవితం సుఖంగా సాగుతున్న సమయంలోనే, ఎవరూ అనుకోని విధంగా మళ్లీ బాక్సింగ్ రింగ్‌లోకి అడుగుపెట్టాడు. సుమారు 20 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత, 1994లో, తన కంటే 19 సంవత్సరాలు చిన్నవాడైన మైఖేల్ మూరర్‌తో తలపడ్డాడు. 45 ఏళ్ల వయసులోనూ తన పంచ్ బలం తగ్గలేదని నిరూపిస్తూ, మూరర్‌ను ఓడించి, హెవీవెయిట్ టైటిల్ అందుకున్నాడు. 1997లో, 'రంబుల్ ఇన్ ది జంగిల్' ఫైట్ జరిగిన అక్టోబర్ 30వ తేదీన మహమ్మద్ అలీతో ఫోర్మన్ తలపడ్డాడు. ఆ ఫైట్‌ను కోల్పోయి, రిటైర్మెంట్ ప్రకటించాడు. మొత్తం మీద కెరీర్‌లో 81 ఫైట్స్‌లో పాల్గొన్న ఫోర్మన్ 76 విజయాలు సాధించాడు. వాటిలో 68 (89.5 శాతం) నాకౌట్ ద్వారా గెలిచినవే కావడం విశేషం. కేవలం ఐదు ఫైట్స్‌ను మాత్రమే కోల్పోయిన ఫోర్మన్ ఈనెల 21వ తేదీన తన 76వ ఏట తుదిశ్వాస విడిచాడు. అత్యంత బలమైన పంచ్‌లు విసిరే బాక్సర్లలో ఒకడిగా పేరుతెచ్చుకున్న ఫోర్మన్, ఆల్‌టైమ్ గ్రేట్ బాక్సర్స్ 'టాప్ 25'లో తొమ్మిదో స్థానాన్ని ఆక్రమించాడు. తన 12 మంది పిల్లల్లో ఐదుగురికి 'జార్జి ఫోర్మన్' అంటూ తన పేరే పెట్టడంతో అతను ఓ విలక్షణమైన వ్యక్తి అనే విషయం మరోసారి రుజువైంది.

## ప్రతిభావంతుల క్రీడ 'బ్యాండీ'




అత్యంత నైపుణ్యంగల ప్రతిభావంతుల క్రీడగా పేర్కొనే బ్యాండీ ప్రపంచ చాంపియన్‌షిప్స్ స్వీడన్ వేదికగా ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకూ అభిమానులను అలరించనున్నాయి. ఐస్ స్కేటింగ్‌ను, ఐస్ హాకీని కలిపితే 'బ్యాండీ' అవుతుంది. ఇది శీతాకాలపు క్రీడ. బ్యాండీ ఫీల్డ్ లేదా బ్యాండీ రింక్ అని పిలిచే ఈ ఆట, 90–110 మీటర్లు (300–360 అడుగులు) పొడవు, 45–65 మీటర్లు (148–213 అడుగులు) వెడల్పుగల రింక్ (మంచుపలక)పై ఆడతారు. ఈ మైదానం సాధారణ ఐస్ హాకీ కంటే పెద్దదిగా ఉంటుంది. బ్యాండీ క్రీడను ఐస్ స్కేటింగ్, ఐస్ హాకీతోపాటు, అసోసియేషన్ ఫుట్‌బాల్, షింటి ఆటల నుంచి కూడా కొన్ని అంశాలను తీసుకొని అభివృద్ధి చేశారు. బ్యాండీ మొట్టమొదట ఎక్కడ ప్రారంభమైందనే విషయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, దీనిని 'రష్యన్ హాకీ' అని కూడా పిలుస్తారు కాబట్టి, మూలాలు రష్యాకు చెందినవిగా కొంత మంది పేర్కొంటున్నారు. అయితే, బ్యాండీకి సంబంధించిన నియమనిబంధనలకు 1882లో తొలిసారి ఇంగ్లాండ్‌లో, బరీ ఫెన్ బ్యాండీ క్లబ్‌కు చెందిన చార్లెస్ గుడ్‌మాన్ టెబ్బట్ ఒక రూపాన్నిచ్చాడు. మొట్టమొదటి అంతర్జాతీయ బ్యాండీ మ్యాచ్ 1891లో ఇంగ్లాండ్‌క చెందిన బరీ ఫెన్, నెదర్లాండ్స్‌కు చెందిన హార్లెంషే క్లబ్‌ల మధ్య జరిగింది. స్వీడన్, రష్యా చాలాకాలంగా ఈ క్రీడలో క్రమం తప్పకుండా ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడుతున్నాయి. రష్యాలో, పది లక్షలకు పైగా ప్రజలు బ్యాండీ ఆడుతున్నారని అంచనా. ఫిన్లాండ్, నార్వే, కజకస్థాన్, హంగరీ, అమెరికా వంటి దేశాల్లోనూ ఇది ప్రాచుర్యం పొందింది. ఎప్పటి మాదిరిగానే ఈసారి కూడా ప్రపంచ చాంపియన్‌షిప్స్‌ను పురుషులు, మహిళల విభాగాల్లో నిర్వహిస్తున్నారు. ఈ క్రీడకు 19వ శతాబ్దం చివరిలో వ్యవస్థీకృత విధానం ఏర్పడింది. కానీ, 1955 వరకు అంతర్జాతీయ స్థాయిలో అధికారిక పాలక మండలి లేదు. ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ బ్యాండీ (ఎఫ్ఐబి) 1955 ఫిబ్రవరిలో ఏర్పడడంతో, ఈ క్రీడకు సాధికారత లభించింది. 2001లో బ్యాండీని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఒసి) ఒక క్రీడగా గుర్తించింది. అప్పటి నుంచి మరింత ఆదరణ పొందిన బ్యాండీ ఇప్పుడు ఐస్ హాకీ తర్వాత ప్రపంచంలోనే అత్యధికంగా ఆడే రెండో శీతాకాలపు క్రీడగా గుర్తింపు సంపాదించింది. అయితే, ఐస్ హాకీ, బ్యాండీ క్రీడల మధ్య చెప్పుకోదగిన తేడా లేకపోవడంతో, చాలా మంది రెండూ ఒకటేనని అభిప్రాయపడుతుంటారు. అందుకు కారణం లేకపోలేదు. 1920 దశకం ముందు వరకూ బ్యాండీ, ఐస్ హాకీ మధ్య స్పష్టమైన వ్యత్యాసం లేదు. ఒక విధంగా బ్యాండీని ఐస్ హాకీకి పూర్వగామిగా చూడవచ్చు. ఐస్ హాకీ అభివృద్ధికి బ్యాండీయే కారణం. ఐరోపా దేశాలతోపాటు, పూర్వ సోవియట్ యూనియన్ దేశాల్లోనూ ఐస్ హాకీ విస్తారంగా ఆడడానికి బ్యాండీ పునాదులు ఉపయోగపడ్డాయి. ఆధునిక ఐస్ హాకీ కెనడాలో ప్రారంభమైనప్పటికీ, 19వ శతాబ్దం చివరలో బ్రిటిష్ సైనికులు బ్యాండీ ఆటను ప్రవేశపెట్టిన తర్వాత పరిస్థితులు మారాయి. బ్యాండీతో దగ్గరి పోలికలు ఉన్న ఆటలు కెనడాలో అభివృద్ధి చెందాయి. ఆధునిక ఐస్ హాకీ నియమాలను అధికారికంగా గుర్తించిన సమయంలోనే, యూరోప్‌లో బ్యాండీ నిబంధనలను ఖరారు చేయడం గమనార్హం. 20వ శతాబ్దం ప్రారంభలో కెనడియన్లు ఐస్ హాకీని ఐరోపాలో ప్రవేశపెట్టడానికి ముందు, బ్యాండీనే హాకీగా పిలిచేవారు. ఇప్పటికీ రష్యా, కజకస్థాన్ తదితర దేశాల్లో బ్యాండీని హాకీగానే పిలుస్తారు. బ్యాండీని ఆడే రింక్ నుంచి వాడే సామాగ్రి వరకూ అన్నీ ఐస్ హాకీ కంటే కొంత భిన్నంగా ఉంటాయి. అయితే, ఈ క్రీడతో పరిచయం అంతగా లేనివారు, రెండూ ఒకటేనని భ్రమపడే అవకాశాలు లేకపోలేదు.



### ఒలింపిక్స్‌లో క్రికెట్!

క్రికెట్‌ను ఒలింపిక్ క్రీడల జాబితాలో చేర్చాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. అంతర్జాతీయ ఒలింపిక్ మండలి (ఐఒసి) ఎట్టకేలకు ఈ డిమాండ్‌కు సానుకూలంగా స్పందించిందని, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో టి20 ఫార్మట్‌లో క్రికెట్‌కు అనుమతించిందని సమాచారం. అధికారికంగా ఇంకా ఈ విషయాన్ని ఐఒసి ప్రకటించలేదు. అయితే, గతంలో



ఒకసారి క్రికెట్ ఒలింపిక్ క్రీడగా అరంగేట్రం చేసింది. 1900 పారిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు కల్పించారు. కేవలం రెండు జట్లు (బ్రిటిష్, ఫ్రెంచ్) మాత్రమే తలపడ్డాయి. ఫ్రాన్స్ మీద బ్రిటన్ గెలిచింది. నిజానికి ఫ్రాన్స్ తరఫున ఆడేందుకు స్థానిక క్రికెటర్లు ఎవరూ లేరు. ఆ సమయంలో పారిస్‌లో నివాసం ఉంటున్న బ్రిటిషర్లతో ఫ్రెంచ్ జట్టును సిద్ధం చేశారు. కానీ, క్రికెట్ పుట్టినిల్లుగా భావించే బ్రిటన్ చేతిలో పరాజయం తప్పలేదు.

### చెత్త బ్యాటింగ్..

ఫార్మట్ ఏదైనా, సాధారణంగా బౌలర్లు టెయిలెండర్లుగా ఉంటారు. వారి నుంచి గొప్ప బ్యాటింగ్‌ను ఆశించలేం. అయితే, చాలా మంది బౌలర్లు కొద్దో గొప్పో పోరాటం సాగించి, ఎన్నోకొన్ని పరుగులు చేశారు. కానీ, న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ క్రిస్ మార్టిన్ అత్యంత పేలవమైన సగటుతో, చెత్త బ్యాటింగ్ రికార్డు నమోదు చేశాడు. 71 టెస్టు మ్యాచ్‌లు ఆడిన అతను 7,878 పరుగులిచ్చి, 233 వికెట్లు పడగొట్టాడు. 20 వన్డే ఇంటర్నేషనల్స్‌లో 18 వికెట్లు, 6 టి20 మ్యాచ్‌ల్లో 6 చొప్పున వికెట్లు అతని ఖాతాలో ఉన్నాయి. బౌలింగ్ కొంత మెరుగ్గానే ఉన్నప్పటికీ, బ్యాటింగ్‌లో మాత్రం అతను దారుణంగా విఫలమయ్యాడు. 71 టెస్టుల్లో కేవలం 123 పరుగులు చేశాడు. అత్యధిక స్కోరు 12 నాటౌట్. సగటు 2.36 పరుగులు. అత్యధిక స్కోరు చేసిన ఇన్నింగ్స్‌లో నాటౌట్‌గా నిలవకపోతే, అతని బ్యాటింగ్ సగటు మరింత పతనమై ఉండేది. 20 వన్డే ఇంటర్నేషనల్స్‌లో 8 పరుగులు చేసిన అతను 6 టి20 ఇంటర్నేషనల్స్‌లో 5 పరుగులతో సరిపుచ్చుకున్నాడు. ఇంతకు మించిన చెత్త బ్యాటింగ్ రికార్డును బహుశా మరెవ్వరూ నెలకొల్పరేమో!



## భవన నిర్మాణ కార్మికులకు మీ సేవలో వేలిముద్ర విధానాన్ని రద్దు చేయాలి


### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం:** భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో నమోదు చేయుటకు మీ సేవలో ఏర్పాటు చేసిన వేలిముద్ర విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నారాయణపురం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీ జనరల్ బాడీ సమావేశం కోప్పు సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డు ఈ రోజు సమస్యల నిలయముగా మారిందని ఆరోపించారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఎఐటియుసి నిరంతరం అండగా నిలిచి పోరాడుతుందన్నారు. గత కొన్ని నెలలుగా కార్మికులకు డబ్బులు ఇవ్వడం లేదని ఆన్లైన్లో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పరిష్కరించడంలో లేబర్ డిపార్ట్మెంట్ వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఆన్లైన్ అప్డేట్ పేరుతో కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు దుబ్బాక సంజీవ, ప్రధాన కార్యదర్శి చిలువేరు అంజయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సుక్క యాదయ్య, బోయ శంకరయ్య, జనగాం శంకరయ్య, సిరుపంగి గాలయ్య, గోల్లూరి సత్యనారాయణ, ఈద మల్లయ్య, కందుల మోహన్, దుబ్బాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి భవిష్యత్తుకు కార్మికులపక్షాన పోరాటం

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/ కాసిపేట :** సింగరేణి భద్రత, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎఐటియుసి రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. శనివారం మందమర్రి ఏరియా కాసిపేట 2వ గనిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశానికి గొల్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా 27మంది కార్మికులు ఎఐటియుసిలో చేరారు. యూనియన్‌లో చేరిన వారిని వాసిరెడ్డి సీతారామయ్య, చిప్ప. నరసయ్య, దాగం మల్లేష్‌లు కలిసి కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణిలో కొత్త బావులు రాకపోవడం వల్ల యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, కంపెనీ ఆర్థిక స్థితిని మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభు త్వం వెంటనే రూ.35 వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగి, గత ప్రభుత్వాల నుంచి రావాల్సిన బకాయిలు అందకపోవడం సంస్థ ఆర్థిక పరిస్థితిని దెబ్బతీసిందని ఆరోపించారు. ఓపెన్‌కాస్ట్ (ఒసి) మైనింగ్ పనులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, సింగరేణి యాజమాన్యమే ఈ పనులు నిర్వహించాలంటూ ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. సింగరేణి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క్‌ను కలిసి సింగరేణికి రావాల్సిన నిధుల అంశాన్ని ప్రస్తావించామని, అలాగే కేంద్ర బొగ్గు సహాయ మంత్రి కిషన్ రెడ్డిని కలిసి కొత్త బావులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. డైరెక్టర్, సిఎండి స్థాయి సమావేశంలో 14 డిమాండ్లపై చర్చ జరిగిందని, కోల్ ఇండియా వేజ్ బోర్డులో లేని 11అలవెన్సులను అమలు చేయాలని, పెర్క్స్‌పై ఇన్‌కమ్ టాక్స్ తగ్గించాలని, సొంత ఇంటి నిర్మాణానికి రూ.30 లక్షల వడ్డీ లేని హౌసింగ్‌లోన్ అందించాలని డిమాండ్ చేశామని వెల్లడించారు. మైనింగ్ అండ్ టెక్నికల్ విభాగాల్లో ఉద్యోగులకు సూటబుల్ జాబ్ కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని, డిస్మిస్ అయిన కార్మికులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని అన్నారు. కొత్తగా ఉద్యోగం పొందే వయస్సు 35 నుండి 40 సంవత్సరాలకు పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో బియ్యాల వెంకటస్వామి, బొద్దుల వెంకటేష్, వర్క్‌మెన్ ఇన్స్పెక్టర్‌లు సుభాష్ చంద్రబోస్, రాజ్‌కుమార్, కొమురయ్య, నర్సిరెడ్డి, తిరుపతి, అంజి, శివ, సాగర్, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ

### ప్రజా సంఘాల సమావేశంలో బాగం పిలుపు



**ప్రజాపక్షం/ఖమ్మం :** సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల మండల, జిల్లా మహాసభల ను సకాలంలో పూర్తి చేయాలని ఆయన కోరారు. ప్రజా సంఘాల జిల్లా బా ధ్యులు, పట్టణ, నగర కార్యదర్శుల సంయుక్త సమావేశం శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. శింగు నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి ప్రజా సం ఘాల నిర్మాణం చేపట్టాలన్నారు. ఏప్రిల్ చివరి నాటికి అన్ని ప్రజా సంఘాల మహాసభలను పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది సిపిఐ శత వసంత ఉత్సవాలు జరుగుతున్నాయని శత వసంత ఉత్సవ జాతీయ స్థాయి ముగింపు సభ ఖ మ్మంలోనే జరగనున్నందున పార్టీ మహాసభలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామస్థాయిలో సమస్యలను గుర్తించి సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రైతుల, వ్యవసాయ కార్మికుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని పాలకులు గ్రామీణ ప్రాంత సమస్యలపై దృష్టి సారించడం లేదన్నారు. యువజన విద్యార్థులు పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కూలీల సమస్యలపై నిర్లక్ష్యం



**ప్రజాపక్షం/ హనుమకొండ :** కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీల సమస్యల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నదని, స్వాతంత్రం వచ్చిన 77 ఏళ్ల తర్వాత కూడా ఉండడానికి ఇండ్లు, బ్రతుకుదెరువుకు భూమి లేని పేదలు కోట్లాదిమంది ఉన్నారని, ఇది అత్యంత ఘోరమైన విషయమని, దీన్ని దృష్టిలో ఉంచుకొని పేదరికం రూపుమాపాల్సిన కేంద్ర ప్రభుత్వం రోజురోజుకు గ్రామీణ పేదలకు బడ్జెట్ కేటాయింపుల్ని తగ్గించడమే కాకుండా అంతో ఇంతో ఉపయోగపడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ను నిర్వీర్యం చేస్తున్నదని వెంకట్ రాములు అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలో గల తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో మునిగాల బిక్షపతి అధ్యక్షతన జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంకా ఆయన మాట్లాడుతూ ధనవంతులకు ము ఖ్యంగా కార్పొరేట్లకు అనేక రాయితీలు ఇవ్వడమే కాకుండా వాళ్లకు బ్యాం కులు ఇచ్చిన లక్షల కోట్ల రుణాలను సైతం ఒకపక్క మాఫీ చేస్తూ ప్రభుత్వం పేదల పట్ల అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. అనేక దశాబ్దాల పోరాట ఫలితంగా సాధించుకున్న కొద్దో గొప్పో హక్కులను కేంద్రం కాలరాసే ప్రయత్నం చేస్తే అనుభవం ఉన్న కార్మిక వర్గం పదునైన పోరాటాలు చేసి ప్రభుత్వం మెడలు వంచక తప్పదని హెచ్చరించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మ ణ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏదునూరి వెంకటరాజం, సహాయ కార్యదర్శి బొట్టు బిక్షపతి, నాయకులు గోకల రాజయ్య, పసునూరి సునీల్, కొట్టె పాక రవి, జూపాక రవి, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

### గత గుర్తింపు సంఘం టిబిజికెఎస్

## పైరవీలకు పరిమితమా?

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** గత గుర్తింపు సంఘంగా ఉన్న టిబిజికెఎస్ కేవలం పైరవీలకు మాత్రమే పరిమితమయ్యారని, కార్మిక సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. భూపాలపల్లి ఏరియాలో కెటికె 1 ఇంక్లైన్‌లో ఫిట్ సెక్రెటరీ ఎ. సదయ్య ఆధ్వర్యంలో కెటికె 1 ఇంక్లైన్‌లో గేట్ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్ట్రక్చర్ మీటింగ్‌లో జరిగిన అంశాలను కార్మికులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా గుర్తింపు సంఘంగా టిబిజికెఎస్ కార్మిక సమస్యలపై ఒక స్ట్రక్చర్ మీటింగ్ కూడా నిర్వహించలేదని ఆరోపించారు. కేవలం రాజకీయాలతో వారి పైరవీలకు మాత్రమే పరిమితం అయ్యారని అన్నారు. ఇటీవల జరిగిన సింగరేణి సిఅండ్ఎండి ఆధ్వర్యంలో గుర్తింపు సంఘంగా స్ట్రక్చర్ కమిటీ మీటింగ్‌లో పెర్క్స్‌పై ఇన్కమ్ టాక్స్, మారుపేరులకు సంబంధించిన విషయాలను స్ట్రక్చర్ మీటింగ్లో చర్చించడం జరిగిందన్నారు. సింగరేణికి కొత్త గనులకు రాకుంటే మనుగడ ప్రమాదం అని నూతన గనుల సంబంధించిన విషయాలను, కార్మిక సోదరుల చిరకాల కోరిక సొంటి పథకం, కార్పొరేట్ హాస్పిటల్స్ సింగరేణి సంస్థ నిర్వహించాలని, డిస్మిస్ కార్మికులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని, కార్మికులకు సంబంధించిన 14డిమాండ్లను సిఅండ్ఎండి ముందు చర్చించి వాటిని తక్షణమే పరిష్కరించాలని కోరడం జరిగిందని తెలిపారు. స్ట్రక్చర్ మీటింగులో జరిగిన సమస్యలపై సిఅండ్ఎండి సానుకూలంగా స్పందించారని త్వరలోనే అనేక సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. గత పది సంవత్సరాలలో గుర్తింపు సంఘం ఉన్న టిబిజికెఎస్ ఒక్క స్ట్రక్చర్ మీటింగ్ నిర్వహించలేదని, మేము గుర్తింపు సంఘంగా గెలవగానే కార్మికుల కోసం అనునిత్యం పోరాడీ సమస్యలను పరిష్కరించి హక్కులను కాపాడే ఏకైక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) మాత్రమేనని ఉద్ఘాటించారు. అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జి.శ్రీనివాస్, గురుజపెల్లి సుధాకర్ రెడ్డి, ఎండి.ఆసిఫ్ పాష, ఆర్గనైజింగ్ సెక్రటరిలు బి కొమరయ్య, జి.ఐలయ్య, రాజయ్య, వర్క్ మెన్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, నరేష్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ ఎండి.హైమద్ ఖాన్, షిఫ్ట్ ఇన్‌చార్జులు, మైన్స్ కమిటీ సభ్యులు, సేఫ్టీ కమిటీ సభ్యులు, గుడి కమిటీ చైర్మన్ నరసయ్య,క్యాంటీన్ కమిటీ, సీనియర్ నాయకులు కార్యకర్తలు, కార్మిక సోదరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ధర్నాలు చేస్తేతప్ప వేతనాలు ఇవ్వరా?

### ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎఐటియుసి కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/ నల్లగొండ :** మిషన్ భగీరథ కార్మికులు ప్రతిసారి ధర్నాలు చేస్తే తప్ప వేతనాలు ఇవ్వరా అని మిషన్ భగీరథ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం ఎఐటియుసి ఆధ్వర్యంలో మిషన్ భగీరథ ఎస్ఇ నాగేశ్వరావుకి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత 8 నెలలుగా వేతనాలు లేక కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలి చాలని వేతనాలతో జీవితాలు గడుపుతున్న మిషన్ భగీరథ కార్మికులు నెలల తరబడి వేతనాలు లేకపోతే ఏ విధంగా బతకాలని ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలతో పోలిస్తే వారికి వచ్చే జీతాలు ఏమాత్రం సరిపోవట్లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మిషన్ భగీరథ కార్మికుల గురించి ఆలోచన చేయకపోవడం బాధాకరమని అన్నారు. ప్రతినిత్యం ప్రజలకు తాగునీరు అందిస్తూ ప్రజలను కాపాడుతున్నటువంటి కార్మికుల కుటుంబాల్ని కాపాడడంలో కాంట్రాక్టర్లుయా జమాన్యం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. కనీస వేతన చట్టాలు అమలు చేయకుండా కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యాగ వ్యవహరిస్తున్నారని నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా కార్మికులచే పనిచేయిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. జీవిపిర్ రాఘవ కంపెనీలు కార్మికుల కనీస హక్కులను హరించి వేసే విధంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. వచ్చే వేసవి దృష్టిలో ఉంచుకొని రాత్రి పగలు కష్టపడుతున్న కార్మికులు పస్తులు ఉంటూ పని ఏ విధంగా చేయాలని ప్రశ్నించారు. తక్షణమే పెండింగ్ వేతనాలు విడుదల చేయకపోతే విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేపట్ట వలసి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి జానీ, పాక శ్రీను, ప్రవీణ్ రెడ్డి, శంకర్, నాగరాజు, సత్తయ్య, బాల రాజు, సైదులు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## 10,954 జిపిఒ పోస్టులకు పభుత్వం గ్రీన్ సిగ్నల్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినహామీలను నిలబెట్టుకుంటూ జిఒ నెం.41 ద్వారా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 10 ,954 గ్రామ పాలన ఆఫీసర్ పోస్టులను మంజూరు చేస్తూ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం రెవెన్యూ వ్యవస్థలో సరి కొత్త అధ్యయనానికి నాంది పలికిందని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు శనివారం తెలిపారు. రాష్ట్రంలో ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక గ్రామపాలన అధికారిని నియమించడం రాష్ట్రంలో రెవెన్యూ ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ది రుజువు చేస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జిఒనెం.41తో విఆర్ఒలు చిన్నాభిన్నమై చెట్టుకొక రు పుట్ట కొకరు విసిరివేయబడ్డారన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ గ్రామపాలన అధికారుల పోస్టులుమంజూరు చేయడం హర్షణీయమన్నారు. ఇందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ , రెవెన్యూ ఉద్యోగుల జెఏసి ఛైర్మన్ లకి గరికె ఉపేంద్రరావు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

## అడిషనల్ మేనేజర్ సేవలు అభినందనీయం




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** జెవిఆర్ ఒసి అభివృద్ధికి గత ఎనిమిది ఏళ్ళుగా సేవలందించిన అడిషనల్ మేనేజర్ గౌతమ్ రాజేష్ రెడ్డి సేవలు అభినందనీయమని కొనియాడారు ఎఐటియుసి నాయకులు. శనివారం బదిలీపై బెల్లంపల్లి డివిజన్ కైరిగూడకు వెళుతున్న అడిషనల్ మేనేజర్ గౌతమ్ రాజేష్ రెడ్డిని ఎఐటియుసి సింగరేణి కాలర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ విధి నిర్వహణలో కార్మికులతో మమేకమై, అందరితో కలుపుగోలుగా ఉంటూ అధికోత్పత్తికి ఎంతగానో కృషి చేశారని, గౌతం రాజేష్ రెడ్డి బదిలీపై వెళ్ళడం చాలా బాధాకరమైన విషయమని ఎఐటియుసి నాయకులన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దారా భీమయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి సూర్యప్రకాశరావు, ఫిట్ కార్యదర్శి జి. నరసింహారావు, అఫ్జల్, భాస్కర్ లాల్, తిరుపతి, శ్రీధర్ మరియు పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులకు అంతా హాజరుకండి : కలెక్టర్




**ప్రజాపక్షం/భద్రాచలం:** ఉపాధి పథకం క్రింద చేపడుతున్న పనులకు అంతా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున పనులు జరుగుతున్నాయని, పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసేందుకు పెద్దఎత్తున కూలీలు కావాల్సి ఉందన్నారు. నేటి నుండి వారం రోజుల పాటు వేగవంతంగా పనులు పూర్తిచేయాల్సి ఉందని చెప్పారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అధికారులంతా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని వారివారి భూముల్లో ఫామ్‌పాండ్ నిర్మాణాలు చేపట్టాలని సూచంచారు. బోరు ద్వారా వ్యవసాయం చేసే ప్రతీ రైతు వ్యవసాయ భూముల్లో నీటి గుంటల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ఆవుల పుల్లమ్మ మృతిపట్ల సిపిఐ సంతాపం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం కొండాయిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవుల సర్వేశ్వరరావు మాతృమూర్తి ఆవుల పుల్లమ్మ మృతిచెందారు. ఆమె మరణ వార్త తెలియగానే సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య, పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, సీపీఐ నాయకులు నోముల రవి, మామిడిపల్లి శ్రీనివాసరావు తదితరులు హాజరై పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు పరిశీలన

**ప్రజాపక్షం/ఖమ్మం,క్రైం :** ప్రశాంత వాతావరణంలో పదవ తరగతి పరీక్షలు నిర్వహించేందుకు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తును పోలీసు కమంషనర్ ఆదేశాల మేరకు అడిషనల్ డిసిపి లా అండ్ ఆడర్ ప్రసాదరావు శనివారం పరిశీలించారు. నగరంలోని 97 పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలులో ఉన్నందున కేంద్రాల సమీపంలో ఉన్న ఇంటర్‌నెట్, జిరాక్స్, స్టేషనరీ దుకాణాలు తెరిచిఉంటే వాటిని పరీక్ష సమయంలో మూసివేయించాలని అక్కడి పోలీసు అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ సిబ్బందికి సూచించారు. పరీక్ష సమయంలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, డిజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించకుండా పోలీసు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. నిబంధనలకు విరుద్దంగా వ్యవహరించే వారిపై కేసులు నమోదు చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు.

## మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 47వ డివిజన్‌లో మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు జాకీర్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో దానం చేయడం ప్రతి ఒక్క ముస్లిం ధర్మమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, ఎస్‌కె యూసఫ్, ఘంటసాల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలి

ఐటిడిఎ పిఒ రాహుల్



**ప్రజాపక్షం/భద్రాచలం:** ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజన యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. శనివారం ఐటిడిఏ ప్రాంగణంలోని జయదుర్గ సహిత పంచముఖ విశ్వేశ్వర స్వామి దేవాలయం ఎదుట నెలకొల్పిన శ్రీ దుర్గాభవాని సెంట్రింగ్ బ్రిక్స్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ నిరుద్యోగులైన గిరిజన యువతీ యువకులు రూ.25 లక్షల వ్యయంతో రూ.15 లక్షల సబ్సిడితో సెంట్రల్‌బ్రిక్ యూనిట్‌ను యువత కలిసి కట్టుగా జీవనోపాధి కోసం యూనిట్ నెలకొల్పుకోవడం ఆనందంగా ఉందన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు యూనిట్ ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. కావాల్సిన ముడిసరుకును తక్కువకు కొనుగోలు చేసి మన్నికగల సరుకును తయారు చేసి విక్రయించాలని సూచించారు. అనంతరం సిమెంట్ ఇటుకలు తయారు చేసే యూనిట్, సామాగ్రిని ఆయన పరిశీలించి ఇటుకలు రవాణా చేసే వాహనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సహాయప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, జేడిఎం హరికృష్ణ, యూనిట్ సభ్యులు రాజు, వెంకటమ్మ, మహేశ్వరి, నాగరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహితంగా ఖమ్మం కలెక్టరేట్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రానున్న రెండు వారాల్లో సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శనివారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి , శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్టలతో కలిసి పరిపాలనకు సంబంధించి వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే వారం నుంచి గర్ల్ ప్రైడ్ పర్యటనలు ప్రారంభం కావాలన్నారు. ఖమ్మంజిల్లాలో ఆడపిల్లలు పుట్టిన ఇండ్లకు జిల్లా అధికారులు వెళ్తారని, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపి స్వీట్ బాక్స్, జిల్లా యంత్రాంగం తరుపున చిన్న సందేశం అందించి రావాలన్నారు. ఆడపిల్లలు పుట్టిన ఇండ్లకు జిల్లా అధికారులు వెళ్లేందుకు వీలుగా షెడ్యూల్ జిల్లా సంక్షేమ అధికారి తయారు చేసి ప్రతి జిల్లా అధికారికి చేరవేయాలని కలెక్టర్ సూచించారు. అమ్మాయిలు ఇంట్లో పుట్టడం అదృష్టమనే భావన ప్రజల్లో వెళ్లేలా ఈ కార్యక్రమం జరగాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం సంబంధించి జిల్లా అధికారులు ప్రభుత్వ పాఠశాలలను రెగ్యులర్‌గా సందర్శిస్తున్నారని కలెక్టర్ అభినందించారు. భోజన నాణ్యతకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, క్షేత్ర స్థాయి పరిస్థితులపై అధికారుల ఫీడ్‌బ్యాక్ తీసుకునేందుకు త్వరలోనే సమావేశం నిర్వహిస్తామన్నారు. పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో ప్రతి రోజు సాయంత్రం జిల్లా అధికారులు విద్యార్థుల ఇంటికి వెళ్లి విద్యార్థి పరీక్షల సన్నద్ధతను గమనించాలని వారి తల్లిదండ్రులతో ఇంటరాక్ట్ అవుతూ విద్యార్థికి నాణ్యమైన ఆహారం అందించడం, ఒత్తిడి లేకుండా ఉండటం వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఖమ్మం సమీకృత కలెక్టరేట్‌ను ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని క్యాంటీన్‌లో కూడా ప్లాస్టిక్ కాకుండా స్టీల్ వస్తువులు మాత్రమే వాడాలన్నారు.ప్రభుత్వ సమావేశాల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను నిషేధించాలని కలెక్టర్ తెలిపారు. మండలాల్లో తహసీల్దార్, ఎంపిడివో కార్యాలయాల్లో కూడా ప్లాస్టిక్ నివారణకు ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. రాబోయే రెండు వారాల్లో ప్రభుత్వ సిబ్బందికి రెండోసారి హెల్త్ చెకప్ ఉంటుందన్నారు. క్రచ్ సెంటర్‌లో వేసవి దృష్ట్యా ఏసి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఖమ్మం ఆసుపత్రి ఎదురుగా వాల్ ఆఫ్ కైండ్‌నెస్ ఏర్పాటు చేశామని జిల్లా అధికారులు కూడా పరిశీలించి దీనిపై స్టాఫ్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిసిఇఒ దీక్షా రైనా, డిఆర్ఒ ఎ. పద్మశ్రీ, కలెక్టరేట్ ఎఒ, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యాలను పెంచేందుకు 'స్కిల్ హబ్'

యువతకు శిక్షణతో పాటు ఉపాధి
స్కిల్‌హబ్‌ను సందర్శించిన కలెక్టర్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని యువత నైపుణ్యతను పెంచేందుకు స్కిల్‌హబ్ ఉపయోగపడుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శనివారం ఖమ్మం రేవతి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్‌ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ , ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్టలతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కిల్‌హబ్‌లో అందించాల్సిన శిక్షణకు విద్యార్థిని, యువత ఎంపిక, మార్గదర్శకాలను నిర్దేశించడం కోసం కమిటీ ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పదవ తరగతి, ఇంటర్ తర్వాత ఆసక్తి చూపే పిల్లలకు ఆంగ్లంలో మాట్లాడటం, కోడింగ్‌లో బేసిక్స్ నేర్పించేందుకు వీలుగా స్కిల్‌హబ్‌లో కోడింగ్ ల్యాబ్, ఇంగ్లీష్ లెర్నింగ్ యాప్ లను ఏర్పాటు చేశామన్నారు. క్లాస్ ఫోర్ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు ఉచితంగా కోర్సులు శిక్షణ అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.కోర్సులలో శిక్షణ అందించడంతో పాటు సంబంధిత యువతకు ఉపాధి లభించేలా సహాయంఅందిస్తామన్నారు.సమ్మర్‌హాలీడేస్ సందర్భంగా పిల్లలకు కూడా శిక్షణ అందించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. కోడింగ్, ట్యాలీ, పైథాన్, మైక్రోసాఫ్ట్, ఆంగ్ల భాష, కమ్యూనికేషన్ స్కిల్స్‌లలో శిక్షణ అందిస్తూ విద్యార్థులకు సర్టిఫికెషన్ అందే దిశగా కోర్సుల రూపకల్పన జరగాలన్నారు. స్కిల్‌హబ్ లో మంచి నైపుణ్యం గల సిబ్బందిని నియమించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, జెడ్‌పి సిఇఒ దీక్షారైనా, కార్పొరేటర్ చంద్రకళ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారానికి చలో ఢిల్లీ




**ప్రజాపక్షం/భద్రాచలం:** నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, ఇందుకోసం ఈనెల 28న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాకు పెద్ద ఎత్తునహాజరై జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వేర్పుల మల్లిఖార్జున్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం చర్ల సిపిఐ కార్యాలయంలో గంజి మాల్యాద్రి అధక్షతన జరిగిన మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డు పథకాల లబ్ధిదారులకు థ ంబ్ సిస్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వివాహ కానుక, ప్రసూతి సహాయం రూ.1 లక్ష పెంచాలని, సహజ మరణానికి ఇన్సూరెన్సు రూ. 10 లక్షలు పెంచాలని, సంక్షేమ బోర్డు నిధులు కార్మికుల సంక్షేమం కోసమే వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య ల పరిష్కారాన్ని కోరుతూ ఈ నెల 28న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించతలపెట్టిన మహాధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు అనీల్, రమణ, మహేష్ ,రవి ,తిరుపతి, సత్యనారాయణ, రాంబాబు,రాజు,తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐటిలో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై సదస్సు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. శనివారం కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఖమ్మం ఏసిపి ఎన్. వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో యువత మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి, విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడానికి సాధనంగా ఉండే మొబైల్‌ను భవిష్యత్తుకు ఉపయోగించుకోండా ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల ద్వారా పలు వ్యసనాలకు లోనవుతున్నారని ఆయన తెలిపారు. విద్యార్థులు కష్టపడి తమ విలువైన సమయాన్ని చదువుల కోసం వెచ్చించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలన్నారు. కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువత తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాశతో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల వ్యసనాలకు లోనై ఆర్థిక నష్టాలతో మానసిక ఒత్తిడికి గురై తమ విలువైన జీవితాన్ని నష్టపర్చుకుంటున్నారన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు ఆకర్షణకు గురికాకుండా విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కరస్పాండెంట్ ధాత్రి మాట్లాడుతూ బెట్టింగ్ యాప్‌లు ఆకర్షణీయంగా కనిపించినా దాని వెనక ఉన్న నష్టాన్ని దాని ప్రభావం ఎంత తీవ్రమైందో గుర్తించాలన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్తును సంరక్షించుకోవాలని ఆమె తెలిపారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ విద్యార్థులతో బెట్టింగ్, గేమింగ్ యాప్‌లకు దూరంగా ఉండి తోటి స్నేహితులకు అవగాహన కల్పిస్తూ సమాజశ్రేయస్సు, దేశ భవిష్యత్తుకు తోడ్పాడతామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏసిపి వెంకటేష్‌కు కళాశాల సిబ్బంది మెమోంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## 'సదరం' క్యాంపులో వసతుల కల్పన

నిర్ధారణ పరీక్షల తర్వాత యుడిఐడి కార్డు
సదరం క్యాంపు ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సదరం క్యాంపు నిర్వహణ సమయంలో దివ్యాంగులకు అవసరమైన వసతులను కల్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శనివారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సదరం క్యాంపుల కోసం జిల్లా ప్రధాన ఆసుపత్రి వద్ద చేయాల్సిన ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట లతో కలిసి పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు అందించే యుడిఐడి కార్డులు మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా ఉపయోగపడతాయని తెలిపారు.నూతనంగా యుడిఐడి కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు ఆసుపత్రిలో నిర్ధారణ పరీక్ష కోసం సదరం స్లాట్ బుకింగ్ చేసి సమాచారం అందించాలన్నారు. దివ్యాంగులు నిర్ధారణ పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చినప్పుడు వారికి అవసరమైన వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో వికలాంగత్వం నిర్ధారణ కోసం అవసరమైన వైద్యులు, పరికరాలు ఉండేలా చూడాలని, క్యాంపు సమయంలో దివ్యాంగులకు రిసెప్షన్ సెంటర్, కుర్చీలు, నీడ కోసం ఏర్పాటు, త్రాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంప్ వంటి వసతులు కల్పించాలన్నారు. నిర్ధారణ పరీక్షల అనంతరం ప్రతి దివ్యాంగుని యొక్క వైద్యులచే ధృవీకరించిన వైకల్య శాతంతో వివరాలను, దివ్యాంగులకు సంబంధించిన ఇతర వివరాలు సంపూర్ణంగా యుడిఐడి పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్‌రెడ్డి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, వైద్యశాఖ ఈఈ ఉమామహేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, రాంబాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మానవీయ దృక్పథంతో ట్రైనీ అసిస్టెంట్ విధుల నిర్వహణ

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విధి నిర్వహణలో మానవీయ దృక్పథం చూపించే అధికారి శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్‌శ్రేష్ట అని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట వీడ్కోలు సన్మాన సభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క సివిల్ సర్వెంట్ తొమ్మిది నెలల నుంచి 12 నెలల వరకు శిక్షణ కలెక్టర్‌గా పని చేస్తారన్నారు. సివిల్ పరీక్షలో ఎంపికైన తర్వాత మొదటి రోజు ట్రైనీ కలెక్టర్‌గా వచ్చినప్పుడు తనకు చాలా భయమేసిందని కలెక్టర్ తన జ్ఞాపకాలను గుర్తు చేశారు. సెప్టెంబర్ నెలలో భారీ వరదల సమయంలో ప్రజలకు ఆహారం, త్రాగునీరు సరఫరా చేయడంలో ట్రైనీ కలెక్టర్ కీలక పాత్ర పోషించారన్నారు. ట్రైనీ కలెక్టర్‌గా మోడల్ అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో గార్డెనింగ్ ఏర్పాటు, కోడింగ్ ల్యాబ్ ఏర్పాటు, లైబ్రరీ నిర్మాణం, మహిళా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కంప్యూటర్ శిక్షణ, ఐఐటి ల్యాబ్ ఏర్పాటు, పిల్లలకు ఐఐటి శిక్షణ అందించడం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించారని కలెక్టర్ ప్రశంసించారు. ప్రజలతో మమేకమయ్యే తీరు, పిల్లలతో మాట్లాడటం చాలా సార్లు గమనించామని ప్రజలకు సహాయం చేయాలని దృక్పథం ట్రైనీ కలెక్టర్‌లో అధికంగా ఉందన్నారు. ఖమ్మంజిల్లా ట్రైనీ కలెక్టర్‌గా ఏడాది కాలం అద్భుతమైన సేవలను అందించినందుకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట మాట్లాడుతూ గత ఎనిమిది నెలల కాలంలో ఖమ్మంజిల్లా ట్రైనీ కలెక్టర్‌గా చేయడం తన అదృష్టమన్నారు. పరిపాలన ఎలా చేయాలి, అధికారులు, సిబ్బందితో ఎలా పనిచేయించుకోవాలి, ప్రజలకు వసతుల కల్పనకు ఎలా కృషి చేయాలి వంటి అనేక అంశాలను జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు, ప్రభుత్వ సిబ్బంది నుంచి నేర్చుకోవడం జరిగిందన్నారు. టిజివో సెక్రటరీ సత్యనారాయణ, డిఎంఅండ్‌హెచ్ఒ కళావతిబాయి, డిపివో ఆశాలత తదితరులు ట్రైనీ కలెక్టర్‌తో పనిచేసిన అనుభవాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిసిఇఒ దీక్షారైనా, డిఆర్ఒ ఎ. పద్మశ్రీ, కలెక్టరేట్ ఎఒ అరుణ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్

మోడిఫైడ్ సైలెన్సర్ల తొలగింపు, జరిమానాల విధింపు

**ప్రజాపక్షం/ఖమ్మం,క్రైం :** ట్రాఫిక్ నిబంధనలకు విరుద్దంగా బుల్లెట్, తదితర ద్విచక్రవాహనాలకు కంపెనీవారు అమర్చిన సెలెన్సర్లకు బదులు మోడిఫైడ్ చేసిన సెల్‌న్సర్లు అమర్చిన వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి జరిమానాలు విధించారు. పోలీసు కమిషనర్ సునిల్‌దత్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్‌ల ఆదేశాల మేరకు శనివారం నగరంలోని ప్రధాన కూడళ్ల వాద్ద ట్రాఫిక్ సిఐ మోహన్‌బాబు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కొందరు యువకులు వాహనాలకు కంపెనీలు ఇచ్చిన సైలెన్సర్లను మార్చి మోడిఫై చేసిన సైలెన్సర్లు అమర్చి ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాల్లో, జనసంచారం మద్య ఒక్కసారిగా వింతవింత ధ్వనులు, శబ్దలతో స్థానికులు, పాదాచారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని సిఐ తెలిపారు. మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చిన బుల్లెటు వాహనాలను నిలిపి వాటిని తొలగించి కంపెనీలు ఇచ్చిన సైలెన్సర్‌లను వాహనచోదకులతోనే అమర్పించామన్నారు. నిత్యం ఈ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. శనివారం చేపట్టిన డ్రైవ్‌లో ఇరవై వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్‌లు తొలగించి ఒక్కొక్క వాహనదారుడికి 1000 రూపాయలు జరిమాన విధించడం జరిగిందని సిఐ మెహన్‌బాబు తెలిపారు.

# భారీగా గంజాయి పట్టివేత

ఇద్దరు అరెస్ట్.....పరారీలో ఏడుగురు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండల శివారులోని సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద వాహన తనిఖీల్లో 121 కిలోల గంజాయి పట్టుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఈవిషయంపై బూర్గంపాడు పోలీస్ స్టేషన్ నందు పాల్వంచ డిఎస్‌ఐ విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలను వెల్లడించారు. శనివారం ఉదయం 11:30గంటల సమయంలో బూర్గంపాడు ఎస్‌ఐ ఈ రాజేష్ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా సమ్మక్కసారలమ్మ గద్దెల వద్ద అనుమానాస్పందంగాటిఎస్ 08 జెక్యు 2960 గల కారు కనిపించడంతో తనిఖీ చేయడం జరిగిందని, ఆకారులో గంజాయితో సారపాకకు చెందిన కారు డ్రైవర్ వాంకుడోత్ సాయికుమార్, ఎపిలోని వైఎస్సార్ జిల్లా కూనవరం మండలంలోని పొలిపాక గ్రామానికి చెందిన వంశీలు పట్టుబడినట్లు తెలిపారు. వారిని పట్టుకుని విచారించగా పాత గంజాయి కేసులో ఉన్న ఎస్‌కె మున్వర్, రమేష్, కత్వాల సురేష్, జగదీష్, స్వరూప్, వాంకుడోత్ సురేలతో కలిసి గంజాయి వ్యాపారం చేయాలని భావించి సాయికుమార్ బాబాయి వాంకుడోత్ సురేష్‌తో గంజాయిని ఇల్లెందు క్రాస్ రోడ్ వద్ద ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నాట్లు పేర్కొన్నారు. వీరు అందరు కలిసి భద్రాచలంలో అద్దె కారును తీసుకొని పొలిపాక వెళ్లి అక్కడ గంజాయిని పడవ ద్వారా స్వరూప్, పెదముత్యం వంశీల సహాయంతో పడవ నడిపూ ఎల్లాజితో ఒప్పందం కుదుర్చుకుని అక్కడి నుండి ముద్దాయిలు మోటుకు వెళ్లి కలిమెలకు చెందిన చెందిన భీమ అనే వ్యక్తి వద్ద 55 ప్యాకెట్ల 121.140 కిలోల గంజాయి ని కొనడం జరిగిందన్నారు. ఆ గంజాయిని కారులో పొలిపాకకు తీసుకొచ్చి అక్కడ సాయి కుమార్ వాళ్లను దించి కారులో వింజరం వచ్చి ఉండగా, మిలిగిన వాళ్ళు పడవలో ఎల్లాజి సహాయంతో గోదావరి దాటి వచ్చి అట్టి గంజాయిని కారులో పెట్టుకొని సాయికుమార్, వంశీలు వస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ గంజాయి విలువల 60,57,000లుగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో పాల్వంచ సిఐ కె.సతీష్‌కుమార్, సిసిఎస్ ఎస్‌ఐలు ప్రవీణ్‌కుమార్, రామారావు, ట్రైనీ ఎస్‌ఐ దేవ్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన ఉండాలి



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం, సైబర్ ఆధారిత అక్రమ రవాణా వంటి అంశాలపై భీమదేవరపల్లి భరత మాత మండల మహిళ సమాఖ్యలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయగా విఒలు, విఒఏలకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఏపిఎం దేవానంద్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిరోధంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు, పులి సరళ, అంగన్వాడీ సూపర్‌వైజర్ సుశీల, సిసిలు కరుణాకర్, సదానందం, సతీష్, నాగమణి, మండల సమాఖ్య సిబ్బంది నాగరాజు, సంధ్యారాణి, అన్ని గ్రామాల విఒఎలు, అధ్యక్షులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పట్టవా?



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :** హనుమకొండ జిల్లా తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్,ఎఐటియుసి హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో హనుమకొండ డీఈఓకు వినతి పత్రం అందజేయడం జరిగింది. మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూ కార్మికులను శ్రమదోపిడి చేస్తూ వారి జీతభత్యాలు పెంచకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని, ఎన్నో మార్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వినతి పత్రం ఇచ్చిన గాని పట్టించుకున్న పాపాన పోలేదని పేర్కొన్నారు. రాష్ట్రం వ్యాప్తంగా 54 వేల మంది వంట కార్మికులు గత 23 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. సౌకర్యాలు కల్పించకుండా శ్రమను దోచేస్తున్నారని,అందువలన ఈ నెల రాష్ట్ర వ్యాప్తంగా 26న తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి హనుమకొండ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్‌యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గడ్డం లలిత, జిల్లా ప్రధాన కార్యదర్శి దర్మల రామ్మూర్తి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జనుగాను లక్ష్మి , తోకల రమాదేవి,బోర్ల దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా టెన్త్ పరీక్షలు



**ప్రజాపక్షం/జనగామప్రతినిధి :** పదవ తరగతి పరీక్షలకు పకడ్బంది ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ తెలిపారు. పదవ తరగతి పరీక్షలు జరుగుతుండగా శనివారం జనగామ పట్టణంలోని సెంటి మేరిస్ హైస్కూల్, ధర్మకంచె ప్రభుత్వ పాఠశాలలో జరిగే పరీక్షల సరళిని పరిశీలించారు. ఎన్ని గంటలకు ప్రశ్నపత్రాలు కేంద్రానికి వచ్చాయి, పోలీస్ ఎస్కాడ్ ఉందా తదితర వివరాలను చీఫ్ సూపరిండెంట్‌లను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల కేంద్రాలను తనిఖీ చేసిన వారిలో రవికుమార్, చీఫ్ సూపరిండెంట్ సత్యనారాయన పాల్గొన్నారు. కాగా శనివారం నలుగు విద్యార్థులు గైర్హాజర్ అయ్యారు. 6వేల 202 మందికి గాను 6వేల 198 మంది పరీక్షలు రాశారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అభినందన



**ప్రజాపక్షం/ ఎల్కతుర్తి :** హైదరాబాద్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లో హుస్నాబాద్ శాసనసభ సభ్యులు బిసి,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను ఎల్కతుర్తి మండలం ఎస్సీ బిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. శాసన సభలో శాస్త్రీయబద్ధంగా బిసిలకు విద్య ,ఉద్యోగం,రాజకీయాలలో42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీలను ఎబిసి కేటగిరీలుగా వర్గీకరించి జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ బిల్లు శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. టిపిసిసి సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి, ఎస్సీ సెల్ హనుమకొండ జిల్లా చైర్మన్ గొర్రె మహేందర్, పొన్నం యువసేన వ్యవస్థాపకులు తంగళ్ళపల్లి రమేష్, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోలి రాజేశ్వరరావు, గోడిశాల రాజయ్య, కట్కూరి గౌతమ్, వల్లభాపూర్ అధ్యక్షులు ఇంద్ర నగర్ గ్రామ శాఖ అధ్యక్షులు అంబాల రమేష్, ఎల్కతుర్తి గ్రామ శాఖ అధ్యక్షులు శీలం అనిల్ కుమార్, కేశవాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు ఈర రమేష్, రామకృష్ణాపురం గ్రామ శాఖ అధ్యక్షులు కుమార్, జిలుగుల మాజీ సర్పంచ్ రావుల రమేష్, తదితరులున్నారు.

## ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** శనివారం వెంకటాపురం పోలీస్ స్టేషన్‌ను ములుగు జిల్లా ఎస్పీ డా॥ శబరిష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ రక్షణ కోసం ఏర్పాటు చేసిన సిఆర్ పిఎఫ్ గార్డులను తనిఖీ చేశారు. గార్డ్ లలో ఉన్న సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు ఎల్లవేళలా అప్రమత్తంగా, సన్నద్ధంగా ఉండాలని, వారు తమ సిబ్బంది గ్రామాలను సందర్శించినప్పుడు భద్రతాపరమైన జాగ్రత్తలు తీసుకోవాలి అని సూచనలు చేశారు. ములుగు జిల్లా లో మావోయిస్టు ల కదలికలపై అనునిత్యం దృష్టి సారించాలని, గ్రామాలలో వారి రాకపోకలపై కన్నేసి ఉంచాలని, మావోయిస్టులు అమాయక ఆదివాసి ప్రజలను ప్రభావితం చేయకుండా కఠిన చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. వెంకటాపురం సీఐ కుమార్, వెంకటాపురం ఎస్సైలు తిరుపతి, స్వామి, సివిల్, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'మీ రక్షణ, భద్రత-మా బాధ్యత'



**ప్రజాపక్షం/వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండలంలోని కోయ వీరాపురం గ్రామాన్ని ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ పి.శబరీష్ పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి శనివారం సందర్శించారు. ప్రజల రక్షణ, భద్రత కోసం ములుగు జిల్లా పోలీసులు ఎల్లవేళలా పాటుపడుతూ ఉంటారని, అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారని గ్రామస్తులతో అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మావోయిస్టులకు ఎవరు కూడా ఆశ్రయం కల్పించవద్దని, వారుచేసే సంఘ విద్రోహ చర్యలలో పాలుపంచుకోవద్దని, అలా చేయడంవల్ల వారితోపాటు మీరు కూడా జైలు పాలు కావాల్సివస్తుందని, చట్ట ప్రకారం శిక్ష అనుభవించాలని, దానివల్ల మీ కుటుంబాలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు,మావోయిస్టులు వస్తే సమాచారం అందించాలన్నారు. ఏటూరునాగారం ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ, సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అనీష్, వెంకటాపురం సిఐ బండారి కుమార్, ఎస్ఐ లు రాజ్ కుమార్, తిరుపతి, సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# 'వాత్సల్య' అర్హుల జాబితాపై కసరత్తు

### హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం/హనుమకొండ:** మిషన్ వాత్సల్య పథకానికి అర్హులైన వారి జాబితాను సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు.శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మిషన్ వాత్సల్య పథకం అర్హుల ఎంపిక పై జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.అధికారులు మాట్లాడుతూ జిల్లాలో రెండు వందల పదహారు మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు కలెక్టర్‌కు తెలియజేశారు. జిల్లాలో మిషన్ వాత్సల్య పథకానికి 7 కేటగిరీలలో ఎంపిక చేసామని, ఎంపిక ప్రక్రియ గ్రామ స్థాయిలో అంగన్వాడీ టీచర్లు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ప్రాజెక్ట్ స్థాయిలో ఐసిడిఎస్ సిడిపివొ సూక్ష్మ పరిశీలన, సామాజిక దర్యాప్తు నివేదిక అనంతరం నివేదికను, సంబంధిత అర్హులను బాలల సంక్షేమ సమితి ముందు ప్రవేశపెట్టి, జిల్లా స్థాయి స్పాన్సర్షిప్ కమిటీ ఆమోదించగా అర్హులను ఎంపిక చేశామని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకానికి ఎంపిక చేసే జాబితాలో తల్లితండ్రులు లేని బాలబాలికలకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న తల్లిదండ్రులు, తల్లి లేదా తండ్రి ఇరువురు వదిలేయగా సంరక్షకుల వద్ద ఆశ్రయం పొందుతున్న వారికి,వితంతు మహిళలు, రక్షణ సంరక్షణ విద్యా వైద్య పోషకాహార అవసరతలు ఉన్న బాల బాలికలను గుర్తించి అర్హులుగా ఎంపిక చేయాలని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ అన్నమనేని అనిల్ చందర్‌రావు,సిడిపిఒలుఎం విశ్వజ, కె స్వాతి, స్వరూప, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సిహెచ్. అవంతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఇన్చార్జి ఆఫీసర్ ఎస్ ప్రవీణ్ కుమార్, ఎఫ్ఎంఎంఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం మౌనిక, శిశు గృహ ఇన్చార్జి మేనేజర్ ఏ మాధవి, సోషల్ వర్కర్లు ఎం. శ్రీనివాసులు,జి సునీత,ఎస్ చైతన్య,ఓఆర్డబ్ల్యూ పి విజయ్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

### అంగన్వాడీ కేంద్రాలలో..

అంగన్వాడీ కేంద్రాలలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో అంగన్వాడీ కేంద్రాల భవనాలలో తాగునీరు, విద్యుత్, టాయిలెట్స్, మరమ్మతు పనుల పురోగతి పై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో ఇప్పటి వరకూ జరిగిన అభివృద్ధి పనులపై డాక్యుమెంట్ చేయాలని ముగ్గురు సిడిపిఒలను కలెక్టర్ ఆదేశించారు. పురోగతిలో ఉన్న పనులను వేగవంతం చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో మరమ్మతులు, కనీస సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు అందజేస్తే నిధులు మంజూరు చేయన్నట్లు పేర్కొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ఇతర శాఖల అధికారులు, సీడీ పీవోలు పాల్గొన్నారు.

### జాతీయ రహదారుల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

సిద్దిపేట ఎల్కతుర్తి జాతీయ రహదారి 765డీజీ పరిధిలో జిల్లాకు సంబంధించి నిర్మాణంలో ఉన్న రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లో సిద్దిపేట ఎల్కతుర్తి మార్గంలో జాతీయ రహదారి నిర్మాణ పనులపై జాతీయ రహదారుల శాఖ అధికారులతో పాటు సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సిద్దిపేట ఎల్కతుర్తి వరకు 63.64 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణ ప్రాజెక్టు ఉండగా హనుమకొండ జిల్లా పరిధిలో ఉన్న 17.5 కిలోమీటర్లలో ఇప్పటివరకు 16.5 కిలోమీటర్ల రహదారి నిర్మాణం పూర్తయిందని జాతీయ రహదారులశాఖ అధికారులు కలెక్టర్‌కు తెలియజేశారు. జాతీ య రహదారి నిర్మాణ పనులు మొత్తం మే నాటికి పూర్త వుతాయని అధికారులు తెలిపారు. ఏప్రిల్ 30 నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి,జాతీయరహదారులశాఖ డీఈఈ మనోహర్, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, తహసీల్దార్ జగత్ సింగ్, ఎంపీడీవో విజయ్ కుమార్, విద్యుత్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో కుడా ఆధ్వర్యంలో చేపట్టిన ఎల్కతుర్తి జం క్షన్ సుందరీకరణ పనులను ఏప్రిల్ 14నాటికి పూర్తి చేయాలనికలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

## ధాన్యం సేకరణ సజావుగా జరగాలి




**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా జరగాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. రైతులు ఏ దశలోనూ ఇబ్బందులు పడకుండగా చూడాలన్నారు. శనివారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ శాఖలకు చెందిన అధికారులతో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ 2024–25 రబీ ధాన్యాన్ని సేకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో 3లక్షల 75వేల 453 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వేయగా 2లక్షల 35వేల 954 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పెట్టుకున్నామన్నారు. ఇందులో 62వేల 13 మెట్రిక్ టన్నోల సన్న ధాన్యం, లక్షా 73వేల 941 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం సేకరించాలని లక్ష్యంగా వేశామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో 300 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, వీటిలో సన్న ధాన్యం సేకరణ కోసం 119 దొడ్డు ధాన్యం కొనుగోలు కోసం 181 కేంద్రాలను అందుబాటులో ఉంటాయని తెలిపారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో 134 కేంద్రాలు, ఐకెపి ఆధ్వర్యంలో 164 ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. రైతుల నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం ఏ గ్రేడ్ రకానకి క్వింటాలుకు 2వేల 320 రూపాయలు, సాధారణ రకానికి 2300 రూపాయలు చెల్లించడం జరుగుతుందన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా కేంద్రాల వద్ద తగిన నీడ, నీటి వసతి కల్పించాలని, సరిపడా సంఖ్యలో తేమ కొలిచే యంత్రాలు, అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆర్‌డిఓ గోపిరామ్, డిఆర్‌డిఓ వసంత, డిఎం సివిల్ సప్లయ్ హతీరామ్, వ్యవసాయ శాఖ అధికారి రామారావు నాయక్, కో ఆపరేటర్ అధికారి రాజేందర్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారిఇ నరేందర్, జిల్లాలోని రైస్ మిల్లర్లు, డిపిఎం, రవాణ శాఖ అధికారి, మార్క్‌ఫెడ్ డిఎం ఏఈఓ తదితరులు పాల్గొన్నారు.

## రవాణాశాఖ ఆధ్వర్యంలో తనిఖీలు



**ప్రజాపక్షం/పాలకుర్తి :** పాలకుర్తి పట్టణంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. పలు వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా రవాణ శాఖ అధికారి జివి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూఏ స్కూల్ బస్సులు, మ్యాక్సీ క్యాబ్ (తుఫాన్), గూడ్స్ క్యారేజ్ వాహనాలు సకాలంలో పన్నులు కట్టుకోవాలన్నారు. వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లకూడదన్నారు. బస్సులు కేవలం విద్యార్థుల కోసమే అనే విషయం మరిపోవద్దు అన్నారు. స్కూల్ బస్సులను వేరే కార్యక్రమాలకు ఉపయోగిస్తే సీజ్ చేస్తామన్నారు. అధికారులు పాల్గొన్నారు.

## కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలి

### ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు డిమాండ్



**ప్రజాపక్షం/నెక్కొండ:**ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరణ చేసి వారికి కనీస వేతనంరూ.26,000 అందించాలని, రా ష్ట్రంలో గతంలో వీఆర్ఏ లను వివిధ శాఖలకు మళ్లించుటలో పెండింగులో ఉన్న ఐదువేల పైచిలుకు పోస్టులను భర్తీ చేయాలని, వారి సమస్యల పరిష్కారం కోసం ఈ రాష్ట్ర ప్రభు త్వం ముందు అడుగు వేయాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు అన్నారు. శనివారం ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని ఇంది రా పార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన సమ్మెలో భాగంగా కార్మిక సంఘాల నాయకులను నెక్కొండ ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో ముం దస్తు అరెస్టులు చేశారు.అనంతరం ఏఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు మాట్లాడుతూ,ఇలా ముందస్తు అరెస్టులు చేయడం చాలా బాధాకరమైన విషయమని, కార్మికులు, శ్రామికులు, ప్రభుత్వాలకు విన్నవించుకునే ఒకే ఒక ధోరణి సమ్మె అటువంటి సమ్మెను అణచివేస్తూ ఉద్యమాలను అని చివేసే ధోరణిని వీడనాడాలన్నారు. ప్రభుత్వ రంగాల లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత భరోసా లేకుండా అనేకమంది పనిచేస్తున్నారని, ప్రభు త్వ రంగంలో పని చేసే ప్రతి ఒక్కరికి పని భద్ర తతో పాటు హెల్త్ కార్డులు కూడా ప్రభుత్వమే అందించాలని ఆయన కోరారు. కొంతమంది ఉద్యోగులు ప్రభుత్వ రంగంలో పనిచేసిన వారి కి గుర్తింపు లేదని వారిని ప్రభుత్వ ఉద్యోగులుగాగుర్తించాలని, కనీస వేతన సవరణ చట్టం ప్రకారం 26,000 రూపాయలు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయం చేయాలని కోరారు. అరెస్ట్ అయిన వారిలో వీఆర్ఏ ల రాష్ట్ర నాయకులు దుండి మధు, సిఐటియు మండల అధ్యక్షులు భూక్య నరేష్, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు నరసయ్య అరెస్టు అయిన వారిలో ఉన్నారు.

## అర్ధరాత్రి అక్రమ అరెస్టులు.. అప్రజాస్వామికం



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** తెలంగాణ రాష్ట్రంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి నుండి ఎట్లాంటి కార్యక్రమం పిలుపులేకున్నా హనుమకొండ జిల్లా కేంద్రంలో... ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు వుట్కూరి ప్రణీత్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, జిల్లా సహా య కార్యదర్శి కసర బోయిన రవితేజ , జిల్లా సమితి సభ్యులు శ్రీపతి వినయ్, బొట్టు హరీష్, నాయకులను అర్ధరాత్రి ఇళ్లల్లో చొరబడి అరెస్టు చేయడం అప్రజాస్వామికం ఈ అరెస్టును ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి తీవ్రంగా ఖండిస్తున్నదని జిల్లా ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషాబోయిన సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు.ఎలాంటి పిలుపులు కార్యక్రమాలు లేనప్పుడు సమాచార లోపంతో అక్రమ అరెస్టులు చేయడం చాలా దుర్మార్గం అని,దీనివల్ల వ్యక్తుల వ్యక్తిగత పనులు, సంఘ కార్యక్రమాలు, అడ్డుకున్నట్లేనని, ఇది ముమ్మాటికీ మానవ హక్కుల ఉల్లంఘనేనని, భవిష్యత్తులో ఇలా జరగకుండా చూడాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 14 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ విడుదల చేయకుండా ప్రభుత్వ విద్యారంగాన్ని భ్రష్టు పట్టించి ప్రైవేట్ ,కార్పొరేట్ శక్తులను పెంచి పోషించిందని,ఇదేవిధంగా అరెస్టులపర్వం కొనసాగిస్తే గత ప్రభుత్వానికి ఏ గది పట్టిందో భవిష్యత్తులో మీకు అదే గతి పడుతుందని,అరెస్టు చేసిన నాయకులను బెషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ముగ్గురు చెన్‌స్నాచర్లతో పాటు ఒక దొంగ అరెస్టు

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :**మూడు వేర్వేరు సంఘటనల్లో గొలుసు దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు చెన్ స్నాచర్లతో పాటు కారులో డబ్బు బ్యాగును చోరీ చేసిన కారు డ్రైవర్‌ను పోలీసుల అరెస్టు చేసారు. ఈ మూడు సంఘటనల్లో పోలీసులు సుమారు 4లక్షల 90వేల రూపాయల విలువగల, 77.750గ్రాముల బంగారంతో పాటు ఎనిమిది లక్షల పది వేల నగదు,ఒక ఆటో, ఒక ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ అరెస్టులకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడిస్తూ హనుమకొండ పోలీస్ స్టేషన్ కేసుకు సంబందించి పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు వరంగల్ కోట చెందిన చాపర్తి రాజేష్ (30) ఇస్త్రీ షాపు నిర్వహిస్తూ దీని ద్వారా వచ్చే అదాయం తన జల్సాలకు సరిపోకపోవడం నిందితుడు సులభంగా డబ్బు సంపాదించాలనే అలోచనతో చెన్ స్నాచింగ్ ద్వారా డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఇందులో భాగంగా ఈ నెల 11న హనుమకొండ రెడ్డి కాలనీలో ఒంటరిగా వెళ్ళుతున్న ఓ మహిళ మెడలో వున్న రెండున్నర తులాల బంగారు గొలుసును ద్విచక్ర వాహనంపై బలవంతంగా లాక్కోని అక్కడి నుండి తప్పించుకొని పోయాడని తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న హన్మకొండ పోలీసులు, సిసిఎస్ పోలీసులతో కలిసి దర్యాప్తు చేసి ప్రస్తుతం పోలీసుల వద్ద వున్న టెక్నాలజీని వినియోగించుకోని నిందితుడుని శనివారంపెద్దమ్మగడ్డ ప్రాంతంలో అరెస్టు చేసి విచారించగా నిందితుడు గతంలో ఇదే తరహాలో నాలుగు చోరీలకు పాల్పడ్డాడని, ఇందులో కెయూసి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు,మట్టెవాడ,ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒకటి చొప్పున చెన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడని, నిందితుడి నుండి సుమారు 4లక్షల 75వేల రూపాయల బంగారం, పది వేల రూపాయల నగదు, ఒక ద్విచక్రవాహనం, ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

## సరస్వతి పుష్కరాల ఏర్పాట్లపై ప్రతిపాదనలివ్వండి

### జయశంకర్ కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లి ప్రతినిధి :** సరస్వతి పుష్కరాలకు చేపట్టనున్న తాత్కాలిక ఏర్పాట్లకు సంబంధించిన అంచనా ప్రతిపాదనలు త్వరితగతిన సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, దేవాదాయ, పర్యాటకఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో శాశ్వత పనులకు అంచనాలు అందచేసారని, కానీ కొన్ని తాత్కాలిక పనులు చేపట్టాల్సి ఉన్నందున ప్రతిపాదనలు అందచేయాలని తెలిపారు. పుష్కరాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సమర్ధవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పుష్కరాలలో చేసిన ఏర్పాట్లు సమాచారం భక్తులకు ఉపయోగపడేలా మొబైల్ యాప్ తయారు చేయు అంశాలను పరిశీలించారు. మొబైల్ యాప్ లో సమగ్ర సమాచారం ఉండాలని సూచించారు.ప్రధాన కూడళ్లలో తాగు నీరు అందుబాటులో ఉండేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారు సూచించారు. స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించేందుకు జోన్లుగా వారిగా విభజించి, ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని నియమించాలని డిపిఓకు సూచించారు. ప్రవేశ మార్గాలు, రోడ్లు మరమ్మతులు, మెరుగుదల పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. విద్యు త్ సరఫరా నిరంతరం అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని అవసరమైన మేరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుతో పాటు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, మార్పు పనులను చేపట్టాలని విద్యుత్ అధికారులకు సూచించారు. పుష్కర ఘాట్ల వద్ద భద్రతా చర్యలు మరింతగా పెంచాలని, భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా ప్రమాద హెచ్చరికల బోర్డ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. పనులు నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి నవీన్‌రెడ్డి, ఇరిగేషన్, పంచాయతి రాజ్, విద్యుత్, ఇరిగేషన్, దేవాదాయ, పంచాయతి రాజ్, ప్రణాళిక, ఆర్టీసీ, పర్యాటక, పోలీస్ తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెండోరోజు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరు

### డిఇఒ రాజేందర్

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 20 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు రెండవ రోజు శనివారం ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యం.రాజేందర్ తెలిపారు. 3449 విద్యార్థులకు గాను రెండవ రోజు 3436 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. 7 గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెల్పూర్ సందర్శించారు. డిస్టిక్ లెవెల్ అబ్జర్వర్ ఎం సోమిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూపాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేసి చెల్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రేగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిట్యాల, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ చిట్యాలను సందర్శించారు. జిల్లా విద్యాశాఖ అధికారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూపాలపల్లి ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల భూపాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జంగేడును సందర్శించారు. ఫ్లైయింగ్ స్కాడ్ బృందాలు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించాయి. పరీక్ష కేంద్రాలలో వైద్యము, కరెంటు, రవాణా సౌకర్యము తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.

## క్రీడ

# బెంగళూరు లక్ష్యం 175

ఐపిఎల్ 18వ సీజన్ తొలి మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఛేదనను ధాటిగా ఆరంభించింది.



ఐపిఎల్ 2025 సీజన్‌లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్)తో జరుగుతున్న ఆరంభ మ్యాచ్‌లో ఆర్‌సీబీ బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. ముఖ్యంగా కృనాల్ పాండ్యా(3/29) తీన్మార్ బౌలింగ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. దాంతో ముందుగా బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 174 పరుగులే చేసింది. కెప్టెన్ అజింక్యా రహానే(31 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 56) హాఫ్ సెంచరీతో రాణించగా.. సునీల్ నరైన్(26 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 44) దూకుడుగా ఆడాడు. అంగ్‌క్రిష్ రఘువంశీ(22 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 30) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఆర్‌సీబీ బౌలర్లలో కృనాల్ పాండ్యాతో పాటు జోష్ హాజెల్ వుడ్ 2/22) రెండు వికెట్లు పడగొట్టాడు. సుయాశ్ శర్మ, రసిఖ్ సలామ్, యశ్ దయాల్ తలో వికెట్ తీసారు. రహానే నరైన్ ధాటికి ఓ దశలో కేకేఆర్ 220 ప్లస్ స్కోర్ చేసేలా కనిపించింది. కానీ కృనాల్ సంచలన బౌలింగ్‌తో కేకేఆర్ పతనాన్ని శాసించాడు.

### చెలరేగిన రహానే, నరైన్..

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కేకేఆర్ ఆదిలోనే ఓపెనర్ క్వింటన్ డికాక్(4) వికెట్‌ను కోల్పోయింది. జోష్ హాజెల్ వుడ్ వేసిన తొలి ఓవర్ మూడో బంతికే అతను ఇచ్చిన సునాయస క్యాచ్‌ను సుయాశ్ శర్మ నేలపాలు చేశాడు. అయినా ఈ అవకాశాన్ని డికాక్ సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఐదో బంతికి వికెట్ కీపర్‌గా పెవిలియన్ చేరాడు. ఆ తర్వాతి రెండు ఓవర్లను కూడా ఆర్‌సీబీ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. దాంతో 3 ఓవర్లలో కేకేఆర్ వికెట్ నష్టానికి 9 పరుగులే చేసింది. కానీ రసిఖ్ దార్ సలామ్ వేసిన నాలుగో ఓవర్‌లో రహానే రెండు సిక్స్‌లతో పాటు బౌండరీ బాది 16 పరుగులు పిండుకున్నాడు.
దాంతో స్పిన్నర్ అయిన కృనాల్ పాండ్యాను రజత్ పటీదార్ రంగంలోకి దింపగా.. నరైన్ ఓ సిక్స్.. రహానే రెండు బౌండరీలు బాదడంతో 15 పరుగులు వచ్చాయి. యశ్ దయాల్ వేసిన 6వ ఓవర్‌లో రహానే రెండు ఫోర్లతో పాటు సిక్స్ కొట్టగా.. నరైన్ ఒక బౌండరీ బాదడంతో 20 పరుగులు వచ్చాయి. దాంతో పవర్ ప్లేలోనే కేకేఆర్ వికెట్ నష్టానికి 60 పరుగులు చేసింది. 18 బంతుల్లో 51 పరుగులు రాబట్టింది.


### మలుపు తిప్పిన కృనాల్..

పవర్ ప్లే అనంతరం కాస్త పరుగుల వేగం తగ్గగా.. సుయాశ్ శర్మ వేసిన 9వ ఓవర్‌లో రహానే సిక్స్ బాది 25 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో నరైన్ కూడా చెలరేగడంతో ఈ జోడీ 100 పరుగుల భాగస్వామ్యాన్ని పూర్తి చేసుకుంది. అయితే రసిఖ్ సలామ్ వేసిన ఆ మరుసటి బంతికే నరైన్ కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. ఆ మరుసటి ఓవర్‌లోనే రహానేను కృనాల్ పాండ్యా క్యాచ్ ఔట్ చేశాడు.
తన మరుసటి ఓవర్లలో వెంకటేశ్ అయ్యర్(6), రింకూ సింగ్(12)లను కృనాల్ క్లీన్ బౌల్డ్ చేసి ఆర్‌సీబీ బౌలర్లకు ఊపిరి అందించాడు. డేంజరస్ రస్సెల్(4)ను సుయాశ్ శర్మ ఔట్ చేయడంతో కేకేఆర్ పరుగుల వేగం తగ్గింది. ఆ తర్వాత బ్యాటర్లు దూకుడుగా ఆడే ప్రయత్నంలో ఔటయ్యారు. దాంతో ఆ జట్టు 174 పరుగులకే పరిమితమైంది.

# పివిఆర్, ఐనాక్స్‌లో ఐపిఎల్ మ్యాచ్‌లు..

## బిసిసిఐతో ఒప్పందం

ప్రముఖ సినిమా ఎగ్జిబిటర్ పీవీఆర్ ఐనాక్స్.. భారత క్రికెట్ నియంత్రణ మండలితో కీలక ఒప్పందం చేసుకుంది. దేశంలోని 30కి పైగా నగరాల్లోని తమ సినిమాస్‌లో ఐపీఎల్ మ్యాచులను ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు భాగస్వామ్యం కుదుర్చుకుంది. శనివారం (మార్చి22) నుంచి ఐపీఎల్ ప్రారంభోత్సవ వేడుకతో ఈ ప్రసారాలు ప్రారంభం కానున్నాయని పీవీఆర్ ఐనాక్స్ తెలిపింది. వీకెండ్ మ్యాచ్‌లు, ప్లేఆఫ్‌లను థియేటర్లలో ప్రదర్శించనున్నట్లు తెలిపింది. హైక్వాలిటీ విజువల్స్, సౌండ్, సీటింగ్‌తో స్టేడియంలో చూసిన అనుభూతి లభిస్తుందని పీవీఆర్ ఐనాక్స్ తెలిపింది. సినిమాను, క్రియేటర్‌ను ఒకే వేదికపై తీసుకొచ్చినందుకు చాలా ఆనందంగా ఉందని పీవీఆర్ ఐనాక్స్ రెవెన్యూ, ఆపరేషన్స్ సీఈఓ గౌతమ్ దత్తా తెలిపారు.




గతేడాది క్రికెట్ మ్యాచ్‌ల ప్రసారంలో ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించిందని, దీంతో ప్రీమియం క్వాలిటీ ఎక్స్‌పీరియన్స్ అందించే ఉద్దేశంతో ఈ ఏడాదీ ప్రసారం చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. దక్షిణాదితోపాటు ఉత్తరాదిలో ఉన్న మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమబెంగాల్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లోని ప్రధాన మెట్రో నగరాలతో పాటు, టైర్2, టైర్3 సిటీల్లో ఈ స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు పీవీఆర్ ఐనాక్స్ తెలిపింది. సిటీకి సిటీకి మధ్య షెడ్యూల్లో తేడా ఉంటుందని పేర్కొంది. మరిన్ని వివరాల కోసం పీవీఆర్ ఐనాక్స్ లేదా యాప్‌ను సంప్రదించాలని సూచించింది.

## రీల్

# హీరోతో డేట్ చేయకూడదని షరతు పెట్టారు

నిధి అగర్వాల్



'హరిహర వీరమల్లు', 'ది రాజాసాబ్' చిత్రాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు నటి నిధి అగర్వాల్. తాజాగా ఆమె ఓ పాడ్‌కాస్ట్‌లో ఆమె పాల్గొన్నారు. ఆయా చిత్రాల విశేషాలతోపాటు కెరీర్ తొలినాళ్లను గుర్తు చేసుకున్నారు. ఒక సినిమాలో యాక్ట్ చేసినప్పుడు.. హీరోతో డేటింగ్ చేయకూడదని టీమ్ షరతు పెట్టిందని ఆమె తెలిపారు. ఆన్‌లైన్ ట్రోలింగ్ గురించీ ఆమె మాట్లాడారు. "మున్నా మైకేల్‌తో సినీ పరిశ్రమలో నా కెరీర్ మొదలైంది. ఇదొక బాలీవుడ్ చిత్రం. టైగర్ ష్రాఫ్ కథానాయకుడిగా నటించారు. ఈ సినిమాకు ఓకే చెప్పిన తర్వాత టీమ్ నాతో ఒక కాంట్రాక్ట్‌పై సంతకం చేయించుకుంది. సినిమాకు సంబంధించిన నేను పాటించాల్సిన విధి విధానాలు ఆ కాంట్రాక్ట్‌లో పొందుపరిచి ఉన్నాయి. అందులోనే నో డేటింగ్ అనే షరతు పెట్టారు. సినిమా పూర్తయ్యేవరకూ హీరోతో నేను డేట్ చేయకూడదని దాని సారాంశం. కాంట్రాక్ట్ మీద సంతకం చేసినప్పుడు నేను పెద్దగా ఇవన్నీ చదవలేదు. ఆ తర్వాతే నాక్కూడా ఈ విషయం తెలిసి ఆశ్చర్యపోయా. నటీనటులు ప్రేమలో పడితే వర్క్‌పై దృష్టిపెట్టరని ఆ టీమ్ భావించి ఉండొచ్చు. అందుకే ఇలాంటి షరతులు పెట్టి ఉంటుందనుకున్నా" అని నిధి అగర్వాల్ తెలిపారు. హద్దులు దాటి.. అసభ్యపదాలు ఉపయోగిస్తూ కామెంట్స్ చేయడం ఏమాత్రం కరెక్ట్ కాదు. నేను చాలా స్ట్రాంగ్‌గా ఉంటా. ఇలాంటివాటిని పెద్దగా పట్టించుకోను. సోషల్‌మీడియా కామెంట్స్ నాపై పెద్దగా ప్రభావం చూపవు. కానీ, అందరూ నాలా ఉండరు. ఇలాంటి కామెంట్స్ చూసి వారు ఎంతో బాధపడతారు. ఈ విషయాన్ని గ్రహించి మర్యాదపూర్వకంగా కామెంట్స్ చేస్తే బాగుంటుంది అని ఆమె అన్నారు.

# టాలీవుడ్ దేశంలోనే ది బెస్ట్

\- మోహన్‌లాల్



మోహన్‌లాల్ హీరోగా పృథ్వీరాజ్ సుకుమారన్ తెరకెక్కించిన చిత్రం 'ఎల్2: ఎంపురాన్'. గతంలో విడుదలై సూపర్ హిట్ అయిన 'లూసిఫర్'కు సీక్వెల్‌గా రానుంది. మార్చి 27న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో తాజాగా హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. అందులో మోహన్‌లాల్, పృథ్వీరాజ్, దిల్‌రాజు పాల్గొన్నారు.
"తెలుగు చిత్ర పరిశ్రమ దేశంలోనే బెస్ట్ ఇండస్ట్రీ. నటీనటులను తెలుగు ఆడియన్స్ గౌరవించే విధానం బాగుంటుంది. నా 47 ఏళ్ల కెరీర్‌లో ఎంతోమంది తెలుగు నటీనటులతో పనిచేసే అవకాశం లభించింది. నాగేశ్వరరావుతో నటించే అవకాశం రావడం నా అదృష్టం. కేరళలో మేం అన్ని భాషల సినిమాలు చూస్తాం. గతంలో నేను నటించిన మలయాళ సినిమాలు తెలుగులో రీమేక్ చేశారు. ఇప్పుడు డైరెక్ట్‌గా తెలుగులోనే విడుదల చేస్తున్నాం. ఇది సీక్వెల్ కాదు.. మేం ఈ సినిమా కథ అనుకున్నప్పుడే మూడు భాగాలు తీయాలని నిర్ణయించుకున్నాం. 'ఎల్2: ఎంపురాన్' కోసం రెండు సంవత్సరాలు కష్టపడ్డాం. ఈ సినిమా 50 రోజుల కార్యక్రమాన్ని మీ అందరితో కలిసి సెలబ్రేట్ చేసుకోవడానికి నేను సిద్ధంగా ఉన్నా" అని మోహన్‌లాల్ ధీమా వ్యక్తంచేశారు.
"మన సినిమాలను రాజమౌళి, ప్రశాంత్ నీల్, సుకుమార్‌లు గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లారు. ఇప్పుడు ఆ వరసలో పృథ్వీరాజ్ సుకుమారన్ చేరారు. 'లూసిఫర్' మొదటి భాగం ఎంత హిట్ అయిందో తెలిసిందే. ఇప్పుడు పార్ట్ 2ను భారీగా తెరకెక్కించారు. దీని ట్రైలర్‌ను చూసి ఆశ్చర్యపోయాను. విజువల్స్ మరో స్థాయిలో ఉన్నాయి. మోహన్‌లాల్ స్క్రీన్‌పై కనిపించగానే వావ్ అనిపించింది. మంచి కథతో రూపొందిస్తే గ్లోబల్ ఆడియన్స్ కూడా మన సినిమాలు చూసేందుకు సిద్ధంగా ఉన్నారు" అని దిల్ రాజు అన్నారు. ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేయనున్న దిల్‌రాజుకు పృథ్వీరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

# అదొక రకమైన వివక్ష

పూజాహెగ్డే



సినిమా సెట్స్‌లో తనకూ వివక్ష ఎదురైనట్లు కథానాయిక పూజాహెగ్డే తెలిపింది. తెలుగుతో పాటు, తమిళ, హిందీ భాషల్లో అగ్ర కథానాయకుల సరసన నటించిన పూజా స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతున్నారు. ఒకప్పుడు వరుస అవకాశాలను అందిపుచ్చుకున్న ఆమె ప్రస్తుతం స్క్రిప్ట్‌ల ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తోటి నటుల కారణంగా ఎప్పుడైనా ఇబ్బంది పడ్డారా? అన్న ప్రశ్నకు స్పందిస్తూ "ఇది అన్ని పరిశ్రమల్లోనూ ఉంది. అయితే, ఒక్కో చోట ఒక్కోరకంగా ఉంటుంది. పరిస్థితులను బట్టి దాని స్థాయిలు మారిపోతూ ఉంటాయి. ఉదాహరణకు హీరో వ్యానిటీ వ్యాన్ మూవీ షూటింగ్ జరిగే సెట్‌కు పక్కనే నిలిపి ఉంచుతారు. మిగిలిన వాళ్లవి దూరంగా ఉంటాయి. మేము బరువైన కాస్ట్యూమ్స్, భారీ లెహంగాలు ధరించి సెట్ వరకూ నడుచుకుంటూ రావాలి. కొన్నిసార్లు అది చూడటానికి బాగున్నా, అంత బరువైన దుస్తులను ఈడ్చుకుంటూ వచ్చి, షాట్ అయ్యాక అలాగే వెళ్లాల్సి ఉంటుంది. ఇదొక రకమైన వివక్ష" 'ఇంకొన్ని సార్లు పోస్టర్‌లో మా పేరు కూడా ఉండదు. లవ్‌స్టోరీలో నటించినా ఎలాంటి గుర్తింపు ఇవ్వరు. సినిమా అనేది సమష్టి కృషి అన్న విషయం అందరూ గుర్తించాలి. అందరూ నా అభిమాన హీరోలే. అయితే, అనుష్కశర్మ అంటే నాకెంతో ఇష్టం. ఎందుకంటే ఆమె వ్యక్తిత్వానికి నేను దగ్గరగా ఉంటా. ఒకప్పుడు ఇండస్ట్రీలో ఆమెకు ఎలాంటి సపోర్ట్‌లేదు. ఆమెలానే నాక్కూడా పార్టీలంటే ఇష్టం ఉండదు. 'అచ్చం నాలాంటి వారు ఒకరు ఉన్నందుకు సంతోషం' అనిపిస్తుంది. హాలీవుడ్‌లో స్కార్లెట్ జాన్సన్ అంటే ఇష్టం" అని పూజా హెగ్డే చెప్పుకొచ్చింది.

# ఐపిఎల్ ఆరంభం

(మొదటి పేజీ తరువాయి)

కనబర్చిన ఆటగాడిగా అతనిపై ప్ర శంసల జల్లు కురిపించాడు. కోహ్లితో సరదాగా మాట్లాడిన షారూఖ్ ఖాన్.. అనంతరం కెకెఆర్ సెన్సేషన్ రింకూ సింగ్‌ను కూడా స్టేజీపైకి ఆహ్వానించాడు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వంటి గోల్డెన్ జనరేషన్ ఆటగాళ్లకు కుర్రాళ్లు పోటీ ఇస్తారా? అని రింకూ సింగ్‌ను ప్రశ్నించ గా.. తాను కూడా ఆ జనరేషన్ ఆటగాడినేని, వాళ్లు ఓల్డ్ జనరేషన్ కాదని బదులిచ్చాడు. అనంతరం రింకూ సింగ్‌తో కలిసి షారూఖ్ ఖా న్ డ్యాన్స్ చేయగా.. విరాట్ కోహ్లి పడి పడి నవ్వుకున్నాడు. ఆ తర్వాత కోహ్లి కూడా షారూఖ్‌తో కలిసి డ్యాన్స్ చేశాడు. అనంతరం బిసిసిఐ పెద్దలతో పాటు ఆరంభ వేడుకల్లో పాల్గొన్న సెలెబ్రిటీలను స్టేజీపైకి షారుఖ్ ఖాన్ ఆహ్వానించగా.. కేకేఆర్, ఆర్‌సీబీ కెప్టెన్లు అజింక్యా రహానే, రజత్ పటీదార్‌లు ట్రోఫీని స్టేజిపైకి తీసుకొచ్చారు. బీసీసీఐ పెద్దలంతా కలిసి భారీ కేకును కట్ చేసి ఐపీఎల్ 2025 సీజన్‌ను ప్రారంభించారు. జాతీయ గీతంతో ఆరంభ వేడుకలను ముగించారు.

# సింగిల్‌గానే అధికారంలోకి

(మొదటి పేజీ తరువాయి)

ఫాంహౌస్ వరకు 200 మంది రైతులు, పార్టీ నేతలు 180 కిలోమీటర్లు పాదయాత్ర వారం రోజుల పాటు కొనసాగి శనివారంతో ముగిసింది. ఈ ముగింపు సభ బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ ఆధ్యక్షతన ఎర్రవల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా కెసిఆర్ మాట్లాడుతూ పోయిన ఏడాది ఇదే రోజు నిండుకుండల్లాంటి కాళేశ్వరం ప్రాజెక్టు నేడు ఎందుకు ఎండిపోతున్నాయో, ఇందుకు ఎవరు కారణమనే విషయాన్ని సభ్య సమాజానికి తెలియ జేసేందుకు చందర్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేయడం అభినందనీయమని పాదయాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని ప్రశంసించారు. తెలంగాణకు నీల్లు ఇవ్వాలన్న పాలనా ప్రాధాన్యతను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే తెలంగాణకు సాగునీరు , తాగు నీరు సమస్య వచ్చిందన్నారు. పల్లెల నుండి పట్టణానికి బతకడానికి వచ్చిన పేదలకు నాటి మన ప్రభుత్వం అండగా నిలించిందని, ఇప్పుడున్న ప్రభుత్వం వాళ్ల ఇండ్లను కూల్చివేస్తున్నదని నిప్పు చేరిగారు. మన దగ్గర ఎంపిల బలం ఉంటే, కేంద్రం మీద ఒత్తిడి చేసి రాష్ట్రాన్ని బాగు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికైన ఈ దిశగా తెలంగాణ ప్రజలు ఆలోచన చేయాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎంఎల్‌ఏ జీవన్‌రెడ్డి,పుట్ట మధు,వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

# 26న వేములవాడలో బిసి కమిషన్ పర్యటన



ప్రజాపక్షం/హైదరాబాద్ : దొమ్మర, వంశరాజ్ కులస్థుల స్థితిగతులపై అధ్యాయనం చేసేందుకు ఈ నెల 26న వేములవాడ, సిరిసిల్లా ప్రాంతాల్లో రాష్ట్ర బిసి కమిషన్ పర్యటిస్తుందని బిసి కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. తమ కులాల పేర్లను మార్చాలని వచ్చిన వివిధ అభ్యర్థనలు బిసి కమిషన్ పరిశీలనలో ఉన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆయా కులాల సామాజిక జీవన స్థితిగతులను అధ్యయనం చేయడానికి, వారి నివాస ప్రాంతాలను బిసి కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి సందర్శించనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 26న వేములవాడ, సిరిసిల్లలో పర్యటించి వంశరాజ్, దొమ్మర కులస్థుల నివాస ప్రాంతాలను కమిషన్ సందర్శించి అధ్యయనం చేయనుంది. అదేవిధంగా 27న జగిత్యాల, ధర్మపురిలలో పర్యటించి వంశరాజ్, దొమ్మర, వీరభద్రీయ కులాల వారిని కమిషన్ అధ్యయనం చేయనుంది.

# రాష్ట్రంలో బిఆర్‌ఎస్ దుకాణం క్లోజ్

## టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్‌ఎస్ సృష్టించిన ఆర్థిక విధ్వంస పునాధులపై రైజింగ్ తెలంగాణ నినాదంతో రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తున్నామని, ఈ దెబ్బతో తెలంగాణలో బిఆర్‌ఎస్ దుకాణం బంద్ అవుతుందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. తెలంగాణలో ఈసారి సింగిల్‌గానే మళ్లీ బిఆర్‌ఎస్‌దే అధికారమని కెసిఆర్ పేర్కొనడంపై మహేష్‌కుమార్ స్పందించారు. మళ్లీ అధికారంలోకి వస్తామని కెసిఆర్ కంటున్న పగటి కలలు మానుకోవాలని మహేష్‌కుమార్‌గౌడ్ హితవు పలికారు. గత పదేళ్లతో పోలిస్తే తెలంగాణ ఇప్పుడు ప్రగతిపథంలో కొనసాగుతోందని, ఈ విషయం ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. అమావాస్య చంద్రుడిలా ఫామ్ హౌస్ నుంచి బయటికొచ్చిన ప్రతిసారి ప్రగల్భాలు పలకడం కెసిఆర్‌కు బాగా అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బడ్జెట్ చూసి బిఆర్‌ఎస్ నేతలకు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. సింగిల్‌గానే కాదు బిజెపితో బిఆర్‌ఎస్ జతకట్టినా మళ్లీ అధికారం కాంగ్రెస్‌దేనని ఆయన స్పష్టం చేశారు. పదేళ్ల పరిపాలనపై బిఆర్‌ఎస్ పేరు ఎత్తితేనే తెలంగాణ ప్రజలు చీదరించుకుంటున్నారని పేర్కొన్నారు. పదేళ్లు మీరు కేంద్రంలోని ప్రధాని మోదీకి దాసోహం కావడంతోనే తెలంగాణకు కేంద్రం నుండి న్యాయంగా దక్కాల్సిన వాటాలు దక్కలేదని విమర్శించారు. కుటుంబం కోసం కెసిఆర్ తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని విమర్శించారు. పదేళ్లు పిట్ట కథలు చెప్పుకుంటూ పాలన సాగించిన బిఆర్‌ఎస్‌కు ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో పయణిస్తుంటే సమస్యల వలయంలో చిక్కుకుందని వ్యాఖ్యానించడం కెసిఆర్ అహంకారానికి నిదర్శనమన్నారు. దేశంలో ఏక్కడా లేని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు కూలీలను కూడా ఏడాదికి రూ.12 వేలు ఇస్తూ భరోసా కల్పించిందని తెలిపారు.

# డిజిజిఐ కొరడా

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక మంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది. రూ.126 కోట్లను ఫ్రీజ్ చేసినట్లు పేర్కొంది. మనీ గేమింగ్ ప్లాట్ ఫామ్స్‌తో అప్రమత్తంగా ఉండాలని.. వాటిని ఎవరూ వినియోగించొద్దని డిజిజిఐ సూచించింది. కొన్ని సంస్థలను నమోదు చేయకుండా, ఆదాయాన్ని దాచిపెడుతూ జిఎస్‌టి ఎగవేతలకు పాల్పడుతున్న చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్‌పై చర్యలు తీసుకున్నామని.. 357 వైబ్‌సైట్స్‌ని ఐటిశాఖ సమన్వయంతో బ్లాక్ చేసినట్లు మంత్రిత్వశాఖ పేర్కొంది. బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌కు పాల్పడుతోన్న సుమారు 700 సంస్థలపై నిఘా వేసినట్లు పేర్కొంది. దేశం వెలుపల ఈ తరహా సంస్థలు నడుపుతోన్న పలువురు భారతీయులపై డిజిజిఐ మరో ఆపరేషన్ చేపట్టి.. వారికి సంబంధించిన 166 ఖాతాలను బ్లాక్ చేసింది. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నది. చాలామంది బాలీవుడ్ ప్రముఖులు, క్రికెటర్లు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ ఈ ప్లాట్‌ఫామ్స్‌కు ప్రచారం నిర్వహిస్తున్నట్లుగా గుర్తించినట్లు పేర్కొంది. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. ఆ ప్లాట్‌ఫామ్స్ వ్యక్తుల ఆర్థిక భద్రతను దెబ్బతీసే అవకాశం ఉందని.. దేశ భద్రతను దెబ్బతీసే కార్యకలాపాలకు అవి పరోక్షంగా మద్దతు ఇచ్చే అవకాశాలున్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. జిఎస్‌టి చట్టం ప్రకారం.. ఆన్‌లైన్ గేమింగ్‌కు 28శాతం జిఎస్‌టి విధిస్తున్నారు. ఈ రంగంలో పని చేస్తున్న సంస్థలు జిఎస్‌టి కింద రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. రాబోయే ఐపిఎల్ సీజన్‌తో సహా చట్టవిరుద్ధమైన గేమింగ్ కార్యకలాపాలను అరికట్టేందుకు మరింత కఠిన చర్యలు ఉంటాయని పేర్కొంది. బెట్టింగ్ యాప్స్ ద్వారా అప్పులపాలై ఇప్పటికే చాలా మంది ఆత్మహత్యకు పాల్పడ్డారని పలువురు పెర్కొనారు. ఇప్పటికైనా ఈ బెట్టింగ్ యాప్స్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు అవలంబించాలని కోరుతున్నారు. ఇప్పటికే బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన పలువురు యూట్యూబర్లు భాయ్య సందీప్, హర్షసాయి, రీతు చౌదరి, విష్ణుప్రియ, యాంకర్ శ్యామల తదితరులపై పంజగుట్ట పోలీసులు కేసులు నమోదు చేయగా మియాపూర్ పోలీసులు బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న సినీ హీరోలు దగ్గుబాటి రానా, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, ప్రకాష్ రాజ్, ప్రణీత, నిధి అగర్వాల్ లపై కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులలో ఉన్న నిందితులకు ఇప్పటికే పోలీసులు నోటీసులు ఇచ్చి లోతుగా విచారించి అరెస్టులు చేస్తుండగా మరికొందరు నిందితులు హైకోర్టును ఆశ్రయించి అరెస్టు నుంచి మినహింపు పొందారు.

### బెట్టింగ్ యాప్‌లపై సీరియస్‌గా వ్యవహరిస్తాం: శిఖాగోయల్

రాష్ట్రంలో కొనసాగుతున్న బెట్టంగ్ యాప్‌లపై సీరియస్‌గా వ్యవహరిస్తామని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) డైరెక్టర్ శికాగోయల్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల్లో బెట్టింగ్ యాప్స్ నిషేధం ఉందన్నారు.ఆన్‌లైన్ గేమింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు చెందిన 108 యాప్స్ బ్లాక్ చేశామన్నారు.133 కంపెనీలు జియో ఫెన్సింగ్ చేశారు. ఈ యాప్స్ తెలంగాణ ప్రాతంలో రావు ఇతర రాష్ట్రాలో వస్తాయి. మరికొన్ని యాప్స్ అబ్రాడ్ నుంచి కొనసాగిస్తున్నారు. ఇలాంటి యాప్స్ కొనసాగించినట్లు తెలిస్తే తమకు వాట్సాప్ నెంబర్ 8712672222 నెంబర్‌పై సమాచారం అందించాలన్నారు. రాష్ట్రంలో వీరిబారిన పడి ఆత్మహత్యకు పాల్పడిన వివరాలు సేకరిస్తున్నామన్నారు. బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు, ప్రమోటర్లపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 మంది ఆత్మహత్యకు పాల్పడగా ఒక్క హైదరాబాద్‌లో ఎనిమిది ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు.

# జిఓ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1948 కనీస వేతనాల చట్టం ప్రకారం డి.ఎ. లింకప్ అయిన జిఒలను ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి వేతనాలు సవరించి జిఒను విడుదల చేయాల్సి ఉండగా కనీస వేతనాలు సవరించి దాదాపు 18 కావస్తున్నా జిఒలు సవరించకపోవటం అన్యాయమన్నారు. దీని వల్ల కార్మికులు నామమాత్రపు వేతనాలు పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల బోర్డును నియమించకుంటే కార్మికులు కోర్టుకు వెళ్ళి బోర్డును ఏర్పాటు చేయించుకోవటం జరిగింది. బోర్డు కాలపరిమితి ముగిసిన వెంటనే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 2వ బోర్డును కూడా ఏర్పాటు చేయించుకోవటం జరిగింది. ఈ రెండు బోర్డులలో అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించిందన్నారు. ఈ రెండు బోర్డుల కాలపరిధిలో అన్ని కార్మిక సంఘాలు కలిసి శాస్త్రీయ పద్ధతిలో 1948 కనీస వేతనాల చట్ట పరిధిలో కనీస వేతనాలు ఏలా ఉండాలనే అంశాలను చర్చించి 2017లో లేబర్ కమిషనర్‌కు నివేదించగా, 2019లో బోర్డు సలహాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి పంపించారన్నారు. దీంతో గత ప్రభుత్వం 2021 జూన్ 25 నుండి 30వ తేదీ వరకు వరుసగా 1) సెక్యూరిటీ సర్వీసెస్ జిఒనెం.21, 22, 23, 24, 25, నెంబర్లు గల 5 జిఒలను విడుదల చేసింది. కానీవాటిని గెజిట్ రూపంలో విడుదల చేయకపోవడం అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ఈ జిఒలను వెంటనే గెజిట్ ప్రింట్ చేసి అమల్లోకి తేవాలని ఆయన కోరారు.లేబర్ డిపార్ట్‌మెంట్ ముందు ఉన్న 12 జిఒలను ప్రభుత్వానికి నివేదించాలని, అలాగే ఇప్పటికే సిద్దంగా ఉన్న 56 జిఒలను కూడా సరిచేసి సవరించి విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టగానే మళ్ళీ కొత్త ప్లిమినరీ నోటిఫికేషన్లు విడుదల చేయటం అన్యాయమనానరు. ఒకసారి నోటిఫికేషన్ అయినఅంశంపై ఇంకొకసారి నోటిఫికేషన్ జారీ చేయటం వీలు కాదని,. రెండవసారి జారీ చేసిన నోటిఫికేషన్లను వెంటనే రద్దు చేసి గతంలో వేసిన 2 బోర్డుల సిపార్సుల ఆధారంగా జి.ఓ.లను విడుదల చేయాలనికా కోరారు. ఈ ధర్నాలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, ఎఐయుటియుసి రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.బాబురావు, ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, మాజీ చైర్మెన్ నారాయణ, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, కనీస వేతన సలహా మండలి మాజీ సభ్యులు మల్లిఖార్జున్, ఎఐటియుసి నగర ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటయ్య, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి హాసీనాబేగం, కార్యదర్శి జె.లక్ష్మి , వర్కింగ్ ప్రెసిడెంట్ యం.లక్షీబాయి తదితరులు పాల్గొన్నారు.

# విక్రయ ముఠా అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

ఇరుకుల్ల వేదప్రకాశ్ (53),మట్టెవాడ,వరంగల్, మహ్మద్ సిద్దిక్ ఆలీ (46),లక్ష్మి పురం, వరంగల్, నూక రాజేష్ ఆలియాస్ రాజు (40),సుల్తాన్‌బాద్, పెద్దపల్లి జిల్లా, యల్లం సదాశివుడు (57), కరీంనగర్, యం.డి రఫీక్(50), గోవిందరావుపేట, ములు గు జిల్లా, ఆళ్లచేరువు శేఖర్ (37), మదుగు, ప్రకాశం జిల్లా ఏపి,పాదిళ్ళ సాంబయ్య (55), దుగ్గొండి,వరంగల్ జిల్లా, విష్ణు వర్ధన్ (ప్రస్తుతం పరారీలో వున్నాడు), ముద్దగుల ఆదిత్య (32), హైదరాబాద్(ప్రస్తుతం జైలులో వున్నాడు) ఉన్నారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలు వెల్లడిస్తూ.. పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు, వ్యవసాధికారులు సంయుక్తంగా కలిసి మట్టెవాడ బోడ్రాయి ప్రాంతంలోని ప్రధాన నిందితుడు ఇరుకుళ్ళ వేదప్రకాశ్ ఇంటిపై దాడి చేసి మరో ముగ్గురు నిందితులు సిద్దిక్,రాజేష్,సదాశివుడులను పోలీసులు అదుపులోకి తీసుకోని ఇంటి నుండి పెద్ద మొత్తం నకిలీ, గడువు తీరిన పురుగు మందులను స్వాధీనం చేసుకొని నిందితులను మట్టెవాడ పోలీస్ స్టేషన్‌కు తరలించిన అనంతరం పోలీసులు నిందితులను విచారించారు. ప్రధాన నిందితుడైన ఇరుకుళ్ల వేదప్రకాశ్ సులభంగా డబ్బు సంపాదించాలనే అలోచనతో నిందితుడు స్థానికంగా వుండే పురుగు మం దుల వ్యాపారస్తుల నుండి పెద్ద మొత్తంలో కాలం తీరిన పురుగు మందులను కోనుగొలు చేయడంతో పాటు స్థానిక పురుగు మందుల కంపెనీ ప్రతినిధి అయిన మరో నిందితుడు సిద్దిక్ వద్ద కొనుగోలు చెసినట్లు చెప్పాడు. ఈ విధంగా కొనుగోలు చేసిన గడుగు తీరిన పురుగు మందులతో పాటు, మరో ఇద్దరు నిందితులైన ఆళ్ళచెరువు శేఖర్, విష్ణువర్ధన్, ప్రస్తుతం జైలులో వున్న ఆదిత్యల నుండి ప్రముఖ పురుగు కంపెనీలైన దనూక, టాటా,ర్యాలిస్, బెయర్,అడ్మాతో పాటు మరికొన్ని కంపెనీ పేర్లతో తయారు చేసిన నకిలీ పురుగు మందులను కొనుగోలు చేసేవాడు. ఈ విధంగా సేకరించిన గడువు తీరిన పరుగు మందులతో పాటు, నకిలీ పురుగు మందులను ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేని మిగితా నిందితులకు విక్రయించాడు. పోలీసులు అరెస్టు చేసిన ప్రధాన నిందితుడితో పాటు సదాశివుడు, రాజు, ఆదిత్యలు గతంలోను పలు కేసుల్లో నిందితులుగా వున్నారు. ప్రధాన నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు ఆళ్ళచెరువు శేఖర్, విష్ణువర్ధన్‌ల గౌడోల్లపై టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు దాడులు పెద్ద మొత్తం నకిలీ పురుగు మందులు, వీటి తయారికి వినియోగించే యంత్ర సామగ్రి, లేబుళ్ళు, కల్తీ విత్తనాలు, రెండు కార్లు, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ కల్తీ వ్యవహారంలో నిందితులను పట్టుకొవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్ ఫోర్స్, వరంగల్ ఏసిపిలు మధుసూదన్, నందిరామ్ నాయక్, ఇన్స్పెక్టర్లు ఎస్. రాజు, గోపి, ఎస్.ఐలు వంశీకృష్ణ, నవీన్, ఆర్.ఎస్.ఐ భాను ప్రకాశ్, ఏఏఓ సల్మాన్ పాషా, టాస్క్ ఫోర్స్ కానిస్టేబుల్స్ సురేష్, సురేందర్, సాంబరాజు, శ్రీనివాస్, సతీష్ కుమార్, నాగరాజులను పోలీస్ కమిషనర్ అభినందించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com